UNIVERSAL LIBRARY
OU_206239
UNIVERSAL LIBRARY

**OSMANIA UNIVERSITY LIBRARY**

Call No. T83·1 B57T Accession No. T 4012

Author భమిడిపాటి కామేశ్వరరావు

Title ఆకనలాగ


This book should be returned on or before the date last marked below

కొండపల్లి ప్రచురణలు

# తనలో

భమిడిపాటి కామేశ్వరరావు

T
83.1
B57T



# తనతో

భమిడిపాటి కామేశ్వరరావు

బుక్ [illegible]
సుల్తా [illegible]
[illegible]
కొండపల్లి వీరవెంకయ్య అండ్ సన్సు
శ్రీ సత్యనారాయణ బుక్ డిపో
రాజమండ్రి

[illegible]

మొదటి ముద్రణం, సెప్టెంబరు 1949
రెండవ ముద్రణం, మార్చి 1952

శ్రీ కొండపల్లి ముద్రాశాల
రాజమండ్రి

## విషయములు


| | | |
|---|---|---|
| విశ్వమిత్రరావు - తనలో - | మార్చి | 1941 |
| చారుదత్తరావు ధోరణి | సెప్టెంబరు | 1941 |
| ...లో | ఫిబ్రవరి | 1943 |
| ... | ఆగస్టు | 1943 |
| ...వళి | అక్టోబరు | 1947 |
| ...కలం | నవంబరు | 1948 |
| ...ం | ఆగస్టు | 1928 |
| ...రావు - తనలో | ఆగస్టు | 1949 |
| ...బోధ | అక్టోబరు | 1942 |

# విశ్వామిత్రరావు-తనలో

నిజమే! పని వేరు, మాటలు వేరు. పని అంటే మాటలు చెప్పడం కాదు కాని, మాటలు చెప్పడం పనేగా! అసలు 'మాట' అనేదే పని, అందుకోనూ అనేకులు అనేక కాలం నిరంతరంగా చేసిన పనంతా కలిపితేగాని ఒక్క మాట అవదు. కాబట్టి మాటలు చెప్పడం మాటలు కాదు, సరిగదా, డబ్బినికూడానూ! ఏమైతేం, మాటలు నా వృత్తికర్మకి ఉపయోగించే దినుసు. మాట అనేదాల్లో ఒక విశేషం ఉంది. మాటయొక్క వస్తుతత్వం గమనిస్తే అందులో దొరికేవి వాయువూ ఆకాశమూనూ! ఈ రెండూ భూతాలే. భూతం అంటే, వెనకనించీ-ప్రాణికోటి పుట్టినప్పణ్ణించీ ఉండేసుకుంటూ వచ్చేస్తూన్న పదార్థం. అందువల్ల, న్యాయంబట్టి చూస్తే, భూతాలు మానవజాతికి-శుద్ధ న్యాయంబట్టి ప్రాణికోటికి-యావత్తుకీ వారసత్వంగల ఉమ్మడి ఆస్తి! అయితేం గడసర్లు భూమిని పంచేసుకున్నారు. జలాన్నికూడా పంచుకుంటున్నారు. వాయువుమీదకూడా యాజమాన్యాలు బయల్దేరేటట్టుంది. ఖగోళశాస్త్రశాలల వాళ్ళు-ఓ పాతికమంది కుంటారు-ఆకాశానికికూడా వాటాలెట్టి చీటీలు వేసుకున్నారు. కాని, వాయ్వాకాశాలు మిళితమైన మాటలు ఉమ్మడివాదంనిమిత్తం కాకపోతే పుట్టేవుండవుగనక, వ్యక్తులు వాటిని పంచుకోడం అసంభవం. నేను నా మాట వ్యవసాయంలో

కోస్తాను, కుప్పేస్తాను, నూరుస్తాను, పేరుస్తాను. అల్లా ఊహలూ తెగనరుక్కు పోవడమే కాని, ఆ మాటలు ఎవరెవరి కుంటా, ఎం తెంతవరకూ అంటూ కూచోను, కూచోవలసిన అవసరం లేదు. మాటలమీద స్వంతహక్కు పేటెక బ్రహ్మరుద్రుడికీ లేదు. నేను మాటలతో నా కొంప కట్టుగునే టప్పుడు ఆ దినుసు కనపడ్డ ప్రతీచోటినించీ, ప్రతీకొంపది అయినకాడికి కట్టలుకట్టి వేసేసుకు రావడమే కాని, అల్లా చెయ్యడం వల్ల ఎవడి కొంప కూల్తోందో, ఎవడి పాతు పెల్లగిలుతోందో, ఎవడి జీవం సన్నగిలుతుందో అంటూ చికాకుపడను. ఒక్క మానవజాతికి మాత్రమే భగవంతుడు కటాక్షించిన మాటలే వృత్తిగా పెట్టుగుని నేను మిక్కిలి తమాషాగా శ్రమపడి, రచనలూ, కల్పనలూ, అమరకాలూ, ఎకుమతులూ, ప్రయోగాలంలో చేసుకుంటూ, అవి నాపేరుమీదుగా మానవజాతికి దాఖలు చేసుకుంటూ, అందులో ఉండే సృష్టిప్రజ్ఞా, ప్రకటనసామర్థ్యమూ నావేగాని అన్యుడివి కావని జనం తమ పనితొందరలో గమనించక పోతారేమో అనే భయంచొప్పున నేనే ఢంకామీదకొట్టి చెప్పుగుంటూ, మన కేం ముకని చెప్పేసి చిక్కు సమయాల్లో ఊరుకుంటూ ఉంటూంటే, ఆ పనికి నన్ను అధముం ఊరేగించడం లేదు ఏమీ లేదు సరిగదా, నే నదో అపహారణం చేసినట్టు కొందరు కొందరు నామెదటే ఎందుకు ఈర్ష్య కక్కుతున్నారో నాకు ఆశ్చర్యంవేస్తుంది! నా మాటలు నేను నా

స్వంతచేత్తో నా సిరాతో వరసాగ్గా రాసినవి నా హృదయంలోని కావుట! నా హృదయం ఏళ్ళు మూశారూ! హృదయం అనేది మిథ్య అని నా నమ్మకం. పైగా, నామాటలు ఎంగిలిమాటలుట! అసలు ఎదేగా నాదం బాగా ఎంగిలి అయినతరవాతే గా 'మాట' అయి జనించడం! ఎంగిలి లోంచి పుట్టింది. మళ్ళీ ఎంగిలి అవడం ఏమిటి? అదీ కాక, మనిషి పలవనిబట్టి మాట విలువ ఉంటుందిట! వాళ్ళ ముఖం! మాటకి విలువ స్థిరమే అని నే నంటాను, దాంతో వాళ్ళ ఆట కట్టూ! బతుకు తెరువూ, త్వరగా పని చెమల్చడం, తేలికపనిమీద ప్రేమా, మార్గం ఏదయితేం పని జరపడం లేని ఘటాలతో పడడం కష్టం!

ఎందరికోసమని బెంగపెట్టుకోనూ! ఒకడైతే అనుకో వచ్చు! అబ్బబ్బ! మనస్సు చిట్టంకట్టి పోతోంది ప్రతీవాడూ నా పద సృష్టిగురించి అనుమానించడమే! తలకిమాసిన ప్రతీవాడూ ఎవరూ లేనట్టు నా దగ్గిరకే వచ్చి తెగ వాపోతూండడం! ఏమని తనకి లోపల ఏదో పెద్ద ప్రజ్ఞ ఉందిట, అప్రత్యేక ప్రజ్ఞతో తను ఏదో మాటలపచ్చిపులుసు చేశాట్ట! ఆ ప్రజ్ఞకి తగ్గ రాణింపు లేదుట! ఆ ప్రజ్ఞని గుర్తించడానికి దేశానికి తెలివి లేదుట! పైగా ఆ ప్రజ్ఞని అడ్డమైనవాడూ (ధ్వని నిస్సందేహంగా నన్నుగురించే!) అందినంతవరకు అవుపోసనంపట్టి వాడేసుకోడంట! ఇదీ సొద! ఈసొదంతా నిజమే అయితే జనం అంతా ఘొల్లు మనవలసిందే! కాని,

నేనొక్కణ్ణే ఇవ్వష్టించీ ఎంజెయ్యనూ! నా గ్రంథసృష్టిలో విపరీతమైన నేర్పరితనం ఉన్నమాట రూఢి! నేనే చెబుతాను, భయమూ! అది నేనే ఆర్జించుకున్నాను. కొన్నికొన్ని బైరాగి చిట్కాలూ, నేపాళమాత్రలూ, గోటిమీటులూ, అడ్డగీటులూ, ఉత్తరింపులూ, కత్తిరి పులూ ఏవేవో కల్పించి అలవాటు చేసుకుని వాటిని గురించిన కళోపాసనలో ఉన్నాను. అతిరహస్యమైన క్రమశిక్షవల్ల వాటిని నేను అభివృద్ధిలోకి గూడా తెచ్చుకున్నాను. ఈవృత్తిలో పైకి రావడానికి ఇంకా కొందరు పాకులాడేవాళ్ళు ఉన్నా, వాళ్ళకి నా ఉపాయాల రకంవి పుట్టవు, పట్టవు, గిట్టవు, తెలియవు, ఎక్కవు నప్పవు అని మధ్యవర్తులు అనేశారు ఇక, నా విషయంలో ఇటువంటి ఉపాయాలు వంటింటికుందేళ్ళలాగ మచ్చికపడి, కామధేనువుల్లాగ కురిసి, కల్పవృక్షాల్లాగ ఫలించి, తామర తంపరగా పాకి, తేగలపాతరలాగూ, ఏకోత్తరవృద్ధిగా విజృంభించి పోతాయి. అయినా చెప్పుకుంటే బడాయి అంటారనిన్నీ, నన్ను ధిక్కరించేవాళ్ళు నామతంలో బతుక్లేరుతారేమో అనే భయంవల్లనున్నూ నేను చెప్పను. పుణ్యమూ పురుషార్థమూ, ఎందుకొచ్చిందయ్యా నీకీ మాటలపరిశ్రమా అని ఎవరేనా అడగగలరు! అవును! నాకు కాలం కలిసిరాదు, సొమ్ము దఖలుపడదు, ప్రతిష్ఠ దక్కదు, పలుకుబడి హెచ్చదు, జనవశత్వం చేకూరదు-కాని ఎటొచ్చీ హాస్త్రం గుళ్యాభరణానికి తాత్కాలికంగా పేరుకి కొంచెం ప్రచార లాభంమాత్రం ఉంటుంది. ఆ పేరు కాస్తా నా పేరే

అయితే తీరిపోతుం దని నాయత్నం, ఈ స్వల్పలాభం నిమి
త్తం నేను వీలైనంత తక్కువ పరిశ్రమ మాత్రమే
పడాలి అని చెప్పినవాడు మనిషా, కదంవాడా! స్వల్పమైనా
సరే లాభం అనేది స్వలాభం అయేటట్లు చూచుకోకుండా
ఎవడేనా ఏమన్నా చేస్తున్నాడా? నేనుమాత్రం ఎందుకు
చెయ్యాలి అంటా! మాటకారి వృత్తిలో నేను నేర్చిన ఆహా
విద్యలు నేను ఎందుకు వదులుకోవాలి అంటా! ఇంతమంది
వాజమ్మలు ఉంటూంటే నేనా వెనకయ్యలాంటి జనానికి కన
బడ్డాను మెత్తమెత్తగా! నా శబ్దమాత్రాన్ని నా ప్రాంత నేను
తొక్కకుండా మానుకోవలిసి ఉంటుందీ అని నాతో చెప్ప
డానికి తాహతు ఉన్న వ్యక్తి ఎవడు? లేక ఎవతె? లేక ఏది?
—దేవుడా? అదృశ్యుడు గనక ఎక్స్‌పార్టీ! జనమా? నన్ను
మినహాయించి అసలైన జను డేడీ! రాజులా? వాళ్ళకి దేవా
కావలసిన గోష! ఇంద్రులా? దిగ్గజాలయితేం నాబోటి
పుత్రులంటే వాళ్ళకి సింహస్వప్నంగా! పెద్దలా! అస్ఖలిత
మూర్ఖులైపోయి సిద్ధంగా ఉన్నారే! అధికారమా? ఓవ్యక్తి
కోసం ఏడుస్తూ కూచోగలదా! సంఘమా? వెర్రితలలు
వేసిన వేపచెట్టాయెర! మతమా? పరిశోధనచేస్తే మనిషిలో
మతంగా! సిగ్గా? అది మానవలక్షణం అని నేను అనుకోనే!
పాపమా? అది నిర్వచనం అయి యేడిసిందా, చిన్న నిర్వచ
నం ఎదేనా నా ఒప్పందం లేందే చెల్లుతుందా!!! అందులో
అంతో యింతో అస్కారం గలవాళ్ళుకూడా వచ్చి గడ్డి ఱచి

కరమే అని నొక్కి చెప్పేటప్పుడు ఎదుగడ్డియొక్క రుచి భేదం నేను కనిపెట్టడమూ నాద్రోహం! నే కనపరిచే పద సృష్టిచాతుర్యాన్ని నేరం అనడానికి ఎవడికేగా సరే ఉన్నం తినే నోరెట్లా వస్తుదో నాకు బోధపడదు. అన్నీ అల్లా ఉంచండి. ఇవేం మామూలు రోజులా? స్వాతంత్ర్యం వాల్లాడి పోతూండే రోజులుగదా! నా స్వాతంత్ర్యం నాది! నేను నెగ్గి తీరతాను, ఎల్లా నెగ్గతేం!

వారం పదిరోజు లైంది. కలంధాటి వెంకయ్య నాదగ్గిరకొచ్చి కాకిగోల! తను అపూర్వకవిట, తను స్వతంత్రకవిట, తన రచన పూర్వంనించీ అచ్చులో ఉందిట, తన బుర్రకాయయొక్క ఉత్పన్నాలుమాత్రమే ఆ రచనలోంచి తొంగిచూస్తూ ఉంటాయిట, ఆ రచనలో మాటలన్నీ తన స్వంతి తాతయ్యగారి మాటట! తన కష్టార్జితం, స్వార్జితం, నేను తనతో చెప్పకుండా, తంది అని కూడా అనకుండా దోచుకుని (అనేమాట నా చెవిని పడగానే వెంకయ్య ఎడం దవడ మీద నగిషీపని కనపరిచేశాను)—తస్కరించి, కొల్లగొట్టి, మార్చి, పిరాయించి, పచ్చడిచేసి, ధ్వంసంచేసి, పరిశ్రమ నాదే అని జనం దగాపడిపోయి నమ్మగలందులకు నేను పన్లు చేశాంట! ఉసూరు మనడం మొదలెట్టాడు. నాకొళ్లు భగ్గు మని పోయింది. నేను అసలు దేవాంతక నరాంతకుణ్ణి! చివరకి నేను రెండు రోజుల్లో ఒక నాటకం చేసి మర్నాటికి అచ్చువేసేసరికి ఓర్వలేక ఓ బదుద్ధాయి నన్ను విమర్శిస్తూ, అందులో పాత్రలైన దేవుళ్ళనీ, మనుష్యుల్నీకూడా నేను

ఖూనీ చేశావని తెగరాసి నన్ను తిడుకూన్నట్టు సంతోషించు గుంటూ నా దేవాంతకత్వ నరాంతకత్వాలు ఖాయం పరిచి పరిష్కరించిపెట్టాడు. నేను విమర్శాతీతుణ్ణి! నాపరోక్షంలో జనం నన్ను ఏమని చెప్పుకుంటారో కదా అనే చింత నాకు ఆదినించీ లేదు. ఎవడేనా నన్ను తిట్టినా కొన్ని గాలికనుక నున్నా, తిట్లన్నీ గాలికి పోయేవి గనకనుకున్నా, గాలిగాళ్లు ఋషులు రాజాలకి పోవడంచేతనున్నా అవన్నీ నేను మరిచి పోగల్ను, ఉపేక్షిస్తే తుడిచేసుకుని, వాణ్ణే దువ్వేసి పడగొట్ట గల్ను. కాని, పాంగోమని నా మీదపడి తోడుతూ రాగాలు పెడుతూంటే నేను కరుకుగా ఉండలేను. అప్పుడు నేను పెన కయ్యాని చూసి, జోరుతగ్గి, జాలి అభినయించి, కళ్ళకి కర్పూరం రాసుకుని, వాడి కడుపుబ్బకి నిర్ఘాంతపడి వాణ్ణి ఈ రీతిగా మందలించాను:

“ఓరీ! అనద్యంతన భూతకవీ! పెనకయ్యా! సిసిగ్గో య్యా! నీ పెనకాలకూడా కవులు ఉండేవాళ్ళోయ్! నువ్వే ఈశరీరంలో పెనక ఉండి ఉండవు గనక, అపూర్వుడవే! స్వంతానికి ఎన్నో తంత్రాలు పన్ని పగరచన చేశావు గనక స్వ—తంత్రుడవే! నీకు అనర్హమైన గౌరవం, సుప్రసిద్ధకవు లతో నామసమన్వయం సంక్రమిస్తూ యుండి విచారించి నీ పెన కటి వొంకలు కదపకుండా ఇప్పుడు ఆగుతాను. లేకపోతే నువ్వు ఆగుతావా! నిన్ను కవి అనడానికి మరోరికియ్య తరు ణం! ఏమనువ్వే ఇల్లా అనుకోగలిగితే, నేను అయిదాకగు

టికి కన్నుగీటేసరికి నన్ను ఇల్లా ఎత్తేస్తారే ఆకాశందాకా! నేనుమాత్రం తక్కువ తిన్నానా? నీకు ఉందని నువ్వు భ్రమించే బోడి బొప్పాయికవితాప్రజ్ఞే కాకుండా నీ దగ్గరకలికంలోకి కూడా దొరకని సంగ్రహీ పునేర్వరితనం ఉండే నాదగ్గర! దాన్ని చూసి నువ్వు ఇంత ఏడు పెండుకురా, నీ ఏడుపు టాకీలియ్యా! మాటలు ఏరుకతిని జీవించే మా సత్తులంలో కొందరు తప్పుపుట్టడం వల్ల నాకు తలవంపులు అయిపోతున్నాయి. వాళ్ళు నాకుమల్లేనే మొదట్లో మాటల అమరకంలో నేర్పు చూపించినా బెదిరి నేసరికి కాళ్లమీద పడడం కుమారుణ్ణి కోరుకోడం, అజ్ఞానం దాఖలుచేసుగోడంలాటి అడాగిపన్లు చేస్తున్నారు. వాళ్లు భయస్థులు. ధనాపహరణానికే దిక్కు లేకపోతే, ప్రాణాపహరణానికే అదుపాజ్ఞ లేకపోతే, వస్త్రాపహరణానికే టికాణా లేకపోతే, ఇక పదాపహారణానికా దిక్కొస్తా! ఇంతమాత్రానికి భూమిని కంపించమన్నావా, లోకమక్కని లోకఝూడించమన్నావా! ఛీ! పో! నేను తెగేసి చెబుతున్నాను. జాగర్తగా విను. విని నీదిక్కున్నచోట చెప్పుకో! నాకు నువ్వుపుట్టించావనుకుంటూన్న మాటలభయంగాని, నిన్ను పుట్టించిన బ్రహ్మభయంగాని లేదు. ఎవడు చూడొచ్చాడు పోదూ అని కాదు నేను ఈనే ర్పుతో నాకొత్త మాటలు పోగుచేసింది! ఎవడు చూసిఎంజెయ్యగలడో చూస్తాను రమ్మను అనే ధైర్యంతో! నీసప్తకల్ల రచనని నేను తెలిసే వాడునున్నానోయ్, అచ్చుపడ్డంతోటే చచ్చిపోయిన కవియ్యా! ఇంకోరి రచన ముందే అని చెప్పు

గుని సత్కరించడం అంత నిశ్చింతపనీ, తేలికపనీ, గొప్పపనీ, ఖర్చులేనిపనీ ఏదీ లేదోయ్! అప్రయోజకుడా! నిన్నింతో మెచ్చి నిన్ను మిక్కిలి "సత్క"రించడంకోసం నేను దాన్ని ఎత్తుకుంటే, అతిరజ్ఞానం తడబడే ఘటాలు ఆ పనిని "సత్క"రించడం అంటున్నారు! వాళ్ళ మాటలు మరి రాసివి వింటే నువ్వు ఏడవడానికికూడా పనికిరావు ఒరేయ్! అను అన్నట్టు నాయిష్టం! నారాజ్యం! నువ్వెవడవ్ నాకు ద్రోహం కట్టడానికి! నువ్వు ఏడిచినంతమాత్రాన్ని నాది నేరం అవుతుందా! నా పని నేరంఅని మనంలో నూటికి తొంభైమంది నువ్వు చెప్పినా గ్రహించగోలేరుగా! ఇక తక్కిన పదిమందిలోనూ తెలిసేవాళ్లుంటే వాళ్ళకి నన్ను శిక్షించే మార్గం లేదుగా! అదీ, అధికారంమూ కూడా ఉన్నవాళ్ళకి నాకౌ మోత వినపడ్డంత ఖంగున గుండెదుకుడు వినిపించక పోవచ్చుగా! కవికి సొమ్ము అందదు, అంకదు, అబ్బదు, అగదు గనక వాడి ఐశ్వర్యం అంతా వాడిరచన. అది మాట వ్యాపారం. మాటలు ఎదురుగుండా పెట్టినప్పుడు అవి నోటి మాటలో, గుండెమాటలో, ఎవడినోరో తేల్చడం దుష్కటం అందుకని అన్యుడి రచన లగాయించి నాదే అనడం అంత బ్రహ్మవిద్య అదేగాని రెండోది లేదసి నువ్వు బొత్తిగా గ్రహించినట్టు కనపడవే! ఓరీ చవటా! ఇప్పుడేనా నీకు మతి గాని, ఇంగిత జ్ఞానంగాని, నేర్పుగాని, బతుకు తెరువుగాని ఉంటే నీ రచన నేను చెపాయించేసి, నా పరం చేసుకున్నా నని నువ్వు మొత్తుకునేకంటె నా నవ్యరచన గడుసుదనంగా

మళ్ళీ నువ్వు నోట్లో వేసుకుని, దాన్ని నవ్యతరం చేసి, అది నీదే అని చెప్పుకో! నే వద్దన్నానా! కావలిస్తే నీళ్లు వట్రా, ధారపోసేస్తాను! ప్రచురణవల్ల ఏకలాభం ఏమిటంటే, పేరుఅచ్చులోకి ఎక్కడం, ఆ పేరుకి కీర్తి ప్రచారం, తద్వారా ముందుముందు, అనగా వీలైనంతవరకు వ్యక్తి మరణించేలోపల ఎక్కువైన పెద్దగాథ ఉండవచ్చునన్నదే ఆశ- అంతమాత్రానికి అంతస్వల్పానికి నేను నా గొప్పబుర్ర వ్యయంచేస్తానా? అది నాస్తా అగ్గి చల్లోడానికి నేను చెమట ఓడుస్తానా? మరి ఏంజేస్తానూ? లీలగా యత్నించి జోరుగా నెగ్గేస్తాను, అన్నీ మార్గాలే! ఇదిగో శాంపిల్ చూ! బాగు పడు! -

సరికొత్త అన్యభాషాగ్రంథం ఇంకా నావాళ్ళు ఎవరూ కొని ఉండరు గనక నన్నూ, ముక్కలిపాత అన్య భాషాగ్రంథం చాలాఉంది పారేసుకుని ఉంటారు గనక నున్నా అటువంటిది నాభాషలోకి ముక్కకిముక్క దించేసి ఆరచన నా స్వంత, అనేస్తాను. దాంతో జనం, ఆ రచనలో ఉండే గొప్పతనాని కంతకీ మూలకారణం నాబుర్రలో ఉండే గుంజే అనిన్నీ, అదేతమలు తిట్టూ ఆ అనిన్నీ భ్రమించి నానామస్కారం చేసుకుంటారు. అలాగే పాతరచనలు తెచ్చి వాటిల్లో నామవాచకాలూ, పాత్రల పేర్లూ, స్థలాల పేర్లూ, సంస్థల పేర్లూ మార్చేసి తాజాగా రచన తయారుచేసి అది నాపేరట ప్రచురిస్తాను కొందరు అసమర్థులు

ఇల్లాంటి సాహసాలు చెయ్యడంలో కొన్నికొన్ని దూడలు వి
య్యడ వల్ల పట్టుబడి పోతాయి కాని, నేను ఆరితేరినవాణ్ణి
గనక నాకు తెలిశాలేదు లేకపోతే, పాతుచన పట్టుగుని దాని
రూపం మార్చేసి కొత్తస్వరూపం నా స్వంతం అంటాను.
పద్యాన్ని గద్యంగా దిమ్మర్లుగొడతాను, గద్యాన్ని కూడ
కొట్టి పద్యం చేస్తాను పురాణ ప్రబంధగతకాలంలోంచి ఏమి
ఎప్పుడు ఎంతవరకు ఏరకం ఏరూపంలో కావలిస్తే అట్లా
పుచ్చుగుని అది నాదే అని, నన్నెచ్చి అడిగేటంత నిచపుపన్ని
పండితులు చెయ్యరుగనక పామరుల్ని హడలగొడతాను.
నాటకాలూ పాట్లవంటివి అన్ని సంభాషణమాటలేగనక అవి
వీధుల్లోనూ, బజార్లోనూ పడిదొర్లే జాతిగనక మెడమీద
తలఉండి, నాడి సరిగ్గాఉన్న ప్రతివాడూ అవి పోగుచెయ్య
డానికి అర్హుడేగనక, వాళ్ళల్లో నేను మొదటివాణ్ణౌటాను.
నవలని పట్టుగుని కథచేసి, కథని పట్టుగుని నవలగా విస్త
రించి స్వంతం చేసుగోడానికి నేను వ్యవహరిస్తాను గనక
నాకు ధక్కా లేదు. కథలన్నీ ముసలమ్మలచేత ఉత్పత్తి
చెయ్యబడేవిగనక నేనూ మా ముసలమ్మచేత వడికించాను,
అది గాదే అనచ్చు. కాని ఆగమ, గోప, ఆదేశ, సంగ్రహణ
విస్తరణాలు పరివర్తనకి మూలసాధనాలుగనక, యాథార్థ్యం
దాచడానికి వాటిని ఉచితంగా, అతి కాకుండా వాడలి.
ఒక్కొక్కప్పుడు నేనుమరీతొందరలో మరీ జోరుగా రచించే
టప్పుడు, ఎవడిదో నీబోటి పాతచచ్చినాడి చవటపద్యం
ఎక్కించేసుగోవలసిన అవసరం నాకొస్తుంది. అంతతొందర

కోనూకూడా శాస్త్రపీలు గూసుగుని మార్పు చెయ్యగ
ల్నేమో గూస్తాను కందం పట్టుగుని గీతవాలకం వచ్చేలాగు
చెక్కేస్తాను. చంపకమాల ఉంటే గంపేమాల చేస్తాను.
శార్దూలానికి మసిపూసి భల్లూకంగా మారుస్తాను. పాతప
ద్యాల్లో ఉండే సమాసాలకి పట్టుకొమ్మలు పట్టించి, రబ్బరుబన్ని
యన్నిగనక తిరగా బోర్లా తిప్పినట్లు తిరగేసి ఆకొత్తస బాసం
ఎందే స్తుంటాను. అంతమాత్రం క్రైమ్ లేనప్పుడు, పాతరచన
వెతికి, అది గామనస్సుకి మిక్కిలి ఆనందం కలిగించి నేను
మట్టుకి ఇది ఎందుకు రచించలేనూ, నేను రచించుదాం అని
అనుకుంటూంటేనే నాకంటె ముందు పీడెవడో రచించి
ఇట్లో దాచుగోక అచ్చుకూడా కొట్టాడే అనికూడా నాకు
తోస్తే, ఆ రచనని అట్లాలా లాగేసి నాదే అని ప్రచారం
నిమిత్తం పంపుతాను. నిజయువల్ల పత్రికలు బహుళం అయిం
తరవాత రచనాప్రవాహానికి ఇరకాటం తగ్గింది. పత్రికాధి
పతుల్ని, వాళ్ళకుండే తొందరలో, దగా చెయ్యడం నిమిషం.
ఎందుచేతంటే తగాదా వచ్చేవరకూ పత్రికాధిపతికి నేను నాదే
అని పంపిన రచన నాదవునో కాదో, తెలియడానికి వీలె
ఉండాలి గనక, తెలియకు పాతరచయిత బతికుండి పేచీ గనక
పెడితే ఉపనాపనాలు కోయకోవానికి పత్రికాధిపతులకి
నేను మహారం కలగచేస్తూంటాను గనక నేను వాళ్ళ
పై వాణ్ణి! అదీ కాక శిలాశాసనాల్లాగ ఉన్న పాతరచనలు
కొన్నిటిని పాతరలోంచి పెల్లగించి అవి నాపేరట అచ్చు
కొట్టేసరికి, బహుశా నా నామధేయ సాంగత్యంవల్ల

వాటికి ప్రాణప్రతిష్ఠ అయి, వాటిని జనం జుట్టుకోడం మొదలెడితే వచ్చే పుణ్యంలో పోనీ ఆ చచ్చినాడికికూడా ఓ అణా వాటా ఇయ్యొచ్చును. ఇంకా, ఎరుగున్న పాతరచనయొక్క పేరుగాని, రచయితయొక్క ఇంటిపేరు అసలు పేర్లు గాని దొరక పుచ్చుకుని వాటిలో భాగాలు తుంచడంగాని, దించడంగాని, కుదించడంగాని, పెంచడంగాని నాకు అనుకూలించి నారచన శంఖతీర్థం అయేలాగు కనిపిస్తే అల్లా చేసేసి కావలిసుంటే నేను తరవాత మాట్లాడతాను ఒకప్పుడు నా పేరునే పరివర్తనం చెయ్యడంవల్ల అది భరతఖండంలో ఇతర భాషల్లో గొప్పవాళ్ళ పేర్లల్లో దేపలాగే పలుకుతుంది అంటే, అల్లా చేసేసి నా రచనకి విలవ లేవగొట్టిస్తాను. ఎవడేనాగనక నన్ను తన స్నేహితుడుగా ఎంచితే, వాడు అప్పట్లో ఏం రచన చెయ్యదల్చుకున్నాడో వాణ్ణి అడిగి తెలుసుకుని, వాడిరచన పూర్తి అయి ఇంకా ప్రచారం కాకుడానే నేనే అనేకగతులతో వేడివేడి సరుకు పాకంపట్టి ముందుగానే ప్రచురిస్తాను. వాడుగింజుకున్నా నన్ను చేసేది ఏమీ లేదు. ఎవడేనా తనవ్రాతప్రతి నన్ను చూడమనిగాని, నేకూస్తాను నాకు ఓమాటుఇయ్యి అని నేను అడిగినప్పుడుగాని, ఇచ్చాడా, చచ్చాడే! ఇహ వాడిరాత అంతే అనుకో! నేను అసలుకి ఫోటో తీసేసుకుని, అసలు వెనక్కి పంపించేస్తాం, "ఇది బాగులేదు, నిజం చెప్పాలంటే చాలా ఏపిసిసట్టుంది, దీన్ని ప్రైవేటులో దహనం చెయ్యి! నీకు పంట్లో సరిగా లేకపోతే పోనీ సహాగమనం వద్దులే! ప్రపంచానికి అల్లా చెయ్యకపోతే నష్టం" అని వాడికి సలహా ఇస్తాను. మరీ పిల్లేకవస్తే వ్రాత

ప్రతి నేనే ఉంచేసుకుంటాను. ఉంచేసుకుని, నా వ్రాతప్రతి ఒకటి ఉండాలనిన్నీ, నాకు ఎవడైతే అసలు ఇచ్చాడో వాడికే నేను లోగడ నాది ఇచ్చిన ఏట్టి జ్ఞాపకం అనిన్నీ, అది నాకు వాడు తప్పుడు పంపకపోతే వాడి మీద నేను చర్యజరుపు తాననిన్నీ కబురు పంపిస్తాను. దా తోటి వాడు ఆస్తి నాస్తి అవడమే కాకుండా ఋణస బంధం కూడా ఏర్పడి నోరుమూసుకుని కాళ్ళబేరాని కొస్తే అపరాధం పుచ్చుకుని వదిలి పెడతాను. తూర్పురాతల్ని పడమరకి గోకేసి విరుద్ధంగా తయారుచేసి నా వనేస్తాను, ఉత్తరాది రచనల్ని దాక్షిణాత్యంలో లాగేసి నా సొమ్మనేస్తాను నేను అసాధ్యుణ్ణోయ్, వెనకయ్యా! నువ్వు కాదాయిరవై ఇరవై కాలాలుగా కూచుని రకరకాలుగా ఏడవాలిగాని ఏం చెయ్యగలవ్? నీ వశం కాదోయ్, నా ధర్మమా రావడం, నా క్రీమని శంకించడం, నన్ను కాదనడం, నా కృతి అన్యుడి దనడం, అందులో ద్రోహం ఉందనడం! ఋజువు ..నీ బొంద! ..నీ తరమా! పైగా, నీ నత్తగుల్లబుర్రకే ఏదో అఖండభావం తోచిందని ఎగురుతున్నావే, నా అంతవాడికి, నీకే తోచగలిగిన దిక్కుమాలిన కక్కుర్తి అవకతవక బుద్ధిహీనపు ముక్కలు సరిగ్గా ఎందుకు తోచిఉండి ఉండకూడదూ అంటా! ఇల్లాంటి వెర్రిమాట ఇప్పుడంటే పైకి అన్నావ్ గాని, ఇహ నెప్పుడూ అని దివాల్లు తీయకు. ఈ మాటతో నీమీద నాకుండే గౌరవం అంతా పోయింది.

అయితేం, నీకు సలహా చెప్పేవాళ్ళు లేక పాడయినావు. నాకు తెప్పుతుందా, మరి, ఇల్లాంటి నౌకరి! చెబుతా, విను!

ఓకే ఎంగిలిపిడ్డగ్నా! తెలుగు గ్రంథభాష కాదు! మహాధికార్లకి ఇది తెలియదు, రాదు వచ్చినా రాదంటారు. రాదంటే గాని నువ్వా గౌరవించవు నువ్వు గతి చినతరవాత నీ కిది జ్ఞాపకం ఉంటే (– నాకు జ్ఞాపకం లేదు పొమ్మనేస్తాను!), దేవుడితో (—దేవుకంటూ ఉంటే!) చెప్పగుంది గాని లే అమ్మా! ఊరుకో! నీకింత అభిమానం గనక, నాయనోయ్ చూడు! రచన ప్రచురించడం మానెయ్! నాయెదట ఒట్టెట్టుగో, చూస్తాను! మానేసి మరోపని చూసుగో! ఒక వేళ ఉండబట్టలేక, అభ్యాసం అయిపోయి, మాటపాకం ఏదేనా చేసేశావా, అది పదిలంగా బుట్టలో పెట్టి అట్టేపెట్టుగుని, నిర్జనప్రదేశంలోకి వెళ్ళి, భూమ్మీద నువ్వు నుంచోదల్చుకుంటే భూమినితప్ప కడముభూతాల్ని అక్కణ్ణించి సాగనంపి, నీరచన పైకితీసి నువ్వేగబగశా కంటితో చూసుగుని, నీ అపూర్వత్వానికి నువ్వేమానసికంగా యోగ్యతాపత్రం ఇచ్చుకో! ఇంత నన్ను విసిగెత్తించావ్ గనక మరి దయచెయ్! శీఘ్రంగా! నేను నీకు నిజంగాకూడా ఏదో ద్రోహం చేశాను గావునని జపం అనుకోగల్రు! నడు!"

అని వెనకయ్యని పరామర్శించి, కర్రతెచ్చి వాడివీపు యొక్క సిలువు అడ్డం ఐమూలలకొలతలు సిసలుగ కొలిచి, అతని తిక్కవదిలిందని అనిపించి, నోరు మూసుకునేటట్టు చేసి, అతణ్ణి వడి వడిగా పొలిమేరదాకా దాటించేసి వచ్చి సచేలస్నానం చేసుకున్నాను! ఎల్లా వచ్చిందో! .

# చారుదత్తరావు ధోరణి

నన్ను చిన్నప్పుడు కొంతకాలం దేవుడు అని పిలిచేవారని చెబుతారు. కాని, అంత చిన్నపేరు నాకు బొత్తిగా పొట్టి అయిపోవడం గ్రహించి త్వరలోనే మానాశారట, ఆ పేరుతో నన్ను వ్యవహరించడం! నాతల్లిదండ్రులు మొదటే గతించడంవల్ల వాళ్ళని నేను ఎరగనే ఎరగను, పీడే వొదిలిపోయింది. నా పిత్రార్జితం ఓ ముసలమ్మా, కొంత ఆస్తీనూ. ఆవిడే వండి పెట్టేది, నట్టింటదీపం పెట్టేది నన్ను ఓ ఆయన పెంచుగోవాలని చూసి, దత్తరావు అంటూ పిలవడంకూడా మొదలెట్టాడు అప్పుడే మహా! వారంతిరక్కుండా ఆయన పెళ్ళామూ, ఆవిడ ముగుడూ కూడా ఆఖరైపోయారు. మరో ఆయనా అందుకే ప్రయత్నించాడు. ఆయన పెళ్ళాం వసీ అంతే అయింది. అక్కడితో నన్ను పెంచుగోడం గురించి తెలిసినంత మట్టుకి ఎవ్వడూ తలపెట్టడంకూడా మానుకున్నాడు. నేను ఇంట్లో ఉన్న సమయంలో ముసలమ్మ తను నాకు చేసే సాయం ఏదో చేస్తూ నాకేసి చూస్తూ ఊరుకోక నేను అడగనప్పుడుకూడా అడ్డమైన సలహాలూ ఇవ్వడమే. అందుకని ఆవిడమీద నాకు ద్వేషం కూడా బయల్దేరింది. నా స్వాతంత్ర్యం నా రాజ్యం, నా ప్రజలు, నాగోడు—ఇవన్ని ఈ ముసలమ్మకి ఎందుకన్నాను అయినా, 'అయినప్పుడూ కానప్పుడూ నన్ను కాల్చుకుతిని

నన్ను రెచ్చగొట్టేది. నేను అనేక రంగుల నాజూకుతిట్లు ఆవిణ్ణి తిట్టేస్తూంటానంటే, చావనా మరి! పెళ్ళిచేసుగో' పెళ్ళిచేసుగో అంటూ ఆవిడ ఏకరొద! "అంతయిచ్ఛాపైతే నువ్వేచేసుగో డర్టీగూస్" అని అరిచి ఆవిడ నోరు మూసేస్తూంటాను. నావల్ల వంశానికీ, తనికీ అప్రతిష్ఠ వస్తోందని ఒకనాడు ముసలమ్మ సణుగుడు సాగించింది. అప్పట్లో నేను చారూ అన్నం తింటున్నాను ఆవిడ రిమార్కువల్ల నాకు మిక్కిలి ఆనందం వేసి, ఆ మూలవిరాట్టుని అభిషేకించడం విధిలా కనపడి ఎంతో సదుద్దేశంతో ఆవిడ రేపునెత్తిమీద కంచెడు వేడిచారూ పదిలంగా చిందకుండా బోర్లించాను. తక్షణం ఆవిడ స్పృహలోకివచ్చి బాష్పాలు తుడుచుకుంటూ లేచివెళ్ళింది. కాని, ఈవృత్తాంతం విని ఒక ఊరకవి నామీద తక్షణం 'పన్నడం' సంకల్పించి, నన్ను చారుదత్తరావు అంటూ వ్యవహరించి ఒక పద్యాలయం తయారుచేశాడు. ఎంత చెడ్డా, ఆ మాటకట్టేను పద్యాలు గదాఅని వాటిని స్తోత్రాలకిందే జమకట్టేసుకున్నాను కొంతకాలం అందరూ నన్ను అల్లానే పిల్చేవాళ్ళు. అదేమయితేం, ఉన్నమాట అట్టేదాచకూడదు- నేను చిన్నపిడుగుని, అఖండుణ్ణి! నా మేధ పండితులకి లొంగే రకం కాదు నా ప్రజ్ఞ అపూర్వప్రజ్ఞ, మూర్ఖులు నన్ను పండితపుత్రుడన్నారని తెలిసింది. వాళ్ళమీద కసికొద్దీ నేను మానాన్నని పండితజనకుడంటున్నాను. నన్ను మామూలు మనుష్యుల స్కూలుకి

పపించడం మా మురళమ్మకి బుద్ధిలేదనడానికి ఋజువుల్లో ఒకటి. స్కూళ్ళల్లో పొట్టకక్కుర్తి పంతుళ్ళు చెయ్యడానికి ప్రయత్నించే పనికిమాలిన బోధవల్ల నా అసాధారణపుబుర్ర చాలావరకు మందగించిపోయింది గాని, అటువంటి బోధనే గనక-ఆశాస్త్రగజ-నాబుర్రని అంటుకోకుండా ఉండిఉంటే, ఈపాటికే నాబుర్ర దినుసు ప్రపంచం అంతటా పాముకు పోయి ప్రపంచాన్ని గిలాబా చేసేసిఉండేది కాని, ఎంత పాడవుతేనే గనక. పాడుకాగా నిలవగలిగిన ఆ కొంటెసహజ ప్రజ్ఞతోనే నేను పరీక్షల్లో పిల్లి మంతరాలు విశేషం లేకుండా నెగ్గి అనుమాన రహితంగా చదువు గురించిన పురుడు గడిచాను అనగా, రెండుకాళ్ళవాళ్ళలాగ నేలమీద నడవవలిసిన అవసరం నకు ఆ దెబ్బతో తగ్గింది అఘాతంలోంచి లిప్తలో అమాంతంగా లేచి పైకెగిరి విద్యాలయ పూర్తి కూడా చెయ్యడానికి బయల్దేరాను. ఇంత అకస్మాత్తుగా నా ప్రజ్ఞకిలగ్గ వైభవం ఎల్లాపట్టిందా అని టాకబుచెయ్యగా, నా కుడిభుజ మీద శంఖం, ఎడ భుజ మీద చక్రం ఉన్నట్టు ఒక చర్మజ్ఞుడు నిర్ణయించగలిగాడు. అవిపుట్టుకనించీ అక్కడే ఉన్నాయని, దరిమిలాని అవి స్ఫుటం అయినాయనీ, తక్కిన వాళ్ళకళ్ళకి అవి ఆనవని, అయినా చెప్పేదుమాటలు విని నిరుత్సాహం పడకూడదని అతని తీర్మానం నా జాతకప్రభావం యొక్క వయసంపాక్కగానే, నన్ను చాలామంది 'శంఖచక్రరావు' అని పిలవడం అలవాటు చేసుకున్నారు. అదిలగాయతు,

పోతే పోయింది, ఏ శాశ్వతం, సామస్తార్థక్యమైనా సాధించుదాం వీలైనంతవరకూ — అనే ఉత్సాహంలో పడిపోయానని చెప్పడానికి నాకు ఏంతమాత్రమూ సిగ్గులేదు. ఇక నేను ఈ భూమిమీద ఉండగల ఏ ఉత్తమోత్తమపదవీశిఖరానికేనా సరే ఎగరడానికీ, ఎగిరి అక్కడ వైభవంగా నిశ్చింతగా క్రియాశూన్యంగా అవ్యాహతంగా నిరంతరంగా కూర్చోడానికీ అర్హుణ్ణి. నేను కొంచెం శ్రద్ధపడితే చాలు అంత వాణ్ణే నేను కాగల్ను. అందుకు కావలసిన సకలగుణాలు యావత్తూ నాకు సక్రమించా యున్నమాటే! అసలు నాకిప్పుడున్న మహాగుణాల్లో కొన్ని నేను దరిద్రులకి దానం చేసినా మిగతావి జన్మజన్మలకి చాలు. కాబట్టి, నేడో రేపో నేను నిరంకుశంగా భూచక్రంగాని, దిక్చక్రంగాని తిప్పడానికి వెళ్ళగల నంటూన్నప్పుడు, ప్రస్తుతంలో అటువంటిపనే (నేను ముందుకాలంలో చూపెట్టపోయేటంతసామర్థ్యం చూపెట్టకుండానే) చేస్తూన్న ఘటాల్ని చూస్తే నాకు గౌరవం ఎందుకుండాలి? ఇక తక్కినవాళ్ళలెఖ్ఖ నాకసలేమిటి! అంచేత, నేను ఇతరులప్రజ్ఞ గణించను, గుర్తించను, చూడను. నా ప్రజ్ఞముందు ఇతరులకు అసలు ప్రజ్ఞ ఉందనే అనుకోను. నాతో సమానమైనవాడు నా పిహాలశ్రేణిలో అరుదుగా ఉంటాడేమో అనేది చాలా నాసిసదేహం, నాకంటే అధికుడు ఇక ఛస్తే ఉండడు అనేది సిద్ధాంతం. నేను ఏ గ్రహంలోనూ, ఏ స్థలంలోనూ, ఏ సందర్భంలోనూ, ఏ వ్యక్తినీ ఎందుకూ ఖాతరీ చెయ్యవలసిన అవసరంలేదు.

నాహృదయంమాత్రమే నిష్కల్మషం, కడం వస్తే కళ్ళు రకం అని దెబ్బలాడి కుమ్మేస్తాను. నాకు తోచింది ఎప్పుడూ ఒప్పే అనిన్నీ, నాకుతోచడమేమిటి ఒప్పుకాకపోవడమేమిటి అనిన్నీ నామతం. అంతేకాదు, నేను ఇంకోరికి తోచింపి చిందీ, ఇంకోరిచేత చేయింపించిందీ కూడా ఒప్పే అంటాను. అటువంటిదానికి అడ్డతగిలి అది తప్పు అనడానికి ఎవడేనా సాహసిస్తాడా వాడి పని షికారే, అనగా మట్టు! ఎంచేతంటే, నా అద్వితీయ ప్రజ్ఞకాక, నాకు కొన్ని ప్రత్యేకాభిప్రాయాలూ, అలౌకికాభిరుచులూ, అసాధారణ స్నేహాలూ, అతీతసాహసాలూ, అగమ్యాగోచరాలూ, సరి కొత్తధోరణులూ ఉన్నాయి.

నాఅభిప్రాయప్రకారం మా నానమ్మలాంటి వాళ్ళు ఎందుకు పుట్టారూ అంటే నేకోరినప్పుడల్లా డబ్బుపంపడానికి. ఆవిడడబ్బు పంపకపోయినా, తక్కువ పంపినా, పంపి ఖర్చు వమునం అడిగినా ఆవిడకి ఓ మోతాదు ఇవ్వడం రీతి నాకు తెలుసు. పుస్తకాలకనీ, పత్రికలకనీ, జరిమానాలకనీ, చందాలకనీ, పరీక్షలకనీ, దొంగలడ్డరనీ, అనవసరపుదొంగనతం నామీద మోపారనీ మా నానమ్మకి నచ్చచెప్పడానికి యత్నించి, ఇటువంటి సంగతులు చెప్పినప్పుడు ఒకవేళ, ఆ ముసలివరుకు నమ్మకపోతే, [illegible] తీసుకుంటాననిగాని, నల్లమందు తింటాననిగాని, అసలు అటువంటి వాటి మిశ్రణం తినేసి చచ్చిపోయాననిగాని పొరుగూరెళ్ళి ఒక్క టెల్లిగ్రాం కొడితినా నాకు కావలసినకంటె ఎక్కువ సొమ్ము

గిరాగిరా తిరిగి ఊడిపడుతుంది. కాని, ఆవిడ పూర్వకాలపు మనిషి. చెంపకాయ వెయ్యడానికి చెయ్యి ఎత్తుతేచాలు, ముణుచుగుపోయి ఇంట్లోకి పరుగూ! అంతమంచిది గనక పోనీ అని చెప్పేసి ఆవిణ్ణి క్షమించి వదిలేస్తూంటాను. తక్కిన ప్రపంచపు స్త్రీలంతా నాకు వేళాకోళానికి పనికే. అందుకని, ఎవళ్ళమీద్నా నాకరే నాయిష్టంవచ్చిన రిమార్కు – చీకట్లోంచి గాని, చాటున దాక్కునిగాని, సమూహంలో దూరిగాని – ముఖవర్చస్సు గుర్తు తెలియకుండా మీద దెబ్బపడకుండా చూసుగుని నిర్భయంగా పేల్చేస్తాను దాంతోటి అవతల వాళ్ళ గౌరవం తత్క్షణమే లేచిపోయి వచ్చి నన్ను వరించడం వల్ల నా గౌరవం బలిసిపోతూంటుంది. అసలు పిచ్చిప్రల్లోదుణ్ణి గురించి వెళ్ళిపోతున్న చెప్పిన సీసపాదం కొంచెం సవరించి ''కన్నుదోయికి నన్యకాంతల లక్ష్మిఁబ్రస భార్యభావము చేసి పరగువాడు'' లాగ మార్చేస్తే నాకు సరిపోవచ్చు. విద్యావంతులంటే నాకు నమ్మకమే లేదు. విద్యవల్ల–అంటూగా నేను చెప్పబడే విద్యవల్ల – బౌత్రగాలాభం ఉండదని నా అనుభవం. విద్యవల్ల వినయం రావలసిన అవసరం లేదని రాసిస్తాను. అందుకని ''విద్యయొసగును'' అనే పద్యాన్ని ''విద్యయొసగు నవినయం బవినయమునను బడయు పాత్రత'' అని దిద్దివెయ్యడమే బెటరనుకుంటాను. అనగా, ఈవిద్యవల్ల అవినయమునూ (అభినయమునూ అనిపాఠాంతరం), దానివల్ల చేతికి పాత్రానూ వస్తాయని అన్వయించుగోమని నా హెచ్చరిక! పెద్దలంటె గౌరవించాలని కొందరంటారు.

కాని, సిగ్గుభిడియాలు లేకుండా నాకంటె వెనకేపుట్టిన జం
తుజనం నాఅంత నాగరికత లేని సురులుగనక వాళ్ళని పాటిం
చవలిసిన అగత్యం నాకు లేదు. సరిగదా, వాళ్ళమాట
పట్టుకుని వేళ్లాడే వాళ్ళని నిజంగా వేళ్ళాడదియ్యాలని నామ
నవి. నాకు డ్రెస్సుమీద సరదా. మామూలు మనిషికి కొన్నే
దుస్తులు. నాకున్న సూట్లు నాకే తెలియనన్ని నేకొన్న
చెప్పుల రకాలు వరసని పెడితే ఓషాపు ఏర్పడచ్చు-రూమ్‌లో
నడవడానికి ఒరకం, లెట్రిన్‌కి ఒరకం, షైరుకి ఒరకం, ఆట
లకి ఒరకం, సినిమాకి ఒరకం, ప్రయాణానికి ఒరకం,
ప్రయాణానికి ఒరకం, సభలకి-ఒరకం-ఇల్లా ఉంటాయి.
ఈమాత్రమేనా లేకపోతే నా గౌరవం డాగుపడిపోవచ్చు,
నా పాదాలు నొచ్చుగోవచ్చు. నాకు వతెరికం భోజనం అస
హ్యం. కొత్తరకపుదైనా నేను చాలా టుకీగా లేన్నాను.
స్వయంగా కాక, స్నేహితుల్లో ఎన్ని సార్లైనా నేను అల్పా
హారం స్వీకరణం చెయ్యగల్ను. తాంబూలచర్వణం నాకు
అవసరం. దానివల్ల నాలిక బండబారుతుందనీ, తత్వం
వేడెక్కుతుందనీ కొందరు శిఖామణుల ఉద్దేశంట. వాళ్ళు
అస్ఖలిత మూర్ఖులు. ఏమంటే, నానాలిక్కి బండబారడందో
షం కొత్తగా పట్టడం అసంభవం అనిన్నీ, నా తత్వం మరి
వేడెక్కడానికి వీల్లేనంత ఘాటురకం అనిన్నీ వాళ్ళెరగరు.
నేను నిత్యధూమ ప్రియుణ్ణి నా అంతర్యస్నేహితుల్లో ఏరకం
ధూమకంఐనా సరే, ద్రావక ఐనా సరే పుచ్చేసుగోడానికి
నేను చెవికోసుగుంటాను. అరగి పుక్కి పీల్తెన ఘుండ్రపధూమ్ము

పదార్థాలు కొల్లలుగా దానం చెయ్యడంలోనూ. అంతకంటె ఎక్కువగా దానంపట్టడ లోనూ నాకు చాలాసరదా. ఆమాత్రం ఇచ్చి పుచ్చుకోడాలు కిట్టనివ్యక్తుల్ని నరకానికి రవాణా కట్టిస్తే యమువాహనానికి విశ్రాంతేనా దొరుకుతుంది. నాకు పరీక్షలంటే ఎంతో అంతయిది. పరీక్షలు ఉండి తీరాలని నాపట్టుదల ఒకే రావుమీద యూఘై అచ్చుపేజీల్లోని గ్రంథం యావత్తూ సన్న చీమలబారులాగ బ్రహ్మలిపిలో సూదిమొనతో రాసి అతిగూఢంగా పరీక్షచోటికి పట్టికెళ్ళగల నేర్పు నాకుంది ఆ నేర్పుగలవాళ్ళని పోషించడం నాముచ్చట పరీ క్షలో కాపీ వేసినవాడే మిక్కిలి చురుకైన తెలివి గలవాడని నామాత్రం. కడంవాళ్ళు అక్కడా అక్కడా ఏరుస్తూ ఊరుస్తూ అనేక కాలం వెచ్చించి నేర్చుకోగలిగిన అంశాలు, కాపీచేసేవాడు క్షణంలోనే నీటుగా గ్రహించగలగడం ప్రత్య క్షంచేస్తాను కనక వాణ్ణె ఎక్కువగా మెచ్చడం నాకు సరదా కనక శుద్ధన్యాయం. పరీక్షాధికారులందర్నీ ఏకలాటుగా తుడిచెయ్యగల విషవాయువుని కనిపెడుతున్నాడు నామి త్రుల్లో ఒకడు అంతకుపూర్వమే పరనగ్రంథాలు రాసేసిన వాళ్లుంటారు, వాళ్ళనికూడా మాయంచేసే ఏర్పాట్లు మరచి పోవద్దని వాడితో చెప్పి కట్టుదిట్టంచేశాను వేడుకకోసం ఉద్దే శింపబడ్డ నాటకం, సినమా, సర్కస్‌వంటివి అవశ్యం నేను వెళ్ళితీరవలసిన వస్తన్నీ, అక్కడ నా అందచందాలూ నా తెలివితేటలూ, నామర్యాదలూ, నా వాక్ స్వాతంత్ర్య విశేషాలూ, నా చమత్కారరసికతలూ చూపించడానికి

అవకాశాలు మరీ ఉంటాయిగనక, నాకు అవి చెప్పలేని సరదా, ఆకాశరామన్న ఉత్తరాలనేవి రాసినవ్యక్తిని వ్యక్తీకరించకుండా యాథార్థ్యాన్ని బైటపెట్టేస్తాయిగనకనున్నూ, ఎంత చచ్చిచెడి అయినా యాథార్థ్యం ప్రకటనచెయ్యడం మానవధర్మం గనక నున్నూ నేను అల్లాంటే రచిస్తూంటాను. తెలుగులోకూడా టైపుయంత్రాలు వచ్చాయిగనక, ఇదివరకు నేను ఇంగ్లీషులో నడిపినంత విరివిగానూ వీటిని తెలుగులోనూ బనాయించడానికి వీళ్లు కనిపిస్తున్నాయి! అర్థరాత్రి అయినాసరే కారుచీకటి అయినాసరే ఆవతలగోడవెలుగూ ఇవతలనాముఖంతళుకూ సాయంగా నేను ఆంధ్రాంగ్లకుడ్యరచన చేస్తానుగనక, నా రాత ఎంతనుసి అయినా తాత్కాలికజీవతృప్తేనా కలిగించవచ్చు కాబట్టి నా ఆదర్శంమూర్తీభవించినట్టుగా ఆనందిస్తాను. పేరుగలవాడిమీద త్వంకారప్రయోగం, వివాహసందర్భాల్లో అమంగళ చర్యలూ దిగ్విజయంగాజరిగే కార్యక్రమానికి వీలైనంత గుట్టుగా అడ్డుతగలడంకూడా నాకు ఆనందం చేకూరుస్తాయి. కేవలం సరదా మాత్రమేకాక నా అభిమానవిద్యలలో ఒకటిఅని చెప్పడానికి నేను విర్రవీగేది ఏదీ అంటే, మదీయగాత్రజనితధ్వని విశేషపరంపర. మాటలు మాత్రమేఆడి ఊరుకునేవాళ్ళు తమనోటియొక్క పూర్ణ ప్రయోజనం ఎరగనివాళ్లు. నేను పక్షిలా కూయగలను, లేక సాధుజంతువులలాగ సరేసరి, హింస్రజంతువుల మాదిరిగాకూడా అరిచి పాడగల్ను, స్థాయీ నిలబెట్టగల్ను, శ్రుతి అక్కరలేదు, ఆయా జంతువుల్ని ఆకర్షించ

కలను. ఆ విషయంలో నాకు శ్రమగాని, పట్టింపుగాని, వేళ గాని, విసుగుగాని లేకపోవడం అటుండగా, నేను ఆ లలిత కళ సృజించేటప్పుడు నా ఎదురుగుండా ఉండి నాకేసి చూస్తూండే సజీవులుకూడా ఆకళకి కర్తని నేనని చెప్పగో లేనంత ఒడుపూ వాటం - విప్రవినోదికంటే ఎక్కువగా-నా దగ్గర ఉన్నాయి. ఉంటేం! చూసి విని మెచ్చి ఓ మెడల్ వంటిది ఇవతల పారెయ్యలేని దరిద్రాంధ్రదేశం అయింది. తీరిపోయింది.

ఒకటేమిటి! నాకృత్యాలన్నీ వీరకృత్యాలేఅని చెప్పచ్చు. నేను ఎక్కడ నడుస్తూన్నా నా ఒయ్యారం వొలక బోసుకుంటూ సగాతంటురాయి పాళీల్ని లాగేసినట్టు చుట్టు పక్కల ఉండే స్త్రీ పురుషాదుల్ని నావైపు లాక్కుంటూ పోతాను. ప్రతి నిత్యమూ నా తెలివితేటలు కారి ప్రవహిస్తూం టాయి. నేను ఒంటర్నిగా ఉండడం నాకు అయిష్టం. ఎంచే తంటే, నా బుర్రప్రజ్ఞ ఎంతటిదయినా నన్ను తమ మొండి వాదనవల్ల ఒఖ్ఖిణ్ణీచేసి నెగ్గేసే తుంటర్లుండవచ్చు; నా జబ్బ బలం ఎంతటిదయినా నన్ను తమ పశుబల్లంవల్ల ఒఖ్ఖణ్ణీచేసి అణిచేసే మొద్దురకాలు ఉండగలరు. అదీకాక నేను సంఘ జీవిని. నేను మందలోగాని ఉండను. అందువల్ల ఈర్ష్యతో కొందరు మందబుద్ధులు నాప్రజ్ఞ మందప్రజ్ఞఅనీ, నా బలం మందబలంఅనీ సకూసించి, చివరకి అహోరించారు. ఏమంటే ఒకమాట రాణించాలంటే అదిపుట్టేచోట పస ఎంత అవస రమో పడేచోట సిగ్గుఅంత అవసరం. ఏమైనా నా మధుర

గాత్రం ఖంగున మోగి నా సహజకవిత్వం వెలిగిరిసి బయల్దేరా
లంటే వినేవాళ్ళ అదృష్టం కాకుండి నేను నా ఆంతర్య స్నేహితు
ల్లో కలిసిపోవాలి వాళ్ళు యేమన్నందీ నాకూడా ఉన్నారా
అడగనే అక్కర్లేదు, లేకపోతే అంగులో ముఖ్యులు నాలో
ఉన్నా చాలు. శృంగార రసపోషకులూ, స్థూల శరీరాభి
మానులూ, పేకాటమార్తాండులూ, శ్రీరామనవమి పందిరి
కళారసాస్వాదకులూ, అట్లతద్ది వీరకార్యశూరులూ, ఆకాశ
రామన్న జ్ఞులూ, అంకజూదస్థూ, ఆకస్మికోన్నత్యాపేక్షి
తులూ గాగల రకాల్లో కొందరైనా చాలు. అటువంటి దివ్య
సరసుల సమక్షంలోగాని నేను నాధీరలక్షణాలు వ్యక్తీకరిం
చను నా నోటికి హద్దుగాని, నా ధాటికి అడ్డుగాని లేకపోవ
డం వాళ్ళ కళ్ళముందుగాని తెలదు. ఆంతర్య స్నేహితుల
న్నాను గనక జ్ఞాపకం వచ్చింది. నా సామాన్య స్నేహబృం
దాన్నీ, నా శత్రువర్గాన్నీ కూడా కొంచెం వివరిస్తాను. నా
యిష్టం వచ్చినట్టు నేను వుండవచ్చును అని వాదించేవాడు
నా స్నేహితుడు. నాకు సంపూర్ణ స్వాతంత్ర్యం గురించిన
హక్కుండని నిష్కర్షగా పరిష్కరించేవాడు నాకు గాఢ
భక్తుడు. నాకు బాధ్యతలూ విధులూ ధర్మాలూ ఉన్నాయని
చెప్పేవాడు నాకు శత్రువు. ముప్పొద్దులా నేను గ్రంథస్థవిష
యాజ్ఞవ చెయ్యాలని బోధించేవాడు నాకు గర్భశత్రువు.
అటువంటివాడు ముఖ్యాట్టికీ 'గురువు' - అంటే మేస్టరూ,
శాస్త్రీ, బృహస్పతీ అన్నమాట! నా డబ్బోసి నేను నాజూ
కుగా షోకుగా చదువుగురించి యత్నంచేసుగుంటూ అవస

రాన్ని బట్టి, నేను దళాంగా కల్లరిగా జూదరిగా సోమరిగా రహస్యసంచారిగా ఏమిగా అవడానికయినా సరే ప్రత్యేకపు మార్గనా దేగనక, నా జోలికి రాకుండా ఉండాలని నా స్మరణ చెయ్యకుండ ఉండేవాడుకూడా నా నాసుడే! నాకు ధూమపాన నస్యాది అభ్యాసాలు ఖర్చు లేకుండా ఉపదేశించి బాధ లేకుండా నాచేత ఆచరణలో పెట్టించేవాడు నా జన్మగురువు. మాట్లాడవలసిందని ప్రార్థించి నకిపించి తీసిగెళ్ళి తప్పుమీద జనం ఎదట నన్ను నిలబెట్టినప్పుడు (మాట్లాడలేక కాదు) మాట్లాడక పోవడం నా సాహసకృత్యాల్లో ఒకటి అల్లాగే, ఇంకోడు ప్రసంగించే సమయంలో నేను ఊరుకోడమే మర్యాదలాగ కొందరికి కల్పించేచోట మాత్రమే నా వాక్కు యొక్క మాహాత్మ్యం చూపడం కూడా నా గొప్పపన్లలో ఒకటి. కానికాలం గనక నాకు దృష్టి కొట్టొచ్చినట్టే దిగులుచొప్పున పోలికకి అందకుండానే, నా సాహసాలు శేష చీకట్లో గాని సమూహంలోగాని నెరవేరుస్తాను. అందుచేత నాకు భయం, పిరికితనం అనికొందరు పిసునగుల వాదన కాని, రెండోకంటివాడికి తెలియకుండా గాని నేను ఎదీ చెయ్యను గదా, అప్పట్లో నాకు భయం అని చెప్పడానికి మాత్రం ఆ దిక్కుమాలినవాళ్ళకి సాక్ష్యం ఎదీ! అందుకని విజయం నాస్వంతం. కొట్లాటలు వచ్చినప్పుడు నేను వీలు చూసుకుని మధ్యవర్తిత్వం చేస్తానుగనక బలం చూప వలిసిన పోట్లాట అన్నా సరే, నేను సిద్ధమే. నాతో ఆటల్లో పాల్గొనేవాళ్ళు నా స్నేహితులేగాన, నన్ను ఓడించే వాళ్ళంతా పరమదుర్మార్గులు. పెద్దవాళ్లు ఎంతసౌఖ్యం అను

భవిస్తూంటారో అంతా నేనుకూడా అనుభవించకూడదు అనేవాళ్ళంతా నాకు ఎదర పార్టీ, నాపని మానడమే దేశాభిమానం అనీ, నా పశుత్వం వదలగొట్టేవాణ్ణి ధిక్కరించడమే నా భావి స్వాతంత్ర్యానికి చిహ్నం అనీ ఉపన్యసించేవాళ్ళంతా నా నమ్మినబంట్లు. నే డ్రెస్ వేసి, సిగరెట్ పీల్చి, కిల్లీ వేసి, నిద్రచెరుపుకుని, ఆత్మగౌరవం భంగం అయినా చేత్తో పుస్తకాలు పుచ్చుకుని, పోని మేష్టరు ఏడ్చిపోతాడని విద్యాశ్రమానికి వెళ్ళినా ఇంకా నేనేదో తయారీ అయిరాలేదంటూ కోడంటికం పెట్టి గింజుకునే ప్రతీకూలిగురువూ నా వైరివర్గంలో చేరిన బాపతే. నా అంతవాడికి తెలివితేటలు లేవని సిగ్గువిడిచి నలుగురిలోనూ చెప్పడానికి తెగించే ప్రతీ పట్టాదారూ వాజమ్మే. హ్యాన్ అనే శాస్త్ర వెధవమాటా అంటే వొదిలిపోయేదానికి, నాబుర్రయొక్క అంతర పరిమాణం యావత్తూ అక్కడికి తనుచూసి కొలిచి తగులడ్డట్టు, నాభావి ఉద్యోగలాభం నాశనం అవుతుం దేమోపాపం అని భయపడక, నా సహాధ్యాయుల్లో నాకు తలవంపు అవుతుం దేమో అని జంకక, నాకు వస్తూండే మంచిమంచి కట్నాలిచ్చే వివాహసంబంధా లన్నీ తిరిగిపోతాయేమో అని తటపటాయించక. నన్ను ఫేలుచేసి, తన సొమ్మంతా పోయినట్టు నాకు తక్కువమార్కులు రాల్చే ఉపాధ్యాయు డనే పరమచండాలుడు నేను జీవితంలో మరవడానికివీల్లేని ఘోర శత్రువు. తెగవయస్సూ, తగనివాగుడూ, చచ్చుఅధికారమూ బోడిప్రజ్ఞా ఉన్నాయికదా అనిచెప్పి నన్ను కొందరు సమయం

కనిపెట్టి వేళాకోళానికి పట్టించే రాలుగాయి లున్నారని విన్నాను, గమనించాను. వాళ్ళమీద నేను కసి తీర్చుకునే టందుకు నేను ఉపయోగించే వీరసాధనం ఒక టేమి టంటే. అన్యాపదేశం. కొమ్ములు తిరిగినవాడై నాసరే అటువంటివాడు నాకక్కనించి ( అప్పుడు నేను మేడమీదో అరుగుమీదో చీకట్లోనో గుంపులోనో ఎక్కడున్నాసరే) వెళ్ళేటప్పుడు, ఆ మహాతరుణం నేను ఉపయోగించుకుని, నా విద్యావాసన నలుదిశలా వ్యాపింపచేయడపు ఉద్దేశంతో సరికొత్త తిట్లతో మామూలు మాటలకి పోపెట్టి, గాంధ్రిస్తూనో సకిలిస్తూనో నాతియ్యటి గాత్రంతో నా కమ్మటికవిత్వం విరజిమ్ముతాను. వాడు తన్నేమో అనే అనుమానం చొప్పున నాకేసి తిరిగే లోపల నేను వాడివేపు చూపు మానుకుని, నా స్నేహితుల్లో ఓణ్ణి తిడుతూన్నట్టు నటించి నా విజయం వెల్లడిస్తాను. వాడికి అంతటితో తృప్తి. ఏమిటని నన్ను వచ్చి అడిగాడా, నా గొప్పతనం వాడే ఒప్పుకున్నా డన్నమాట. రంగం పూర్తి చెయ్యడానికి నా స్నేహితులు పకాలుమంటారు, దాంతో వా డగిరిపోతాడు. సభల్లో గల్లంతు సృష్టించి, సృష్టికర్తలాగే ఉండిపోతాను. అతని పుణ్యం కొద్దీ నాతండ్రి యిప్పుడు లేడుగాని, అతడే ఉండి, అతడితో హెచ్చుతగ్గు వచ్చినా నరే, వాణ్ణి ఏమటయేదిగాని ఎగేసి తెగనరికిపారేసి ఉండేవాణ్ణి. అందుకని ఇరుగు పొరుగువాళ్ళు నా సాహసకృత్యాలు విని ఒంటిప్రాణంతో ఉంటారు, ఒంటికంటితో నిద్రపోతారు. అన్యుల్ని నేను సాధారణంగా పొడలకొట్టి, ఆట్టే

మంది లేకపోతే బెదిరించి, భాగ తెలియని వాళ్లైతే తిట్టి, నా శౌర్యంయొక్క మచ్చు చూపిస్తూంటాను. ఇక, నా సౌందర్యోపాసనగురించి నేను తంటాలుపడడంలో చెయ్యవలసి వచ్చే సాహసాలు చాలా ఉన్నాయి. అటువంటి సందర్భాల్లో, అనగా యువ్వనులు కాకపోయినాసరే నారీమణులు మిశ్రసమావేశంలో ఉండేటప్పుడు, అవసరాన్ని పురస్కరించుకుని, ( చటుక్కున నేను నలుగురి కళ్ళఎదటా మెరుపులా మెరవడంవల్ల నాకెప్పటికైనా ఏదైనా ఎవరివల్లనైనా ఏమాత్రుగానైనా లాభం ఉండవచ్చుగనక ) అవలీలగా నా ధనం, నా పణం, నా మానం, నా ప్రాణం చివరకి నాడ్రెస్సుకూడా ఏ ప్రత్యేక వ్యక్తికోసమో ఎందుకోసమోకూడా నాకే తెలియకుండా నేను త్యజించెయ్యడానికి తెగించి ఉండడం చూస్తే, నా మహాసాహసానికి మీరు ముక్కుమీద వేలువేసుగుని మళ్ళీ తియ్యరన్నమాట! అటువంటప్పుడు నా ఉషార్ తమరు చిత్తగించాలి, దాంతో తమరి జన్మ తరించాలి కొందరు నాయకులు రోజుకి ఓదుస్తు మారుస్తారు. వాళ్ళకి తెలిసే నిమిత్తం నేను క్షణానికి ఓడ్రెస్సు ఫిరాయిస్తాను. నువ్వు ఇంగ్లీషు నేర్చినవాడివి, పొల్లుపనులు ఎందుకయ్యా చెయ్యడం అని ఎవడేనా అంటే, ఆఅన్న శృంగారశూన్యుణ్ణి, వాడిఆర్డరు పొందనివాళ్ళ సందర్భ్నికూడా వరసాగ్గా షూట్‌చేసి వాళ్ళకి టీపార్టీ చేయించి తద్దినం మానిపించేస్తాను. అది గ్రహించవలిసిందేకాని, విప్పిచెప్పేది కాదు. అటువంటి స్త్రీజన సమ్మిశ్రిత సమావేశాల్లో నేను చాటు ప్రసంగం చేస్తాను. నా దేవుడా,

అది ఎంత లఖండంగా ఉంటుందని చెప్పను! నా వాగ్ధాలవు గట్టు తెగబడుతుంది. అప్పుడు నేవాడే ప్రతిపలుకూ బంగారమే నేచెప్పేదంతా కవిత్వమే. అందులో శ్లేష, ద్వ్యర్థి, చిత్రం, యమకం వంటివి ఉంటూ యుంటాయి. నాకు వచ్చే వాక్యాలన్నీ పద్యాలయిపోగా కొందరు గణాలవాళ్లు వాటిని ఎక్కించుకుపోయి కంఠతాపట్టేసి వాడుకొంటూంటారు. ఒక్కొక్కప్పుడు అవి వాళ్ళకంఠంపట్టుగుంటాయి. అప్పట్లో నేను చేసే గానం, తీసే రాగాలూ, వేసే 'విట్లూ', కూసే నాదాలూ మొదలైనవి మహామహా రసికులవల్లకూడా కావు. నే నప్పట్లో కనపరిచే విలాసచేష్టలూ, దానత్యాగ శౌర్యాది లక్షణాలయొక్క ప్రత్యక్ష తార్కాణాలూ అధమం ఒకటాకీ తియ్యవలసిన బాపతువే అవిన్నీ. తన్నిమిత్తం ఒకటాకీకంపెనీ లేవాలనిన్నీ, లేవడంతోటే మొహం కడుక్కోడం కూడా మంచిదనిన్నీ, చాలా టాకీల్లో చేష్టలకిమల్లే కృతకం కాకుండా నావి స్వాభావికం అవడం వల్ల అటువంటి కంపెనీ పెట్టి పని చెయ్యకపోతే ఆంధ్రకళకి నష్టం అనిన్నీ నాస్నేహితుల నిశ్చితాభిప్రాయం. అందాకా ఎందుకు? అవతల కీచకుడు. కకారుడు మొదలు చేసుగుని ఇవతల మన గిరీశంవరకూ ఉండే ప్రత్యేక సౌందర్యోపాసకులు నాదగ్గిర సవినయంగా, సక్రమంగా, సదక్షిణగా శుశ్రూష చేసిఉండని దోషంవల్ల సార్వత్రికమై లస్ఖలితమై నవీనజ్ఞానయుతమైన శృంగార వ్యవహారంగురించి చెప్పవలిసొచ్చినప్పుడు వాళ్ళు నాకు చాలా

చాలా బలాదూరు అని నేను ఘోషించవలసొచ్చినందుకు నేను ఎంతో తెగించి విధిలేక గర్విస్తున్నాను.

నా విమర్శప్రజ్ఞకూడా ఎల్లాంటిదో నివేదించి ప్రస్తుతం దస్త్రం కట్టేస్తాను. అది ఎల్లాంటిదంటే, కేవలం రెండంచుల కత్తిలాంటిది. అనగా, అది నేను అమోఘంగా ప్రయోగిస్తాను, విధిగా నెగ్గుతాను. ఆ ప్రజ్ఞ ప్రయోగించే కాలంలోకూడా నేను ఒంటరిగా ఉండక నా విహంగబృందంలోనే మునిగిఉంటాను. అఖండప్రజ్ఞ చాలా సూక్ష్మంగానూ, మిక్కిలి తీవ్రంగానూ ఉండి, పందులాంటి సంసారం పాడు చెయ్యడానికీ, అనవసరకీర్తిప్రతిష్ఠలు అన్యరంగాల్లో ఆర్జించి విర్రవీగిపోయేవాళ్ళకి కొంచెం కళ్లెంలాగ పనిచెయ్యడానికీ, గొప్పవాళ్ళకికూడా నేను ఒక అంకుశం అని పబ్లికున దాఖలా కనపరచడానికీ, తద్వారా నాకు అల్పశ్రమతో, అల్పకాలంలో, అల్పవ్యయంతో అవతలవాడికంటె గొప్పపేరు దక్కడానికీ ఉపచరిస్తుంది. అయినాసరే నాకు బడాయి లేకపోవడంవల్ల నేను దాక్కునే ఉంటానుగాని బయటపడను! బ్రహ్మ నన్ను పట్టుగోలేక నలుముఖాలా చెదిరిపోయాడూ, యంత్రబ్రహ్మలు ఏ మొహం పెట్టుగుని నన్ను పట్ట యత్నించడం! నే నెప్పుడూ జట్టులోనే ఉండడంగనక అసలు మేమే సభ. అయినా జనసమూహాల్లోకి మేం తీసుబడిచేసుకుని వెళ్ళి దేశాన్ని పైకి లేవగొడతూంటాం. జనం అనేక చోట్ల సమూహం అవుతారు. జనసమూహాలు రెండురకాలు—ఒకటి, అధ్యక్షుడు అంటూ ఒకడు ఉండేవి: హార్దికసభలూ, ఉత్సవాలూ, వర్ధం

తులూ, సారస్వతాది సమావేశాలూ వంటివి. రెండు, అధ్యక్షుడు లేనివి: తీర్థాలూ, తిరునాళ్ళూ, సంతలూ, భజనలూ, సాధారణంగా నాటకాలూ, రైళ్ళూ, క్లబ్బులూ, సినీమాలూ, ఆటలూ మొదలైనవి. రెండో రకం సభలో నాకు స్వరాజ్యం. ఆరకం అధ్యక్షరహిత సభల్లో ఉన్నప్పుడు నాకు పూర్తిగా స్వరాజ్యంలో ఉన్నట్టు అనిపించడంవల్ల, ఇంకా ఏముటో స్వరాజ్యం కావాలంటూ ఈ దేశంలో జనం పైవాళ్ళని అడుగుతా రెందుకా అనిపిస్తుంది. మొదటిరకం సభల్లోనే నాబోట్లకి కొంచెం ఇబ్బంది. నేను జాగ్రత్తగా దాక్కోడం, తల చాటేసుకోడం, నమ్మినవాళ్ళమధ్య ఉండడం, గొంతిక పిరాయించుగోడం, నవ్వు ఆపుకోడం వంటి కట్టుదిట్టాలుచేసుకుని మరీ నాప్రజ్ఞ పేలుస్తాను. అవతల జరుగుతూండే వ్యవహారం ఒకవేళ,

నాకు తెలిస్తే, ఒన్ ఇదేట్రా అంటాను.

తెలియకపోతే, ఓర్, అదేమిట్రోయి అంటాను.

తెలుగైతే, బోడిప్రజ్ఞ పోదూ అంటాను.

అరవం అయితే. హా సాంబార్ అంటాను.

ఇంగ్లీషైతే, బొట్లేరుముక్కలు అంటాను.

పురాణం అయితే, హా ధనమేదయా అంటాను.

నవీనశాస్త్రం అయితే, హా అపర అయిన్‌స్టన్ అంటాను.

ఎరుగున్నసంగతి అయితే, స్టేల్ అంటాను.

నేను ఎరగనిదల్లా ప్లేట్ అంటాను.

స్వంతంగురించి అయితే, కొయ్‌కొయ్ అంటాను.

పరుల్ని గురించి అయితే, స్కాండల్, అవుటాఫ్ ప్లేస్ అంటాను.

భౌతికం అయితే పశుత్వం అంటాను.

నైతికం అయితే బతకద్దుట్రా అంటాను.

మతం అయితే బోష్ అంటాను.

పని అయితే హంబగ్ అంటాను.

ఎడమ అయితే కుడి అంటాను.

కుడి అయితే ఎడమే సవ్యం అంటాను.

ఒకవేళ అవతల వ్యవహరించే వ్యక్తి -

చదువుకోనివాడయితే గూస్ అంటాను.

చదువుకున్న వాడయితే ఫాడిస్ట్ అంటాను.

శ్రోత్రియుడైతే గీతేశ్వర్ అంటాను.

నవీనుడైతే మరమ్మతురావు అంటాను.

పండితుడైతే దయచెయ్యగోయ్ అంటాను.

పామరుడైతే నోరుమూసేసి మోసేస్తాను.

నెగ్గితీరతాను. విజయం నాకు దక్కితీరుతుంది. నాకు దక్కనదాని పేరే విజయం అంటే! నే దొరకడం కల్ల. నా రోజు బాగుండక ఒకవేళ నేను దొరికిపోతే, వీలుకనిపెట్టి పిక్కబలం చూపిస్తాను. అయినా పట్టుగుంటే అటువంటిసమయాల్లో అవతలనన్ను పట్టుగున్న వాడు నాకంటె చిన్నవాడైతే వాణ్ణి గొంతిగ పిసిగి గౌరవిస్తాను. వాడు నాకంటె పెద్దవాడైతే వాడికి జుట్టున్నా సరే పట్టుగోక, కాళ్ళు బాడివైనా సరే పట్టుగుని, "తొందరపద్దు స్వామీ, మీరు పెద్దలు, నాకు లేకపోతే

పీడాపోయిరి, మీకేనా సిగ్గుభిడియాలున్నాయిగదా! నాతోటి ఏమిటి పోవయ్యా!'' అంటూ నా లేవయస్సు ఎగసందోసి ఉపయోగంలోకి తెస్తాను. అప్పుడు చుట్టుపక్కవాళ్ళు కలగ చేసుకుని ఆ పెద్దవాణ్ణి చివాట్లువేసి ఊరుకోమంటారు, లేక పోతే తాడిచ్చి ఉరెట్టుగోమంటారు. పైది నా భయంగాని, నేను భస్తే దొరకను ఎందుకంటే నా ముఖానికి అప్పట్లో ఉండే దేవతా సంబంధమైన అఖండ తేజస్సువల్ల ఇతరుల కళ్లు పోవచ్చును అని భయం. ఈశ్వరాజ్ఞలు పదిట. నేను పద కొండోదిమాత్రం నిలబెట్టుతున్నాను ఏమిటది? ''పట్టుబడకుండా-ఉండడం!'' అందుకని, నాకు లెఖ్ఖేమిటి! నాకు భయం ఏమిటి! నాకు ఎవడేనా అంటే భయం ఎందుకుం డాలీ అసలు! పోని ఎల్లానో తటాలుపడి భక్తేనా చూపి ద్దాం అంటే, దిక్కుమాలిన రోజులు, సరైన వ్యక్తి దొర కడమే కష్టమాయిరి!

# తసలో

‘చుట్టూ అగ్నిజ్వాలలూ—మధ్య నేనూ, ఏమి అద్భుతం’ అని ఒకసందర్భంలో ఒక కవి అన్నాడు. అల్లాగ్గానే, చుట్టూ నేను, మధ్య దహించుకుపోయే నామనస్సూ ఎంత అద్భుతం!’—అని ప్రతీ నేనూ అనుకోవచ్చు. కాని, శాస్త్రం చెప్పిన తరవాయిగా, నేనే అణువుని. ఇక నామనస్సు—అడిగారూ? మరీనూ, అటువంటి మనస్సుయొక్క అల్పఘోష ఎవరికి కావాలీ! ఎవరు వినిపించుకుంటారూ! ఏక వ్యక్తిక్షోభ వినిపించుకోడానికి తక్కిన వాళ్ళకి క్షోభలు తక్కువా, పోనీ వీళ్ళుమాత్రం ఉన్నారూ!‘ అయినా సరే, మన్లోమాట, మనస్సనేది ఎంత ప్రపంచం అనుకున్నారు! సైజులో అయితేం, పరుగులో అయితేం, గుణంలో అయితేం, అథార్టీలో అయితేం, మానసిక ప్రపంచానికి దిష్టితీ సేయడానికేనా పనికిరాదుస్మండి, అందరికీ గోచరించే ఈ బాహ్యప్రపంచం! అసలు ఓకానొకరి సంకల్పానికి నకలుట మనికి తెలిసే బాహ్యప్రపంచం. అల్లాంటి బాహ్య ప్రపంచం వల్ల స్వరూపాల అంతర్యంలో కలిగే ప్రతిరూపాలయొక్క సారాంశంట—ఒక్కొక్క మానసికప్రపంచం. ఇక, నా మనస్సులో—చెబితే బడాయనుకుంటారుకూడాను—నిత్యం, ఏమిటేమిటో జరిగిపోతూంటుంది. మరేమీ అనుకోకండి, ఇక్కడ నామనస్సు అంటే ఒక మానవుడి మనస్సు అన్న

మాట ఆ జరిగేది యావత్తూ జరుగుతూండే క్షణంలోనే యథాతథంగా ఇతరులు గమనించగలిగితే ఎంత బాగుండి పోయేది! అల్లా గమనించడమే సంభవం అయిఉంటే, భూమి మీద ఇప్పుడున్నన్ని లావాదేవీలూ పేచీలూ భయాలూ ఉండేవా? పోనీ, ఇతరులు గమనించనక్ఖర్లేదు. నా మనస్సులో జరిగేది యావత్తూ నేను మాత్రం పూర్తిగా గమనించ గల్నా, నా వశమా, నా తరమా! నాకు తెలియకుండానే నాలో ఓ లక్ష నడిచిపోతూంటవి. గమనించ గలిగినదాల్లో— ఒక లేశం—నేను యత్నించి యత్నించి చూసిన మీదట కొంత కొంత తెలిసినట్టుగా ఉంటుంది. ఆ తెలిసింది ఏమిటీ అం టున్నా నేను ఆనా తీసుకోను. నన్ను నేను విశ్లేషించి చేసుకో డం ఉండదుగా! అది నాలోపల ఎంత అస్పష్టంగా ఉన్నా, ఎంతో రమ్యంగానే ఉంటుంది. ఆ రమ్యంగా ఉన్నది నాతో నేను స్పష్టం చేసుకోవాలని బుద్ధీ నాకు పుట్టదు. చేసుకోవల సిన అవసరమూ లేదు. ఒక వేళ స్పష్టీకరించుకోవాలనుకున్నా, నాకు మాట అనవసరం. అసలు నా 'తనలో' అదీ! అదే నా స్వరాజ్యం. నా 'తనలో' మీద నాదే ప్రత్యేకహయాం. నాకు ఇష్టం, సామర్థ్యం, సమయం ఉంటే అది నేనే గ్రహించు కోగలనుగాని, ఇతరులు అది గ్రహించడం, చాలా కష్టం లెండి మరి. అంటే కొంచెం కల్లవార్త. నాకు ఉన్నట్టే 'తనలో' అనేది రాళ్ళకీ రప్పలకీ అసలు లేదో, ఉన్నా, పాపం, నేను ఆ సంగతి కనిపెట్టలేనో, తెలియదు. జంతువులకి 'తనలో' లు

ఉన్నాయనిన్నీ, అవి మానవులకి స్పష్టంగా తెలియకపోవడం వాటి తప్పు కాదనిన్నీ భావించాలి. సరి, మానవులకి 'తనలో' లు ఉంటాయి. ఉండడంలో మళ్ళీ ఎల్లా అనుకున్నారూ! ఎంతమంది మానవులుంటారో అన్నిరకాల 'తనలో' లు. అందులో మరోసంగతి, ప్రతీవాడి 'తనలో' కూడా క్షణక్షణం మారడంతప్ప రెండోపని లేదు. 'తనలో' యొక్క స్వభావం అంత చంచలంగనక, అది వ్యక్తితో ఇదుగో అనడం, అదుగో అనడం, దోస్తీగా ఉండడం, వస్తున్నాననడం, నువ్వూ నేనూ ఓటే కానీమనడం-క్రియకొచ్చేసరికి ఏమీ కూడా లేకపోవడం. అయినా, 'తనలో' యొక్క అసలు లక్షణం ఏమిటంటే - అదో, లేకపోతే దాని తాలూకు ఒక నకలో వీధులో పడాలి, అప్పుడు దాని జన్మ సార్థకం కావాలి. అల్లా జరగనప్పుడు, 'తనలో' అనేది ఉన్నట్టే తెలియదు. అనగా, తనలోంచి లేచి బయట పడ్డప్పుడుగాని 'తనలో' అనేది సిద్ధించదు. ఇక్కడికి, మానవుడికి 'తనలో' అనేది ఉండడం, అందులో ఏకాంతో తనే గమనించ గలగడం, గమనించినదాల్లో ఏకాంతో తనే గ్రహించ గలగడం, మళ్ళీ అందులో ఏ లేశమో తన ఇష్టసామర్థ్యాల్నిబట్టి ప్రకటించడం, గురించి ఆలోచించాం. కాని ఇంతాచేసి, 'తనలో' అనేదాన్ని ప్రకటించడం అవసరమేనా, ప్రకృతి సిద్ధమేనా అనేది కూడా ఆలోచించుదాం.

వెనకటికి ఒక నాటకప్రదర్శనం జరుగుతూన్న ఒకసందర్భంలో రంగం మీద నలుగురు పాత్రలుండగా, అందులో ఒకాయన తన పని చెయ్యవలసిన తరుణం వచ్చినా, ప్రాంప్టరు తనికి మాట అందిచ్చినా, వచ్చినా మాట్లాడకుండా ఊరుకున్నాడు. అల్లా ఊరుకునేసరికి రంగం రంగం యావత్తూ ధ్వంసం అయిపోయి, రక్తి చెడిపోయేటట్టు కనిపించింది. అప్పుడు ప్రాంప్టరు చాలావినుకుగా, కోపంగా, స్వరం నొక్కి, 'తనలో'రా! వినిపించుకోవేం కర్మం, నిన్నే – తనలో – తనలో, "ఈతని నెత్తిన వంచింపవలయు" – నీపాత్రేరా – తనలోరా – "ఈతని నెత్తిన", ... అంటూ అందివ్వబోయాడు. దాని మీదట, రైలుమీద దిగొచ్చి నాటకరంగం ఎక్కిన ఆ పాత్రధారి, చేతి రుమాలు మూతికి అడ్డుపెట్టుకుని, పక్కనున్న ప్రాంప్టరుతో – 'అవునురా. అది తనలో యేగా? నేను కంఠతా పట్టలేదు, పోనీ ఇప్పుడు లోపల అనుకున్నాను. నాటకం కానీండి. నన్ను చంపితే వేషం ఒప్పుకున్నాను' అన్నాడే కాని, ఆ ముక్కలుమాత్రం యుగం తిరిగినా పైకి అనలేదు. అల్లాగా, 'తనలో' అనేది ఒకే వ్యక్తి యొక్క మానసిక వ్యాపారం గనక, – అది ఆ వ్యక్తి యొక్క స్వాంతం గురించే ఉద్దేశింపబడ్డప్పుడు దాన్ని మాటలూ చేష్టలూవంటి గోచరరూపంలో ప్రకటించడం సంభవమేనా? పోని అల్లా కాక, అది ఇతరుల్ని గురించి ఉద్దేశింపబడ్డ వృత్తాన్ని, దాన్ని 'తనలో' అనేపేరుతో వ్యవహరించడం న్యాయమేనా? అటువంటప్పుడు రచన యావత్తూ – అనగా

కళసర్వమూ – తనలోయేనా–అనేవి ప్రశ్నలు. వీటిసమాధానాలు ఇదమిత్థం అనలేం. కాని, హృదయ సన్నిహితం అయిన 'తనలో' లూ, బుద్ధిప్రజ్ఞతో మిళితమైన 'తనలో' లూ కొంచెం ఎడంగా ఉంటాయని ఒప్పుగోవచ్చు! ఇతరుల్ని ఉద్దేశించకపోయినా, 'తనలో' లు ప్రకటన అవుతూండడం పిచ్చి వాళ్ళలోనూ, పలవరించే వాళ్ళలోనూ చాదస్తుల లోనూ మనం గుర్తించగలం. స్ప్రింగులాంటి మనస్సుని అదిమిఉంచే బుద్ధిశక్తిస్థానభ్రష్టం అయినప్పుడు మనస్సు పైకి ఎగదన్ని, 'తనలో' అనేది మాటరూపంలో వెలువడుతుందని తత్వవేత్తలు చెబుతారు. అదీకాక, మానవుడు సాటిమానవుల్ని మనస్సులో పెట్టుగోక, అటు దేవ దేవతలతో ప్రసంగిస్తూన్నట్టుగాని, ఇటు పశు పక్షి జడవాచకాలతో చెప్పుగుంటూన్నట్టుగాని మాటలు వాడి సంభాషణ నడిపించడం లోకదృష్టికి నిరర్థకం అని తోచినా, కళాదృష్టిలో ఫలదాయకమే అని ఒప్పుగోవచ్చు. అందువల్ల ఫలప్రధానమైన కళారచనలో 'తనలో' లు నిల్చిఉన్నాయి. కొందరు హృదయ తుల్యమైన తమ 'తనలో' లు ఇతరులకి తెలియ చెప్పుకో గల సామర్థ్యం భగవంతుడు తమకిస్తే చాలని పరితపించే వాళ్ళూ, తపస్సుధారపోసేవాళ్ళూ ఉంటారు–కవులు. మరి కొందరు తమ 'తనలో' లు తమరు ప్రకటించకపోయినా ఏ యితర మార్గాలవల్ల ఇతరులు పైకి ఎక్కలాగుతారోగదా అని బెంగపెట్టుగునేవాళ్ళుంటారు–నేరస్థులు. వేరే కొందరు తమ 'తనలో' తమ అకర్తృవల్ల శుద్ధశూన్యం కాదు అనుకునేట్టు

చెయ్యగలిగితే తమరికి జన్మతారకం అని భావించేవాళ్ళున్నారు – మూర్ఖులు. సరి, కొంతమంది అసలు తమ 'తనలో' పారేసి, మరొక తనలో ప్రకటించి, అదే తమరిఅసలు 'తనలో' అని జనం నమ్మేటట్లు చెయ్యాలని యత్నించి – కొండొకచో పట్టుబడేవరకూ – నెగ్గేవాళ్లున్నారు – అబద్ధాలపుట్టల్లో కూడు పుట్టించేవాళ్లు.

జరిగిన కథవంటిది వర్ణించడంలో తన సృష్టించే తన చుట్టూనే కథ నడిచినట్టు రాయడం ఒక రకం తనలో! ఉత్తరాలూ, డైరీలూ, ఆత్మకథలూ, రాయడం ఒకవిధంతనలో! కొందరు వ్యక్తులంటే కిట్టక, వాళ్ళ యథార్థ దోషాలుకొన్ని, మిథ్యాదోషాలతో కుచ్చెత్తి అవి తనమీద పెట్టుగుని తద్వారా అప్పట్లో ఆవ్యక్తులకి అసహ్యమూ, లొక్కినవాళ్లకి గందరగోళమూ కలిగించి నిర్వ్యక్తించేటట్టు చేసేరచన మరొకరకం తనలో! మానవుల్ని స్థూలంగా మనస్సులో ఉంచుకుని, చెప్పీచెప్పడంతోటే దోషాలుగా ప్రతీవాడికీ, తోచగలవి తీసి అన్యులకి బోధ చెయ్యడానికోసంకానట్టు కనిపించి, ఆదోషాలు తనకే ఆరోపించుకుని, రచించి ఆ రచనకి ఏదో ఇతరఆకర్షణకలిగించి, మరోసారి, మరోమనిషి మరోచోట చూడడానికి అవసరం ఉండేటట్టుచూసి చేసింది. అంతకంటె ఆరోగ్యకరమైన 'తనలో'! 'తనలో' ఉంటేనే ఒక వ్యక్తి అవుతాడు. వ్యక్తి తెలిస్తేనే 'తనలో' నిలుస్తుంది. ప్రకటనలేని శుద్ధ తనలో – పరమాత్మస్వరూపం అనాలి.

(ఫిబ్రవరి. 1948)

# నవ్వు

[ ఈవిషయం ౧౯ - ౨ - ౧౯౩౯ తేదీని రాజమండ్రీ ఆర్ట్సుకాలేజీలో రావు బహద్దర్ శ్రీ మంత్రిప్రగడ నరసింహంపంతులుగారి అధ్యక్షతకింద జరిగిన పూర్వవిద్యార్థి వార్షికోత్సవ సమావేశసందర్భంలో మొదటిసారి ముచ్చటించాను మళ్ళీ ౨౩ - ౧ - ౧౯౪౩ తేదీని మెడ్రాసు ఆంధ్ర విద్యార్థిసమితి సమావేశాల సందర్భంలో శ్రీ శ్రీపాద సుబ్రహ్మణ్యశాస్త్రిగారి అధ్యక్షతకింద గోఖ్లేహాల్లో జరిగిన సభలో - టూకీగా - చెప్పాను ఇప్పుడు ప్రకటించింది చాలావరకు రాజమండ్రీసభనాటి ధోరణే. ]

మానవులు నవ్వేవారట. సాధారణంగా నవ్వుతూంటారు. ఇప్పుడు నవ్వుతున్నారు. చూడండి. ఎందుచేత? నవ్వగల్గుగనక. నేనూ నవ్వగలను, కాని నా ప్రస్తుతోద్యోగంలో వీల్లేదు - వడ్డించేవాడు వడ్డనసమయంలోనే తనుకూడా ఓ చేత్తో తింటూ వడ్డిస్తే భోక్తలకి అసహ్యంగా ఉంటుంది. నవ్వించదలుచుకున్నవాడూ నవ్వితే, నలుగురూ నవ్విపోతారుగాని నవ్వరు. కాని, నవ్వితేనే మానవుడట! మానవుడికి మాత్రమే నవ్వేశక్తి ఉంటూ! మానవేతరానికి ఆప్రజ్ఞ లేదు. గుఱ్ఱం, కోతీ, సివంగీలాంటి జంతువులకి కూడా నవ్వు తెలుసునని కొందరి నమ్మకంట. అయితే, అవి కోపంలోనో, బాధలోనో ఉంటూ అరిచేటప్పుడు నరాలు పట్లట్టి పెదిమలు వెనక్కి లాక్కుపోవడంవల్ల ముఖానికివచ్చే కొత్తవైఖరి నవ్వులా కనబడుతుందేకాని అది నవ్వుకాదు అని శాస్త్రజ్ఞుల ఊహ. అందుకని, నవ్వగలప్రత్యేకవు

హాస్య మానవుడిదే! ఒకచిత్రం. నవ్వేహాస్య మానవుడికి పుట్టుకతో ఉండేది కాదు. పుట్టీపుట్టడంతో ఎవరితరిఫీయతూ లేకుండానే జీవుడు నేర్చి ఉండేది ఏడుపే గాని నవ్వు కాదు. నవ్వు అనేది జీవుడు తోడిమానవుల దగ్గిర్నించి నేర్చుగున్న బాపతు! నవ్వు అంటుదుదినుసు అవడంవల్లా, అనుకరణసాధ్యం అవడంవల్లా పసిబాలుడికిసైతం అది అలవడుతుంది. మరొకటి, దేన్నిగురించి మానవుడు నవ్వడం? అంటే, మానవవ్యాపారాలు గురించే! అనగా, నవ్వేదీ, నవ్వబడేదీ కూడా మానవుడే. రాళ్లూ-రప్పలూ, చెట్లూ, జంతువులూ మొదలైన మానవేతర ప్రకృతినిగురించి నవ్వడం వ్యర్థం గనక మానవుడు నవ్వడు. ఇంతేకాక మరోవిషయంకూడా ఉంది. ఒంటరిగా ఉన్నప్పటికంటె ఏని తెలుసుకోగలిగిన మరో మానవుడు ఉన్నప్పుడే నవ్వు విజృంభించడం. నవ్వు మానవ సంఘవ్యాపారం. ఒక్కడూ ఉన్నప్పుడు మానవుడు, వస్తూన్న నవ్వుని, వినేవాళ్లు లేకపోవడంవల్ల, అపుగోడానికి ప్రయత్నిస్తాడు. జీవం, మార్పూ, బుద్ధీ అనే లక్షణాలు అన్నీ కలిసి ఉన్నవాళ్లు మానవులే గనక, ఏమానవుల్లో వాట్లకి కొరత గాని, లోటుగాని, అభావంగాని, వైరుధ్యంగాని కనిపిస్తుందో వాళ్ళనిగురించి ఇతరులు నవ్వుతారు. ఈసంగతి హాస్యతత్త్వవేత్త అని లోకప్రసిద్ధి చెందిన బెర్గ్సన్ స్పష్టంగా సూత్రీంచాడు. సజీవులై ఉండవలిసిన మానవులు జడత్వప్రకటన చేసి నప్పుడున్నూ (మనిషి బుట్టబొమ్మలా తిరగడం, నవ్వవలసినచోట నవ్వు లేకుండా ఉండడం), నూతన సందర్భాలకి సరి

పడేటట్టు మారవలసిన మానవులు ఒకేఅంశంలో పునఃపున రాచరణ చేసినప్పుడున్నూ (అదే మాటా, అదే చేష్టా పదే పదే) బుద్ధి ప్రయోగించుకోవలసిన మానవులు సంప్రదాయ సాంకర్యంలో పడిపోయి నప్పుడున్నూ (చూసి అను కోవలసిన చోట అనుకుని చూడడంలాగ) తప్పకుండా హాస్యాస్పదు లవుతారనిన్నీ, మానవులు హాస్యాస్పదులు కావడానికి మరోవిధం ఉండ జాలదనిన్నీ అతను చెబుతాడు. అల్లాగా, సాధారణ మానవుల ఇంగితాన్ని బట్టి న్యాయతః ఉండవలసిన సందర్భానికీ, ప్రత్యక్షవాస్తవిక సందర్భానికీ – అనగా పెట్టుకున్న ఆశకీ, గోచరించే ఫలితానికీ – ఎంతెంత వ్యత్యాసం, ఎంతెంత అంతరం, ఎంతెంత దూరం ఉంటూంటే అంతంతగా, ఇతరుల విషయంలో, మానవుడు నవ్వేస్తూంటాడు. ఎక్కువ హాని లేనప్పుడు ఆకస్మిక సంభవాలకీ (ఎదురుదెబ్బ, ద్వారబంధం తగలడం), కల్పిత సంభవాలకీ (కుర్చీకి అడుగు లేదని తెలియనివాణ్ణి కుర్చీలో కూర్చోమన డం) నవ్వుతాడు. అన్యపరంగా ఉండే తిట్లకీ, మిక్కిలికొత్త, మిక్కిలి పాత ఫాషన్లకీ, అలంకారాలకీ నవ్వుతాడు. ఇతరుల పిరికితనం, భయం చూసి నవ్వుతాడు. ఇతరుల పొగరూ, గర్వం, మదం మొదలైనవి అర్థాంగా భంజనం అయినప్పుడు నవ్వుతాడు. ఇతరుల తెలివితక్కువ, అధికారాలూ, అజ్ఞాన కప్పుకోవాలనే యత్నమూ వల్ల పడే బాధలకి నవ్వుతాడు. ఇతరుల కోపానికి—అందులో వ్యర్థకోపానికిమరీనూ —

నవ్వుతాడు డాంబికానికి నవ్వుతాడు. సంప్రదాయమిశ్రణానికి నవ్వుతాడు ఎంచేతంటే, ఇవి మానవుడికి ఉండకూడని లక్షణాలు. ఈ లక్షణాల విస్తరణంవల్ల మానవజాతికి పతన నాశనాలు ఏర్పడతాయనే నమ్మకం అంతర్యంలో సుప్తమై ఉండడంవల్ల గావును, ఇవి ఏ మానవుల్లో గోచరిస్తాయో ఆ మానవులకి శాస్తి కాగానే ఇతరులు నవ్వుతూంటారు. పైలక్షణాలు పాలకవర్గంయొక్క చట్టాలలో ఉండని నేరాలు. అల్లాంటి నేరాల్ని సంఘం భరించలేక శిక్షిస్తుంది. ఆశిక్షేనవ్వు.

ఇతరప్రేక్ష్యం లేనప్పుడుకూడా, మానవుడు స్వంతపని మీాద చిరునవ్వు వాడుతూంటాడు. మనస్సుయొక్క సంతోషానికీ, ఆనందానికీ వచ్చేది చిరునవ్వేకాని, నవ్వు కాదు. తన బిడ్డని ముద్దులాడేటప్పుడు ( ఓమితమ్మా! ఓమితీ! ), బుజ్జగించేటప్పుడు ( అల్లరిచేయకుండా వరాలతండ్రల్లా కూచోమ్మా మరీ, పొన్నే అమ్మా! ), సముదాయించేటప్పుడు ( నువ్ మంచి వాడవ్, ఏడవకు, అబ్బ ఏడవద్దంటే, వాళ్ళబ్బాయి దిక్కుమాలినరకం—నువ్వేమిటీ - ముత్యాలగొడుగూ! ) అంటూ తనకి పనున్నప్పుడు స్మితం చేస్తాడు. ఎరగనివాళ్ళతో ఎవరితో నేనా అవసరం వచ్చినప్పుడు - అధము, ఆపని నావేరే దాకా - పైపెదిమ పైకెత్తి, "తమవద్ద రూపాయిచిల్లరుందా?" "అగ్గిపెట్టె ఓసారి ఇస్తారూ!" అంటాడు. ఒక్కొక్కరు ఎడం అరచెయ్యి బాగుచేసుకుని ఎదటి వాడికేసి చాచి, మందస్మితంతో 'ఒఖరివ్వ' అంటారు అధికారి ఎదట పడి స్వలాభం కోరుకునేటప్పుడుకూడా కొందరు

లేనవ్వు అభినయిస్తారు ముష్టివాడు ఒక్కొక్కడు ఇకిలిస్తూ ముష్టి కోరతాడు. ఎవరేనా తన ప్రభావం మెచ్చుగునేటప్పుడు సిగ్గుపడి మానవుడు తల వంచుకుని తనకి అది సయించనట్టు, "ఏముటో! మీ చాదస్తంగాని, నాకు అంత ప్రజ్ఞ లేందే!" అని కులుకుతాడు. మనస్సుకిముందు సందేహమూ, అందువల్ల భయమూ కలిగి, వెంటనే యథార్థం తెలిసిపోయి ఆ భయంపోగానే, "ఓరి, ఇదిట్రా, ఏముటో అనుకున్నానూ!' అని ఒక్కొక్కడు నవ్వుతూంటాడు. నమ్మడానికి వీలులేని ఆశ్చర్యంగాని, మహాద్భుతంగాని జరిగిన సంగతి విన్నప్పుడు కనుబొమ్మలెత్తి, నోరు తెరిచి. "అంయ్ అం, నిజంగా!" అని సాధారణుడు నవ్వుతాడు తను వెనకే చెప్పిన మాట ప్రస్తుతంజరగ్గానే, "అ యుందా మంగళం. నే చెప్పలేదుట్రా, మనమాటలు పనికొస్తాయి!" అంటూ నవుగుతూ ఒక్కొక్కడు నవ్వుతాడు. బస్తీలో మానవుడు ఒకొక్క పరిచితుణ్ణి హెచ్చరిక చెయ్యడానికి నిశ్శబ్దంగానవ్వి, ఆగకుండా వెళ్ళిపోతూనేఉంటాడు. దూరాన్నుంచి వచ్చిన పరిచితుడుఅతాత్తుగా కనిపించగానే, "ఇదుగో! ఎప్పుడురావటం! ఉంటారా ఇంకా!" అంటూ చాలమంది నవ్వుతూంటారు. పైసందర్భాల్లో చిన్ననవ్వుయొక్క పని ఏమిటీ అని చూస్తే, కలుసుకున్న వ్యక్తులు నవ్వడం అనే ప్రత్యేక ప్రజ్ఞగల మానవజాతికి చెందినవాళ్లే అని స్ఫురణకి వచ్చేనిమిత్తంగావును! [ చిన్న నవ్వుని 'నవ్విక'-అనకూడదేమో-అంటాను నవ్విక బలిసి

బరి తెగి నవ్వు అయిందా, లేక నవ్వు జోరుతగ్గి సాధువై నవ్వేక అయిందాఅనేది మీమాంసిక. ]

అయితే, జీవితంలో హాస్యాస్పదంగా ఉండే సందర్భాలలో తనివితీరా నవ్వుకోడానికి జాలిమనస్సు ఒప్పుకోదు, ఎందుచేతంటే, ఆ సందర్భాలలో చిక్కడిఉన్న వ్యక్తులకి మాత్రం ఏకొంత వరకో బాధా, నొప్పీ, కష్టం, నష్టంలాంటివి కలుగుతూండడం స్ఫురణకి రావడంచేత. కాని, పదరచనలు గల గ్రంథాలు చదివినప్పుడుగాని, విన్నప్పుడుగాని, వాటితో పాటు స్వర, రేఖా, చేష్టారచనలైనాసరే ప్రదర్శించగా గమనించినప్పుడుగాని-రచన అనేదికాల్పనికం గనక-ఏ ఒక వ్యక్తీ నిజంగా బాధపడడం అనేది (తనకి అన్వయించుగుంటే తప్ప!) అక్కడ లేకపోవడంవల్ల, ఏ విధమైనబాధా ఎవ్వరికీ లేని నవ్వు కలగవచ్చు! పదరచనలో చమత్కారంవల్ల మెప్పుతోకూడిన లేనవ్వూ, స్వారస్యంవల్ల పెద్దనవ్వూ పుడతాయి చమత్కార స్వారస్యాల సరిహద్దు తేల్చడం కష్టం. ఒకటి పాండిత్య ప్రధానమై పదార్థమాత్రమై తాత్కాలికం అవుతుంది, రెండవది సున్నితమై మార్దవంతో కూడి గంభీరమై శాశ్వతంగా ఉంటుంది ఏదైనా భాషలో ఒకొక్కమాటయొక్క అనే కార్థత్వగుణమే చమత్కారానికి మూలమని జ్ఞానులు చెబుతారు. నాదసామ్యంగాని, వైరుధ్యంగాని గల రెండువర్ణాలూ, అర్థసామ్యంగాని వైషమ్యంగాని గల రెండు పదాలూ, భావసామ్యంగాని, వ్యత్యాసంగానిగల రెండువాక్యాలూ ఒకేచోట సంపుటీ అయి అను

ప్రాస వక్రోక్తి అన్యాపదేశం ఉత్ప్రేక్ష నీచోపమవంటి శబ్ద అర్థ ఉభయాలంకారా లుండి, తన్మూలంగా నింద, పరిహాసం, ఎగతాళి, ఎత్తిపొడుపు, ఈసడింపు, ఎకసక్కెం, గేలి, హేళన, వెటకారం మొదలైనవి ఉద్దేశప్రకారం ఫలించినప్పుడు 'ఓహో' తో కలిసిన నవ్వొస్తుంది. గణితంలోనూ, గానంలోనూ, హాస్యంలోనూ ఎదటివ్యక్తినించి సిసలైన జవాబు వెంటనే రావాలి, అనుకోవాలి. ఈ మూడింటిలోనూ కూడా, తత్క్షణస్ఫురితం, రానప్పుడు సాధనాల్ని మెచ్చరు; వచ్చినప్పుడు సాధనా లివే సాధ గాలని దుఃఖించరు. అల్లాగే రెండు పరస్పరవిరుద్ధలక్షణాలు ఒకేపాత్రలో ఇమిడిఉన్నప్పుడుగాని, రెండు పరస్పర విరుద్ధ స్వభావాలుగల ఇద్దరు వ్యక్తులు సమావేశ మయినప్పుడుగాని భాషాలంకారాలతోనూ, భావతోనూ నిమిత్తం లేకుండాకూడా నవ్వురావచ్చు. స్వరహాస్యం ఉంది. వివాదిస్వరాలు ఏకంగా గాని, వెన్వెంటనేగాని వచ్చేగానం నవ్వొస్తుంది. ఖరగానంలో అటువంటి విశేషమే జనాన్ని నవ్విస్తుంది. నవ్వొచ్చే ప్రతీ గానంలోనూ అటువంటి సంబంధం ఉంటుంది. పరిచయమైన గొప్పకీర్తన ఫణితి తీసుగుని దాని గంభీరపదాలకి ప్రత్యామ్నాయిగా నిత్యకృత్యపు ముక్కలు బనాయించిపాడితే నవ్వొస్తుంది. ఒకరి గాత్రంతో ఇంకొరిగాత్రపు సంగతులు పలికిస్తే నవ్వొస్తుంది. మిత్రులు శ్రీ ఇమిటేషన్ ఆచారిగారు తెలుగులో పరిచితులే. రేఖారచనల్లోనూ హాస్యశాఖ ఉంది, మానవ వ్యక్తి యొక్క మొదటి దురాశా, చివరిఅపజయమూ ప్రత్యక్షంచేసే

చిత్రాలు ఒకదానిపక్కనే రెండోది ఉంటే నవ్వు పుట్టిస్తాయి. వ్యక్తులలక్షణాల్ని బట్టి గీసిన వికారరూపాలూ, దుస్థితిని సూచించేబొమ్మలూ, వ్యక్తిస్ఫురణ చేసే జంతుసాంకర్యాలూ, అన్యాయంలో వ్యవహరించే వ్యక్తి యొక్క కథ ఎదురుతిరగడాన్ని సూచించే బొమ్మలవరసా-ఇవన్నీ నవ్విస్తాయి మిత్రులు శ్రీ తలిసెట్టి రామారావుగారు తెలుగులో పరిచితులే.

ఇల్లానే చేష్టల్లో. ఒకేచేష్ట యాంత్రవతుగా ఉండడంవల్లా, విరుద్ధ చేష్టలు రెండు వెన్వెంటనే రావడంవల్లా, అవస్థకి సంబంధం లేని చేష్ట వల్లా, మాటకి విరుద్ధమైన చేష్టవల్లా, ఇంకా అనేక విధాలుగ ఉండే చేష్టారచనవల్ల సార్వత్రికమైన నవ్వు జనిస్తుంది. మిత్రులు శ్రీ గండికోట జోగినాథంగారూ, శ్రీ దుగ్గిరాల సత్యనారాయణరావుగారూ తెలుగులో పరిచితులే. ఇక, ఏమీ చేష్టలేకుండానే, అన్యమహావ్యక్తుల రూపసాక్షాత్కారం చెయించి, సానందమైన నవ్వు కల్పించవచ్చు. డాక్టర్ చంద్రశేఖరం ఎం. ఏ. గారు తెలుగులో పరిచితులే. (వ. రా. - డ్రాక్టర్ అంటే ఫన్ డాక్టర్ అన్న మాట, ఎం. ఏ. అంటే మేకప్ ఆర్టిస్టు.)

ఈరీతిని, అనేకవిధాలుగా. వాస్తవికాలైన పరవిషయ స్వవిషయాల్లోనూ, కేవల కల్పితాలైన పద, స్వర, రేఖా, చేష్టాది రచనల్లోనూ, పాత్రలలోనూ, సంఘటనల్లోనూ ఎంత విరివిగానేనా వాడకంలో ఉంటుంది నవ్వు. అట్లాంటి నవ్వునీ, నవ్వురచనల్నీ గురించిన మెప్పూ, నిరసనా, అభిప్రాయభేదమూ గమనిస్తే మళ్ళీ నవ్వొస్తుంది. సాహసించి హాస్య

ప్రజ్ఞ కనపరిచి అయితేం హాస్యాస్పదుడై అయితేం, సాటి ఇతర మానవుల్లో ఒక్కడ్నైనా సరే నవ్వించగలగడం అనేది జరిగింతరవాత, నమ్మవలిసిందిగనక, ధన్యమేమో అని తపించేవాళ్లున్నారు, అది కష్టసాధ్యం అని గుర్తించినవాళ్ళూ ఉన్నారు. పాడినగానం పట్టివ్వకపోతే, గానం అర్థప్రమేయం లేసిని గనక, అవతలవాడికి ఆ బాణీ రుచిలేదనో ఏదో వాదించుకోనేనా వచ్చు. కాని, హాస్యం పట్టివ్వకపోతే, అది విప్పి చెప్పి వ్యాఖ్యానం చెయ్యకుండా రవ్వున పేలవలిసిందే గనక, లోటు ఎవరిదైనా సరే, అపజయంమాత్రం కారకుడే పబ్లిగ్గా మోసుకోవాలి. అందువల్లకూడా తెలుగులో "సగం చచ్చి సంగీతం, అంతా చచ్చి హాస్యం" అనేది పుట్టిఉంటుంది. రసాల వయస్సునిబట్టి కడసారపది హాస్యం. కొన్ని దేశాల్లో నేరు నవ్వించే రచనలకి (కే) విలువ అధికం. మన దేశంలో (పైరగాల) హాస్యరచనయొక్క విలువమాట దేవుడికి తెలుసు, మన్నన ఇటీవల చెప్పద్దు, ప్రోత్సాహం అల్లా ఉణ్ణోండి, దోహాతం తరవాత మాట్లాడదాం, దాన్ని క్షమించేనా ఊరుకోక, పైపెచ్చు తెరచాటు యాగీకూడా మొదలెడతాడు - ఆంధ్రుడైన ఒక్కొక్క ఆంగ్ల జ్ఞానేశ్వర్! కొందరు పూర్వీకులు చప్పరించి, "నువ్వనాలుగిందాలా నష్టం" అంటారు. (అనగా నాలుగు పురుషార్థాలా) అని గావును!) కొందరు కొప్పడి, "నవ్వులల్లా పువ్వులవుతాయి" అంటారు, (అనగా క్షణంలో వాడిపోతాయి అనిగావును!). నవ్వు నవ్వడలో ప్రాణం పోగొట్టుకున్నవాళ్ళ పేర్లు చాలా

ఉన్నాయి. నవ్వడం ప్రమాదం అనేవాళ్లున్నారు. నవ్వువల్ల ఊడిన ఉద్యోగాలూ, తప్పిపోయిన సంబంధాలూ జ్ఞాపకంచేసి నవ్వుమానాలనేవాళ్ళున్నారు. మనసారా నవ్వడం అనేది తుంటరితనమూ, ఆకతాయితనమూ గనక ఏబిక్ష పిసరో ఏడుస్తూనే నవ్వడం మంచిది అని సలహాయిస్తూ, నవ్వేవాళ్ళ మీద పళ్లుకొరుకుతూ, తమకి వచ్చేనవ్వుని ఉబకనియ్యక - (అసలు నవ్వనేది బలవంతపెట్టి మొహమాటపెట్టి చావగొట్టినా రాదు, బయల్దేరింతరవాత ఆగమన్నా ఆగదు!) - చచ్చిచెడి ఆపేసుగుని మింగేసుగుని జీవితం అంతకీ ఓనూలేనా, నోటినిండా కాదు, 'కీపంట' నేనా నవ్వకుండా మటమటలాడిపోయే అమావాస్య రాయుళ్ళు అరుదుగా ఉంటారు. వీళ్ళంతా తమతమ నమ్మకాల్నిబట్టి అన్నా రనండి, ఉన్నా రనండి. ఆంగ్లజ్ఞానేశ్వర్ మట! ఒక్కొక్క ఉద్దండుడు, ఏదేనా హాస్యసందర్భంలో అనేకులు నవ్వొచ్చినవ్వగా, తనూ నభ్యుడైనా నవ్వు పంచుకోక, అవతలకీపోక, తమపదవికి అప్పట్లో లోటొచ్చినట్టు భ్రమించి, నవ్వి చేవాడు (రచయిత, నటుడు, వక్త ఎవడైనాసరే అధమం తనకంటె అధముడనీ, నవ్వించే రచన హాస్యేతరమైన కొయ్యరొట్టి-రాతిపాక-రచనలకంటె ముదురనీ, నవ్వించే అభినయం తను మొదట్లోనే మానుకున్న సగానాభినయంకంటె వికార మనీ - మనస్సులో అనుకుంటే ఎవ్వడికీ తెలియకుండా వొదిలిపోనా!— పైకి తర తమాలతో ప్రకటించి, మొత్తంమీద చెప్పాలంటే- ఎవరూ అడక్కపోయినా సరే - తనకి నవ్వు రానప్పుడు

ఇతరులకి నవ్వు రావడం అనేది (కదుంగదు) 'అశాస్త్రీ
యము' అంటాడు. మరొక ఆంగ్ల సరసుడు, "ఫలానా
హాస్యచేష్టారచనంటే జనం అంతా మూర్ఖులైపోయి, వెంక,
నవ్వేసేవారట! అల్లా వాళ్లి నవ్వేసిఉండడం రూలుప్రకారం
తప్పు! వెనకవాళ్లు నవ్వేసినందుకు ఇప్పుడు వాళ్ళనెంజె
య్యానా అని బెంగెట్టుకున్నాను!" అని బాధమంటాడు. రచ
యిత ఎదటా, రచన జరిగే వేళా నవ్వుతూన్నట్టే కనిపించి,
ఇతరుల సమక్షంలో, కుమ్మరిపురుగులాగ ఈర్ష్య తనహృద
యం దొలవగా, చేతులో ఉండే పసితప్ప తక్కిన అన్ని
క్షుణ్ణంగా తెలిసి దిగద్దు అనిపించుకుంటూండే ఒకొక్క
పూజ్యుడు - మిథ్యాప్రమాణంతో కొలతలు వేస్తూ అతిగిన
ముక్కలు విసందర్భించికొట్టి తెచ్చి వాటికిమ్మతు కడుతూ,
అహంకారం విరజిమ్ముతూ, - ఫలానా రచనవల్ల వచ్చేసిన
నవ్వుఅన్యాయార్జితం అనీ, తనే అటువంటి బలవంతిహాస్యపు
రచన బళ్ళాదిగా, బస్తాదిగా ఎడంచేత్తో, నిద్దరోతూ చెయ్య
గల ననీ, అయినాగానీ అది తన స్థాయీకి నీచం అని మానేశా
ననీ; హాస్యం తనకి చాలాసయిస్తుందిగాని అది అతీతంగా,
ఆదర్శంగా, ఇదిగా, ఎల్లా ఉండాలో అల్లా ఉండాలనీ; వీధులో
దొర్లే ఎంగిలిపదాలు ఎర ఏకరువుపెట్టడంలో తనంత వాడికి
ఒక్కడికీనవ్వు రాకపోవడంవల్ల కొంపమునిగిపోయిందని,
దిక్కుమాలినజనం ఎంత చూడకపోయినా తన బేలనవ్వు - గడ
కర్ర - రచన పైకీటులోనే పడుతుందిగాని మూకని చక్కలి
గిల్లిపెట్టే అసందర్భపుముక్కలబొంత, విని పారెయ్య డానికి
తప్పపనికిరా దనీ; నిందార్హాలూ సభ్యాలవల్లకూడా నవ్వురావచ్చు

గనక నవ్వొచ్చినప్పుడల్లా అవి ఉంటాయనీ: నవ్వనేది తనకే తిన్నగా జీర్ణంకాని ఒకానొక అనిశ్చితపదంయొక్క చంచలార్థావరణ దాటిపోంటే అపవిత్రపు నవ్వు అయిపోతుం దనీ, ఏసందర్భంలో నేనా ఎవరికేనా నవ్వొస్తూంటే వాళ్ళుతక్షణం ఆపుగుని, తన దర్శనం చేసి, అది తన అభిప్రాయంలో ఏ శీర్షిక కిందికి వస్తుందో, ఏ నియమాన్ని అనుసరిస్తుందో, ఏ సూత్రాన్ని ఆశ్రయిస్తుందో కనుక్కుని, తన ఆర్డరుపొంది, వెళ్ళి తత్ప్రకారం నవ్వడమో మానడమో విజ్ఞానలక్షణం గాని, తన్ని లక్ష్యమే చెయ్యక పడిపోయినట్టు తొందరపడి ఫక్కున నవ్వేసెయ్యడం చాలా ఏడవతగ్గవిషయం అనీ, తను ఓమూల స్వయంగా "నవ్వడం మిక్కిలి కష్టమైన పని" అని శాసిస్తూండగా, నవ్వించడం గురించి అట్టహాసం చెయ్యడం హాస్యాస్పద మనీ, - రోగం కుదిరిన లోకం తన ఏకాభిప్రాయ పథ్యంకోసం నకనకలాడుతోందా అన్నంత తొందరపడి, శ్రమకోర్చి, ఘోషణ చెయ్యగా, ఎందుకో ఎందుకో నవ్వడంమాట ఎల్లాఉన్నా జనం ఇందుకు మాత్రం విధిగా నవ్వడం జరిగితీరుతుంది! ఒక్కొక్క హేమాహేమీ "మూర్ఖజనాకర్షణలో ఏముంది పోదూ" అనేసి తను అందుకోసమే పాకులాడుతూ, తన అనిష్టుతులో తనికి కనిపించే లోపాల అభావమే తన యిష్టుతులో ఉండే మాహాత్మ్యం అని మురిపిస్తూ, తన సర్వజ్ఞదృష్టికి అందని అంశాలు ఒకటి రెండు ఉన్నా అవి చవటరకమే అని మొరాయిస్తూ, ఇతరుల

హాస్య రచన జరిగే వేళ తనూ (దుష్టు అవుగుని) నవ్వి,
తరవాత తనకి స్వాధీనులైనవాళ్ళదగ్గిర (మాటల విలవ
వక్తకీ, విషయానికీ ఉండే సంబంధాన్ని బట్టి ఉంటుందనే
మాట మరిచిపోయి) ఆరచనలో పసా, భాషా, కథనప
దాలూ, కొట్టుగోడాలూ, నీతీ, సత్యం, స్వభావసిద్ధీ, సంద
ర్భశుద్ధీ, అవసరమూ, ఉద్దేశమూ, దిబ్బా దిరుగుండం,
ఇంకా తనకే తెలిసినలక్షున్నర ఇతరసంగతులూ, (అనగా
సాధారణంగా, ఆరచనలో తను లేవనుకున్నవీ, అటువంటి
రచనలో ఉండనివీ, ఉండజాలనివీ, ఉండక్కర్లేనివీ, ఉండ
కూడనివీ మరో చోట దొరకేవి) "ఇందులో ఎంతనూ
త్రమూ లేవు" అనే మహాసత్యం ఒంటిచేతిమీద పరిశోధించి
కనిపెట్టి, లక్షణగ్రంథపటాటోపవు పడికట్టురాళ్ళ "కాభా
షలో" జోరుగా శాసించడంలో, స్త్రీబాలవృద్ధు లుండే
మహాసభమీద గోచరించే ప్రత్యక్ష ఫలితమే పరమావ
ధిగా గల హాస్యవ్యాపారంలో మిడిమేళపు మధ్యవర్తి ప్రమే
యం లేని సంగతి గుర్తించక నవ్వులో చొరబడి, నవ్వుకట్టె
యించడానికి ఇంతా బయల్దేరినవాడు తేలిపోయి తనే ఎర
క్కుండా నవ్వుకి చందాదారై మరీ ఎక్కువ నవ్వు జనించి
వ్యాపించడానికి తోడ్పడతాడు. ఇటువంటి రసజ్ఞులు (గణపతి
దయవల్ల నూటికీ కోటికీగాని ఉండరు!) వాదించేది: హాసం
ఉండాలనీ, హాస్యం తమరికంటె గొప్పది కాదుగనక, ఒక
వేళ ఉంటేకూడా తీసెయ్యాలనీ! దైవచింతగల కొందరి

వాదన: "జీవితం దుఃఖమయం. నవ్వితే దేవుడికి కోపం! నవ్వు ఉండగానే ఏడుపు వుంటుంది-వెలుగుకి నీడలాగా, ధనానికి ఋణంలాగానూ! ఏడుపు నవ్వుని వెన్నంటి ఉంటుంది. ఎవడికో ఏడుపు తెస్తేగాని ఒకడికి నవ్వు రావడానికి వీల్లేదూ! అందుకని నవ్వకూడదూ! ముందు ఏడిస్తేనే నయం, తరవాత నవ్వొచ్చు!" అని. అయితే మరికొందరు అల్లాంటివాళ్ళే: "హాస్" లోంచికదా 'హాస్యం'! హకార సకారాల ప్రమేయం ఆంధ్రులు నిరసన చెయ్యవలసింది కాదు! నవ్వు ఏ ఒకర్నీ ఏడిపించకుండానే కలగచ్చు. ప్రకృతివల్ల కలిగేదుఃఖం భరించితీరవలిసిన మానవుడు తనుకూడ మరికొంత దుఃఖం అభ్యసించడం ఎందుకు? సర్వాన్నీ నవ్వెయ్యగలవాడు ఇహపరాలకి పైవాడు. భౌతిక దృష్టితో చూసినా, మామూలుగా గాలిపీల్చేటప్పుడు శ్వాసకోశంయొక్క ఉపరిభాగమే శుభ్రపడుతుందిగాని, తనివితీరా నవ్వినప్పుడు కోశం మొదలంటా ప్రాణవాయుమయం అవుతుందిగనక, యోగాభ్యాసం సరదాగా అవుతుంది. అందువల్ల నవ్వు మానవశరీరానికి కూడా అవసరమే" అంటారు.

సరే. నవ్వునీ, నవ్వించడాన్ని గురించి భయం, ద్వేషం, కోపం, ఏడుపూ-ఇంతశృంగారం బయల్దేరుతోంది కదా, అసలు 'నవ్వు' అంటే ఏమిటి? అనే ప్రశ్న వస్తే, ఇహ్హా' అని ఒఖ్ఖనవ్వు దాఖలు చేసుకోడం తేలికగాని, నిర్వ

చించడం నవ్వులాట కాదు. అందులో, నాఅంత అజ్ఞానికి అజ్ఞానం ఐతే, మరి ఈవాగు డెందుకూ? అంటే, అదే హాస్యం! నా అజ్ఞానం ప్రకటించుగోడానికి! అదెందుకూ? కోష్టుచేసుకుని అట్టే పెడితే, ఎవరేనా కనికరించకపోతారా! అది సరి. సూత్రపదాల్ని తత్త్వజ్ఞులే తిన్నగా తేల్చలేరు. తెలిసినంతవరకు వాళ్ళన్నది చెబుతాను. "ఎదట ఉన్న వస్తువులోగాని, గోచరించే భావంలోగాని, జరిగే విషయంలోగాని ఉండే విపరీతవైషమ్యంవల్ల మనస్సుకి కలిగే ఆశ్చర్యాన్ని మానవుడు సమన్వయం చేసుకుని జీర్ణించుగునే లోపల, కండరాల బిగింపు విలంబనలతోకూడా అప్రయత్నంగా నిర్బంధకంగా బయటబడేరే ఉచ్ఛ్వాసమే నవ్వు" అని ఒక మహానుభావు డన్నాడు "ఏమీ లేనిదానికి పెద్దప్రళయం చెయ్యడమే నవ్వు" అని ఒకరు సెలవిచ్చారు. "మనస్సు మామూలుగా వెళ్ళవలసినదారి హఠాత్తుగా మాయం కావడంచేత, ఆమనస్సు తన కెటూ పాలుపోకపోవడంలో చేసే ప్రయత్నమే నవ్వు" అని ఒక జ్ఞాని అభిప్రాయం "పెట్టుగున్న ఆశ అకస్మాత్తుగా అడుగంటిపోగా ఫలితం శూన్యం అవడం అనేదే నవ్వు" అని ఇంకోరి ఊహ. "తన లాభం వల్లగాని, తన నష్టం తొలిగిపోడం వల్లగాని. అన్యుడికినష్టం, కష్టం, వంచనా వంటివి అర్థంగా కలగడంవల్లగాని, తాత్కాలికమైన ఆత్మోన్నత్యం మానవుడికి గోచరించి, అతడికి తన అహంకారం అనర్గళంగా ప్రకటించుగోడానికి

ఇతరుల ఖర్చుమీద దొరికిన ఆరోగ్యమార్గం నవ్వు'' అని ఒకడి ఉద్దేశం. ఇంకో సుప్రసిద్ధ తత్త్వజ్ఞుడు ఇలా అన్నాడు: ''నవ్వనగా ఆకస్మిక ఔన్నత్య స్ఫురణవల్ల జనించేది అనే మాట ఉంది. ఒకనిలోని అదనపు ఉత్సాహశక్తి పొంగిపొరలడమే నవ్వు అనే రెండోమాట ఉంది. నవ్వు సంఘవైరులైన మానవుల్ని తిన్నపరచడానికి సంఘశిక్ష అనే మూడో మాట ఉంది. ఇంతేకాదు. శ్వాసకోశాన్ని క్షాళనచెయ్యడం, శిరస్సుకి రక్తంతోడడం, ప్రతి మానసికశ్రమకీ ఆటవిడుపుగా ఉండడం, నిరుత్సాహంలో పడకుండా కాపుదల చెయ్యడం, పడ్డవాళ్ళని గట్టెక్కించడం-ఇవన్నీ నవ్వుపనులే కాక, మరోసంగతి! తోటిమానవులకి అనుదినమూ వేలాదిగా కలుగుతున్నా, తన సాయం అపేక్షించని, చిన్నచిన్న బాధల్ని గురించి ప్రతిమానవుడికీ చాలా సున్నితమైన సానుభూతి ఉంటుంది. అటువంటి మానవసానుభూతిని నిష్ఫలదాయకం చెయ్యడమూ, ఫలజనకం చెయ్యడమూ, అని భగవంతుడు తటపటాయించి ఉంటాడు. ఆ సానుభూతి నిష్ఫలదాయకం అయేట్టు చేస్తే, సంఘజీవనం అసంభవం అవుతుంది. లేక దాన్ని సఫలజనకంగా ఉంచాడా, మానవుడు ప్రతీ యితరమానవుడివల్లా రోజుకి లక్షసార్లు బాధపడి కుంగి గతించడంవల్ల మానవజాతి త్వరలో నశించిపోతుంది. రెండిందాలా చిక్కే వచ్చేటట్టు కనపడింది! ఈసమస్య విడగొట్టడం ఎల్లానా అని ఆలోచించి చివరకతడు నవ్వు సృష్టించాడు. ఇతరమానవుల అటువంటి చిన్న బాధల్ని గోచరించి

నవ్వు నుపయోగించుకునే నిమిత్తం ప్రతిమానవుడికీ నవ్వేనే నరంజాంతో సహా సామర్థ్యంకూడా ఇచ్చి, దేనివల్ల మానవుడు కుంగిపోయి గతించి ఉండేవాడో దానివల్లే మానవుడికి కుంగిపోడం, గతించడం లాంటి నష్టాలు రానీకపోడం సరిగదా, ఆరోగ్య లాభంకూడా కలగచేసి ప్రకృతి సాయపడింది. అని నా సిద్ధాంతం'' అని! వీటికి తోడుగా నవ్వుయొక్క ప్రత్యక్ష లక్షణాలుకూడా గమనించడం కర్తవ్యం. (నవ్వులో ముఖం వికసించడం, కళ్లు పెద్దసైజువి అవడం, లేకపోతే నగం అవడం, కనుబొమ్మలు పైకి జరగడం, దవడలు లేవడం, ఎడం అవడం, సొట్టలు పడడం, పెదిమిలు బిగవడం, లేకపోతే దూరం అయిపోడం, తలటెక్కింపు, ఝూడింపు, దంతదర్శనం (దంతాలు అసలుంటేమాటే!), ఒకవేళ పళ్లు పొడుగ్గాఉంటే అప్పుడు వాటిని ఆచ్ఛాదనచెయ్యడం. ఇమడని కట్టుపళ్లైతే వాటిని తీసిచేత్తో పుచ్చుగోడం, భుజాలు ఎగరెయ్యడం, మెలికిలు తిరగడం, 'దుంప తెగిపోను' మొదలైన మాటలతో తిట్లు, కేకలు, కూతలు, అరుపులు, చప్పట్లు బాదులు, పక్కవాళ్ళని దిగదోడడం, కళ్ళనీళ్ళు తుడుచుగోడం, పొట్టనెప్పి తమాయించడానికి "అబ్బ! అబ్బ! ఉండుఉండు'' అంటూ తెములకుండా మాట్లాడడం-లాంటివి నవ్వే సమయంలో కనిపిస్తాయి) చదువురానివాళ్ళు కూడా వీటిల్లో జాతులు పర్పరిచి పేర్లపెట్టుకున్నారు-చిరునవ్వు, నకిలింపు, ఇకిలింపు, ముసిముసినవ్వు, మూగనవ్వు,

గుడ్డినవ్వు, స్-స్ నవ్వు, పకపక, వెకవెక, అట్టహాసం మొదలైనవి. సరి, శాస్త్రజ్ఞులు పేర్లెట్టిన ప్రకారం: స్మితం (కనుబొమ్మలెత్తి కళ్ళువిప్పడం), హసితం (పళ్ళు బయటబడేటట్టు చేసి, పెదిమిల్ని కళ్ళేం వెనక్కి లాగినట్టు ఆకర్ణాంతం లాగి పట్టి ఉంచడం), విహాసితం (చల్లని శబ్దం చెయ్యడం), ఉపహాసితం (తల కూశా ఘూర్ణించడం), అపహాసితం (ఆనంద బాష్పాలతో సహా గోలగా నవ్వడం), అతిహాసితం (విరగబడి పక్కలు పట్టుగుని గిలగిలలాడి మెలికలు తిరిగి దొర్లి పెద్ద ఏడుపులో లాగ నానాయిదీ అవడం)!! కాని, మరి కొన్నిరకాలు చెప్పచ్చు. తలకాయనవ్వు: (తల మాత్రం తెగఝాడిస్తూ వంచేసి కళ్లుమూసుగుని నవ్వడం) లయధాటినవ్వు: (తాళం వెయ్యడానికి వీలై ఉండేది). తుపాకి నవ్వు: (పెదిమిలు బద్దలు చేసుగుని రపన్న బయల్దేరేది), కొనవూపిరి నవ్వు: (గుక్క తిరగని సమయందాకా మాట్లాడి అప్పుడు మాటా తెమలకుండా నవ్వూ రాకుండా నవ్వడం). కోతినవ్వు: (నవ్వేమో అని ఇతరులు భ్రమించేది). దాగుడు ముచ్చినవ్వు: (అధికారి ఎవరేనా కని పెడతాడేమో అనే భయంచొప్పున ఆపేసుగోడానికి ప్రయత్నించేటప్పటిది.) డోకునవ్వు దగ్గునవ్వు కొలిమితిత్తినవ్వు: గుక్కబడి నవ్వు. సరి, విషపునవ్వు: (నవ్వుజాతిలో చెడపుట్టి లోపలి ఏడుపుని ఓ పక్కనించే వెళ్ళ కక్కేది).

మరి రెండుమాటలు. నవ్వాలిగ్గ సందర్భాలకంటె నవ్వకూడని సందర్భాలుకూడా ఎక్కువ జ్ఞాపకం ఉంచుకోతగ్గ

వని ఒకజ్ఞాని అంటాడు. - ప్రకృతివల్ల వచ్చిన స్థితికి నవ్వవద్దంటాడు, అనగా, గుడ్డీ, కుంటీ, నత్తీ, చెవిటీ, అవిటీ వాళ్ల స్థితిని గురించి! మృతుడైనవాణ్ణి గురించీ, అక్కడ లేనివాణ్ణి గురించీ, అన్యత్వారోపణ చేసిఉన్నవాణ్ణిగురించీ నవ్వకూడదంటాడు. 'భగవంతుడిమాట' అని మనం అనుకునేదాన్ని గురించి నవ్వరాదంటాడు. ఇంకా, దీనులూ, హీనులూ, అర్భకులూ, వృద్ధులూ, పరదేశులూ, అపరిచితులూ, వికలాంగులూ, దరిద్రులూ, అజ్ఞానులూ, పరాజితులూ - వీళ్ళని కూడా హాస్యలక్ష్యం చెయ్యడం మానుషం కాదంటాడు.

మానవుడు ఇతరుల్ని గురించి నవ్వడంలో అహంకార మమకారాలవల్ల పెట్టే ఈర్ష్యాకుత్సితాలు ఉండితీరతాయి. ఎంత సభ్యమైన నవ్వులోనేనా ఏకొంచెమో అవి తప్పవు. వాటిని అల్పతమంచేసి కరుణకి ఏమాత్రం జాగాలేని పట్టు చూసి. అసభ్యతలోపడి నవ్వుయొక్క ముఖ్యలక్షణాన్ని బలెయ్యక, తాత్కాలికోపయోగం కోసం కాక. దూషణే గమ్యంగా పెట్టుకోక, వ్యక్తుల్ని మరిచి, సంగతి వీలైనంత తన మీద పెట్టుగుని, మోతాదుమీరక, శ్రుతితప్పక, స్థాయి చెడక, మర్యాద మించక ఉండేస్వారస్యంవల్ల జనించేనవ్వే సభ్యమైన నవ్వు ఎంత తేలికో, నవ్వించడం! ఎంత తేలికో: నవ్వు!!

[9]

# దీపావళి

మొట్ట మొదటి సజీవవ్యక్తి భూమిమీద అవతరించడానికి పూర్వాన్నుంచీకూడా కొన్ని పదార్థాలు భూమిమీద ఉండిఉండాలి. వెనకన్నించీ ఉండుకుంటూన్నది ఏదైనా సరే కాలదోషంవల్ల 'భూతం' అనిపించుకుంటుంది. భూగోళం మీద జీవరాసులు జనించడానికి సరేసరి, నిలవాలంటేకూడా అధమం అయిదు మహాభూతాలూ కూడితీరాలి అన్నారు. వాటిల్లో ఒకటి 'వెలుగు'! నిరంతరంగా కాకుండా, ఇస్తూతీస్తూ సగంసగంగా దేవుడు మానవుడికి ప్రసాదించే దినము వెలుగే! ఆ వెలుగుయొక్క అభావం 'రాత్రి'! ఇతర భూతాలలో మూడైనభూమి వాయ్వాకాశాలకి అభావమే కలగదు. తక్కిన జనానికి ఒక వేళ కలుగుతుందేమోఅని మానవుడు జాగ్రత్తపడగల్గడు. కాని సూర్యతేజంగూర్చిన సంగతే వేరు. ఆ కాంతి ఉన్నప్పుడు పోగుచేసి భద్రపరిచి సూర్యుడు లేని అదనుచూసి పైకి తీసి వాడుకుందాం అంటే లొంగేరకం కాదు. అందుచేత, దాని అభావకాలం మొదట్లో మానవుడికి చాల ఇబ్బందిఅయింది. రాత్రి సమయాల్లో అటువటి బాధ ఏకొంతవరకేనా తొలగడానికి ఆదికర్త చంద్రుణ్ణీ గ్రహతారల్నీ ఖంజాయించాడా అన్నట్టు కనపడుతుంది. కాని, చంద్రుడికి క్షయవ్యాధీ, గ్రహాలకి పరభృతునా తారలకి చికిలింత చూపులూ అవడంవల్ల, మానవుడికి భయం

పోలేదు, ధైర్యం రాలేదు, చిక్కు విడలేదు, పని జరగలేదు. సూర్యుడు అభావంగా ఉండే వేళల్లో పండువెన్నెల్ని మించిన తేజంయొక్క అవసరం మానవుడికి కలిగి, అతడు కృషిచేసి అనుభవం ఆర్జించి మననంచేసి మథనంచేసి అటువంటి వెలుగుని సాధించాడు. అల్లాంటి వెలుగుని సృష్టించగల ఈప్రజ్ఞ మానవుడు నేర్చాడని, దేవుడి మంత్రివర్గంలో ఉండగల దురుసు రకాలకి కోపంవచ్చి ఉంటుందనిన్నీ, అల్లాంటిమానవుల్లో ప్రథముణ్ణి శిక్షించడంలో, వాణ్ణిచంపేస్తే బతికిపోతాడని వాళ్ళకి భయమేసి, బతికిఉండనిచ్చే చిరకాలం వాణ్ణి చంపుగుతిన్నారనిన్నీ కొందరి అభిప్రాయం. దీపం అనేది కనిపెట్టుగోడంలో, దినదినమూ ప్రకృతి, మానవుడికి తెచ్చిపెడుతున్నా లోటు భర్తీ చేసుకున్నాంగదా అని మానవుడి గర్వం! మళ్ళీ, తక్కిన మహాభూతాలైన భూమి వాయు జలాకాశాల విషయంలో సృష్టికి ప్రతిగా మానవుడు చెయ్యగలిగిన సృష్టిగురించి మానవుడికి గర్వంలేనట్లు తోస్తుంది. ఎందుకో తెలియదు. బహుశా అది దినుసుఉన్నమీదట ఉపరిగా చేసిన సృష్టి! ఇది, ఆ దినుసుఏమీ లేనప్పటి సృష్టి. అందుచేత దీపం విషయంలోనే మానవుడిగర్వం అనేది ఉండబట్టక ప్రకటన అయితీరుతుంద కాదుకాదు. ప్రకటన అయిన తరవాతే గర్వంఅని తెలియడం! వాతావరణాన్నిబట్టి గర్వం కొచ్చుతుంది. ఏదేనావస్తువు, వెలుగు చిక్కపడ్డకొద్దీ, రాణిస్తుంది. కాని, వెలుగనేది, చీకటి దళసరి అయినకొద్దీ, రాణి

స్తుంది. అల్లాంటి ఒకరాత్రి కాలాన్ని కొలిచి నియమించుకుని దీపసృష్టినిగురించిన తన గర్వాన్ని ప్రకటించుకోడానికే గదా దీపాలు వరసనిపెట్టేసి మానవుడు చూస్కోండి నా తడాఖా అన్నట్టు రంగువేషాలు వెయ్యడమూ, ఎగిరిపడడమూ, పేలాపనానూ: దీపావళి ముట్టించి ఎక్కడలేని హడావిడీపడి ఎక్కడలేని ఆనందమూ పొందడం అందుకే! కాని, అయిఉం డకూడదేమో! తనజీవితంలో ఎంతో అవసరమని తను పరి తపించిన మీదట భూమిమీద అవతరించిన దీపాన్నే మానవుడు గౌరవిస్తున్నాడనిగాని, లేక అటువంటి జీవితావసరాన్ని తను సృష్టిచేసుకోగలిగిన ప్రజ్ఞ తనకిచ్చినందుకు ఆ ప్రజ్ఞాఫలితాన్నే మానవుడు ఆదికర్తకి నజరానా ఇస్తున్నాడనిగాని, మనం అనుకోగలిగితే దీపావళులు జరిపే జాతుల్లోని వ్యక్తులు పడుతూండే శ్రమా, పొందుతూండే ఆనందమూ సార్థకం అనవచ్చు.

ఇందాకణ్ణించీ ఏగో 'భూతం' అంటోచ్చాను అంతకి పూర్వమే 'కాలం' అనేది తెలిసిఉండాలి. కాలం అంటే ఏమిటో తెలియదు. సూర్యప్రమేయం లేకపోతే కాలమూ లేదు భూమీ లేదు మానవులూ లేరు. కొలవడానికి వీల్లేని కాలాన్ని ఎల్లాగో సూర్యుడు బయల్దేరి రెండుమూడు రకాలుగా కొలుస్తున్నాడు ఒక కొలతలో దినం ఏర్పడుతుంది. అన్నిదినాలూ ఒకటేమాదిరి అనుకుంటే మానవవ్యాపారం ఈసూరుమంటుంది. ఎడారిలాంటి కాలంలో మానవులు చలవ

పందిళ్ళులాంటి పర్వదినాలు ఏర్పరుచు కున్నారు పండగలు లేని మానవజాతి ఉండదు. మహాదినాలు వస్తూన్నట్టు తోచకపోతే ప్రస్తుతదినాలు యుగాలుగా తోస్తాయి. ప్రతీ జాతియొక్క ప్రతీపండగా ఒక మహావిషయం గురించి ఆది కర్తని స్మరించే తరుణంకోసం ఉద్దేశింపబడి ఉండాలి. ప్రతీ పండగా ఒక సంస్థ. సంస్థని స్థాపించినవాడి ఉద్దేశం వాడితో గాని, ఒకొక్కప్పుడు వాడుండగానేగాని, పోతుంది. అక్కణ్ణించి ఆదికర్త స్మరణా ఉండదు. ప్రత్యేకకర్త ప్రమేయమూ ఉండదు. సంస్థ మరో గాడిలోకి వెళ్ళిపడుతుంది. సంస్థ యొక్క ప్రధాన విషయం కప్పడిపోగా, అల్పవిషయాలకి రోజు ఏర్పడుతుంది. అటువంటివాటిలో దీపావళి ఒకటి.

దీపావళిలో 'దీపం' వేసి చూడకుండానే కొందరు మాట్లాడతారు. వెనక ఒక రాక్షసుడు చచ్చిపోయాడు గనక వాడి నిమిత్తం మనం పిండివంటల్తో భోంచెయ్యాలనీ, దీపావళి నాటికి వాన్లు వెనకట్టడం జరుగుతుంది గనక లోగడ పుట్టిపెరిగిన క్రిమి కీటాదులు (నలక-రలయోరభేదః) సమూలంగా నశించడానికి దేశంఅంతా తలంట్లు పోసుకుని బాణాసంచా కాల్చాలనీ, అల్లుళ్ళని పిలవడానికి అదే సందర్భం గనక వాళ్ళముఖ తేడం ఎక్కువ చేసేనిమిత్తం మతాబాలు కాల్పించాలనీ, మొదలైన పూర్వగాథలకి తడుముకోనూ అక్కర్లేదు, ఆంధ్రులు నమ్మరేమో అనే భయమూ అవసరంలేదు. దీపావళి కాల్పులకి దరిద్రుడూ ధనికుడూ వివక్షత

లేను; గాని పిన్నా పెద్దా వివక్షతా, ఖర్చూ బేఖర్చూ వివక్షతా, కసీ బేకసీ వివక్షతా ఉన్నాయి. పిన్నలకి ఏదో ఇంత తగలెయ్యాలనీ! పెద్దలకి ఖర్చులేకుండా ఉంటే సరి ఇంకా తగలెయ్యమనీ! దరిద్రుడైనా సరే కసిఉంటే తలతాకట్టెట్టయినా సరే నరకాసురుణ్ణి దహనం చేస్తాడు. ఇంతవరకింకా దీపావళిలో దీపసంగతి అప్రధానం అయిందే కాని, ఆరిపోలేదు. ప్రధానవిషయం చప్పుడు! ఎంత గొప్ప చప్పుడు చేస్తే అంత గొప్ప దీపావళి యోధుడు. దరిద్రుడు కాగితపు టపాకాయలు పేల్చడం, (సంచీలామడిచి, ఒకవేపు చిల్లుచేసి, గాలి పూరించి, అది పొంగినతరవాత నేలమీద పెట్టి ఒఖ్ఖటిచ్చుకుంటే రప్పుమనేది), ఖాళీడబ్బాలు వాయించడం, డబ్బాలోరాళ్ళోసి వేళ్ళాడగట్టి రెండుమూడు రకాల కర్రల్తో బాదడం! – తరవాత తాటాకు టపాకాయలు! ఇవేనా లేకుండా ఎవరూ ఆగరు ఇవి క్రమేపీ చౌకఅవడం కూడా కద్దు. మేఘదర్శనం అయేసరికి ఇవి కాళ్ళు పారజాచేస్తాయి. మరీ నాసిరకం పేలకపోయినా నాలిక గీసుకోవచ్చునని కొందరుకొనడం. ఇవి పేల్తే ఒఖ్ఖపేలుడే! కాని ఎడాపెడా ఎడాపెడా వాయించినట్టు పేలేవి సీమటపాకాయలు! ఎల్లానూ సీమ సీమే! కొందరికి ఇంకా కసి ఆగక, రెండుమూడు సీమటపాకాయి గుత్తులు కిరసనాయిలు డబ్బాలోపడేసి అవి ఫెడామడా క్షోభపడిపోతుంటే 'వెయ్ వెయ్' అని కేకలేస్తూ డబ్బాని చావగొట్టడం! గోడటపాకాయిలని కూడా వస్తాం

డేవి, అరుగులమీద పరధ్యానంగా కూచున్నవాళ్ళు ఉలిక్కిపడేటట్టు ఒక్కటి గోడనిబాదేసి, దీపావళివీరుడు పరక్షోభగురించి నవ్వుకుంటూ పోతూండేవాడు. అవే నేల్నొట్టి జబ్బనె ప్పేల్తేలాగ కొట్టేవాళ్ళుకొందరు వీట్లని దించిపోయినవి ఔట్లు. ఔట్లుపేల్చేవాళ్ళు మహాధ్వనికారుల్లో జమ. ఒక దీపావళి రౌతు ఒక ముసలాయనతో చెప్పకుండా ఔటు పేల్చేసరికి ఆయనగుండె ఆగిపోయింది. అది ఆగిపోవడంవల్ల తెలిసింది గాని లేకపోతే ఆయనకి గుండె ఉన్న సంగతి తేలకపోయేదిగదా అన్నాడు ఆ రౌతు. వెలుగుగురించిన ఆరాధనలో మతాబాలు సార్థకం అయినా, అవి కాల్చడం అనేదాల్లో పౌరుషం లేదు పొమ్మన్నారు. ఎందుకంటే-ప్రతి సందర్భంలోనూ ప్రతీవాళ్ళూ మతాబా కాల్చగలరు గనక! కాల్చడంలో ఒకచోటనుంచి మరోచోటుదాకా వెళ్ళి ఇతరుల్ని బాధపెట్టే బాపతైన తూటాలవంటి వాట్లకి ఘరానా ఎక్కువ. ఎడంచేత్తో పంచి పట్టుగుని కుడిచేత్తో అంటించిన తూటా పట్టుగుని ఇటూఅటూ రవ్వలు చిమ్ముతూ, అది ఒకవేళ చీదినా, అరిచెయ్యి దానిమ్మకాయ పగిలినట్టు పగిలినా, కిక్కురు మనకుండా చివరదాకా నిల్చేవాళ్ళూ, 'బాబోయ్' అని తోకముడిచే వాళ్ళూ, ఉండేవాళ్లు. కాని, ఎంత ఎత్తుగ పెడితే అంత గొప్పవాడు అనేది దీపావళిలోనూ నిజమే. దీపావళిభటుడి అసలు అస్త్రం జువ్వ. అతడు జువ్వల రంగడు జువ్వవదలడం కొత్తగా నేర్చుగునేవాళ్లు తాటాకు

చూర్లకీ చుట్టుపక్క జనానికీ భయకారణంగా ఉండేవాళ్లు. అరితేరినవాళ్లు అల్లాంటిపన్లు చెయ్యక, ఊరవతలకి పోయి పాతిక ముప్ఫైగజాల్లో ఎదరెదరగా నుంచుని, జువ్వాలు నేలబారుగా వదిలి, పోటీ చేసుగునేవాళ్లు. దెబ్బలు తగిలినవాళ్ళని తక్కిన వాళ్లు ఇంటికి మోసేసేవాళ్లు. అవీ ఇవీ కొనడంకంటె మనమే కట్టుగుంటే సొమ్ముకిమించిన సరుకొస్తుంది, అనేగడుసుదనంతో వ్యవహరించి, యథాశక్తిగా కళ్లూ, వేళ్లూ, చేతులూ చర్మమూ వొళ్ళూ, ఇల్లూ, ప్రాణమూ ధారపోసిన దీపావళి మతభక్తులుంటూంటారు. సంస్థాపించినవాళ్ళ ఉద్దేశం ఈభక్తి కాదేమోఅని తోస్తుంది. ఏమిటో, చెప్పలేం! కొంత పిరికితనం, , కొంత దారిద్ర్యం, కొంత ఇతరులకి బాధ కలిగి దెబ్బలాట కొస్తారనే భయం-ఇవన్నీ ఉండడంవల్ల, నేను ఏ మతాబాఅగ్గిపుల్లేనా కాల్చి ఉంటాను, గాని ఒకటోరకమైన మతాబాయేనా కాల్చినట్టు జ్ఞాపకంలేదు. ఇదోరకం: "బాణాసంచా అంటే చెవి కోసుగుంటారు, సూర్యాస్తమయాలుచూసిఆనందించలేరు-కొందరుజనం" అంటాడుఒకకవి!

# భూతలం

వచ్చి స్టేషన్లో రైలు ఆగింది. ఒకమూడో క్లాసు పెట్టెలోంచి జనం దిగబోతున్నారు. దిగేవాళ్ళని దిగనీకుండా, ఎక్కే వాళ్ళు రెండు వేపుల్నించీ జొరబడగా ద్వారాల్లో కొందరు ఇరుక్కుపోతున్నారు. కిటికీల్లోంచికూడా గేద్దూడల్లాంటి ట్రంకు పెట్టెలూ బస్తామూటలూ కొందరు అవతల్నించి అడ్డాన్నగా లోపలికి గిరవటేస్తున్నారు. దిగదల్చినవాళ్ళు లేవడంవల్ల కాస్తంత ఖాళీ అవడం గమనించి కొందరు అమ్మయ్య అనుకుంటూ కాళ్ళుజాపి వీలైతే బిచాణావిప్పి పరిచి, పడుకుని ముసుగెట్టుకుని నిద్రా జబ్బా జమిలిగా నటిస్తున్నారు. కొందరు పైమీది కండువాగాని చేతులో సంచీగాని తమరుకూచుని లేచిన స్థలాల్లో ప్రతిష్ఠించి పక్క ఎవరుంటే వారితో 'కాస్త స్థలం మాస్తూండండేం, కాఫీ తాగి వచ్చేస్తాను' అనేసి అవతలవాళ్ళు ఏమన్నా సరే అది అంగీకారం కిందే జమకట్టుగుని, దిగడానికి ఉద్యుక్తులవుతున్నారు. అప్పట్లో తమతో ఆడవాళ్ళూ పిల్లలూ చిల్లర సంసార సామగ్రీ లేని కొందరు అదృష్టజాతకులు రైలుపెట్టెలోపల పడడం అనే విషయంలో కృతార్థులవుతున్నారు రైలు రాగానే లాంతరు స్తంభమే రైలనుకుని, స్టేషనే రైలనుకునీ ఎక్కబోతున్న చాలా మంది అపస్మారపు జనాన్ని సశరీరంగా రైలెక్కించే నిమిత్తం కొందరు పోలీసులు అప్రమత్తులై పని చేస్తున్నారు. క్రమేపీ ధారాపాతంగా పాలకావిళ్ళూ పెరుగు

తట్టలూ నలుముఖాల్నించీ లోపలికి హాజరై పోవడంవల్ల ప్రయాణీకులు తమ కాళ్ళు ఏం జేసుకోవాలో ఎక్కడ పెట్టుకోవాలో తెలియక తన్నుకుంటున్నారు. రైలుకి 'ధూమశకటం' అనే పేరు ఎక్కడమాసిపోతుందో అనే బాధతో ధూమోత్పత్తి చెయ్యడానికి కిటికీలవైపు చెక్కమీద స్థలం లేకపోయినా కొందరు ఎల్లానో ఇరుక్కుని పక్కవాళ్ళ అగ్గిపెట్టిగాని ప్రజ్వలిస్తూన్న చుట్టగాని యాచిస్తున్నారు. లోగడ చెక్కల కింద శయనించిన అయోమార్గసంఘ బంధువులు లేచి, పైకొచ్చి, గాలోసుకుని, సందు దొరకినచోట్ల బైటాయిస్తున్నారు. యథాశక్తిగా అస్పృశ్యతా నివారణ కానిచ్చి ఈ సందడిలోనే ముష్టెత్తాగునే నిమిత్తం ఒక చర్మరోగి రైలు పెట్టెలో ఎల్లాగో పడి, రైలెప్పుడు కదుల్తుందా స్వాంతపాట ఎప్పుడు ఆరంభిస్తామా అని చూస్తున్నాడు సరికొత్త నవలలూ, తాజాబిస్కట్లూ, వడ్లపూడి నారింజలూ, చటాకమందులూ అమ్మేవాళ్లు లోపల మొల్చారా అన్నట్లు సిద్ధమయ్యారు. టిక్కట్లు కొనుక్కున్నవాళ్ళూ, కొనుక్కోలేకపోయిన వాళ్ళూ, కొనని వాళ్ళూ తప్ప తక్కినజనం యావన్మందీ చాలా నిశ్శబ్దంగా ఉన్నారు. హోరూ, కేకలూ, కూతలూ, అరుపులూ, చరుపులూ, దెబ్బలూ, గంటలూ, ఈలలూ, మొరకైన నాదాల మధ్య మాటలుకూడా వినిపిస్తూనే ఉన్నాయి!-(స్థాయిల్లోనూ ఉద్ధృతాల్లోనూ వేగాల్లోనూ తేడా లుండడంవల్ల).

(మర్యాదగా) – 'కొంచెం పైకి జరగండి.'

(ముక్కులు పూరించి) – 'ఇక్కడచోటు లేదు.'

(గదమాయిస్తూ) – 'ఉంటేనే!'

'ఉంటే, అక్కడ నువ్వే కూచోకూడదూ?'

(రోషంగా) – 'శాస్త్ర సద్దుకోవాలి, నలుగురూ చేరి నప్పుడు! టికెట్టు నేనూ కొన్నాను.'

'నేను నీకంటే చాలా పూర్వమే కొన్నాను. నే జరగను.'

(ఈసడిస్తూ) – 'మొండివాళ్ళకి ఏమిటి చెప్పటం?'

(జోరుగా) – 'ఏయ్. మాటలు జాగర్త. ఇదివరకే కోలెడు జరిగాను. అప్పుడు నువ్వు లేవు. నన్ను మాయం అయి పొమ్మన్నావా?'

(నిరసనగా) – 'మాయం అవుతాట్ట! అమాత్రం కూడానా!... నేర్చాడు గడుసుదనం.'

(బెదిరిస్తూ) – 'ఇక్కడ నేను కూర్చునివెళ్ళానండీ, మీరు కూర్చున్నారే!

(నిర్లక్ష్యంగా) – 'ఏమో నాకేం తెలుసూ?'

(తొందరగా) – 'ఇక్కడ నా కండువాపెట్టి వెడితే మీకు కనిపించలేదూ?'

'లేదు.'

(ఆదుర్దాతో) - 'ఇదేమిటీ, నా కండువా మీరే వేసుకుని నా చోట్లో కూర్చున్నారే!'

(చప్పరిస్తూ) - 'ఏమో, నిన్నూ ఎరగను, నీ కండువా ఎరగను.'

'జరగండి'

'జరగను.'

(బతిమాలుతూ)—'పోనీ నా కండువా నా కిచ్చెయ్యండి.'

(కటుకుగా)—'ఇవ్వను. అది నీ దని ఋజువేదీ?'

'ఏమండీ, నేను మీతో చెప్పివెళ్ళలేదూ, స్థలం చూస్తూండండనీ!'

(నసుగుతూ)—'చెప్పారు. అందుకనే స్థలంచూస్తూనే ఉన్నాను. ఇప్పుడూ చూస్తున్నాను'

'ఇది నా స్థలమండీ.'

'నీ తాతసొమ్మా? నువ్ గడించావా? నీ పేరు రాసుందా ఇక్కడ?'

'నా సంచీ పెట్టాను.'

(యథాలాభంగా)—'అవునవును పెట్టారు.'

'నికెందుకయ్యా మధ్యా! ఏమన్నా లంచం పట్టావా? సంచీ పెట్టాట్టమహా! తరద్దీలో సంచీలుపనికొస్తాయా, ఖాళీవి!'

(హేళనగా)—'నన్ను నీమీద కూచోమన్నావు టయ్యా మరీ!'

(నమ్రకంగా)—'మీకు కిందూ మీదా తెలియటం లేదు. ఎల్లా కూచుంటారు?'

(రాజీపద్ధతిగా)—'బాబ్బాబు! ఒక్క క్షణం. కాస్సేపు ఉభయులూ ఊరుకోండి. అంతా దిగిపోయేవాళ్ళే. కాట్లాడ కండి. శాశ్వతం ఎవరూ కారు.'

(అసహ్యంగా)—'చూడండి, లేకపోతేనూ. నేను బయటికి వెళ్ళగా చూసి నాస్థలంలో మూంచి సరుగుడు దే విలా చెక్కు చెదరకుండా కూచున్నాడు.'

(తీవ్రంగా)—'నీ స్థల మేమిటోయ్, స్థలమనేది ఎవరు కూచుంటే వారిదే! కూచో గలిగినవాడు కూచుం టాడు, లేకపోతే నడుస్తాడు.'

(పళ్ళుదగ్గరగా పెట్టి గాలిలాగుతూ)—'నాకాలు పచ్చడికింద తొక్కేశాడర్రోయి, వీడిఇనపచెప్పు కాలోయ్!'

(కుళ్ళి కుళ్ళి ఏడుస్తూ)—'మూస్తూ్డలగా నా బనీపర్సు పోయిల్లడ్డీ! అద్దులో బోలెడు డబ్బులడ్డీ!'

(సిస్పృహగా)—'టముకుపెట్టి మొనతో నా బుర్ర చితగ పొడిచా డెవడో! రక్తం వస్తోంది.'

(మందలిస్తూ)—'అల్లా మీదిమీదికి తోసుకురాకు బాబూ, మరీ.'

(వగరుస్తూ)—'నన్ను అప్ప-అప్ప - అప్పడంలాగ నొక్కేస్తున్నారు ఊపిరి ఆడటం లేదు'

(కుమిస్తూ)—'మీబీడీ నిరుసుల్తో నాబట్ట మూడు చోట్ల కాలింది'

(వికటంగా)—'అబ్బ! ఇంకా ఎక్కువచోట్ల కాల వలసిందే!'

(దెబ్బతీస్తూ)—'మీరు మనుష్యులు కదా ముందేనా గ్రహిస్తారని నా ఆశ'

(ఉమ్ముతూ)—'ఛూ! ఉమ్ముకోడానికే వీల్లేదండీ రైల్లో!'

( చురుకుగా ) - 'వీల్లేకేమండీ! నామీద జరిగింది చుట్టాభిషేకం!'

( తగ్గు స్వరంతో ) - 'ఇది నా సూటుకేసు కానట్టుందిరా.'

'అయితేన్లేస్తూ, ఇది చాలా అందంగా ఉంది'

( ఆశ్చర్యంతో) - 'ఇందులో ఏదో మిలమిలలాడుతూ కదుల్తోంది.'

( భయంతో ) - 'ఓయ్ బాబో! మన కొద్దు. వాటం చూసి పిరాయించు.'

( తడబడుతూ ) - 'తాగని సచ్చినోళ్ళు మాలోంచి పొండోశ్.'

( చిరకోపంతో ) - 'మీ ఆడవాళ్ళు ఆడ పెట్టెలో ఎక్కకూడదుటండీ!' పోనీనూ!

( నిష్ఠూర్యంగా ) – 'సాచుగుని పడుకోకపోతే ఇవతల ఇంతమంది నిలబడగా, నువ్వులేవకూడదుటయ్యా, గొప్ప వాడవ్.'

( దీనంగా ) – 'మూడు రాత్రిళ్ళనించి నిద్దర లేదు.'

( నిక్కచ్చిగా ) – 'ఇది పగలుగా. నువ్వు లేవ్వూ!'

( రూఢిగా ) – 'లేవను.'

'నే నెక్కడ కూచోనూ!'

'ఎక్కణ్ణించి వచ్చావో అక్కడికెళ్ళి.'

'నువ్వు పడుకోడానికి కొన్నావా టిక్కట్టు?'

'అవును నువ్వొస్తావు కనిలాగ అని నాకేం తెలుసూ!'

( కోపధాటిగా )–'చాపకట్టలా పడుకుని పేలాపన సాగించకు, దొర్లించెయ్యగలను.'

'నేనూ పడుకోడానికే కొన్నాను.'

( వెకిలిగా ) – 'ఎవడి దగ్గర కొన్నావో వాడి దగ్గిరికెళ్ళి ఏడ్చుగో, నామీద ఎగురుతావేం?'

'అయితే కాస్కో.'

'మా జట్టు పదిమంది. మా పనికూడా ఒకటే. ఈ స్థానం అంతా మాదే.

( ముక్కుమూసుకుని ) – 'అబ్బబ్బ, కల్లుకంపు. లేచి వెళ్లి మనుషుల్లో కూచుంటే!'

'అమ్మయ్య! గార్డు ఊలేశాడు!'

'పడిపోతారు, మరి ఎక్కద్దు, ఎక్కద్దు, వేళ్లాడద్దు, వేళ్లాడద్దు, వేళ్లాడద్దు! అబ్బీ! ఇనపకమ్మీ గట్టిగా పట్టుగో, దిక్కులు చూడకు. చెయ్యిచాపకు.'

'లోపలికి జరగండి.'

(ఏడుస్తూ) – 'బాబో బాబో చచ్చాను, చచ్చాను!'

'తలుపేసెయ్యండి, నే లోపల పడ్డానుగా!'

'వెయ్యడానికి స్థలంలేదు.'

'అమ్మయ్యా, రైలు కదిలింది బాబూ!'

(కుతూహలంగా) – 'ఏమిటండి అవతల హడావిడి?'

(జాలిగా) – 'ఏముందీ? పాపం ఇద్దరు చక్రాలక్రింద పడ్డారు.'

'ఏమయిందండీ?'

'వాళ్లిద్దరినీకూడా రైల్లోకి తోశారు. అదుగో రైలు కూసింది.'

'విడుతోంది. వాళ్ళకి బాఘా దెబ్బలు తగిలాయి గావును!'

(నిరాశతో)—'వాళ్ళ కాళ్ళూ చేతులూ నలిగి పోయాయి!'

(అమాయికంగా)—'పాపం! వాళ్ళ టిక్కట్లుకూడా నలిగి పోయేఉంటాయ్!'

# వైద్యం

[శ్రీ న్యాయపతి సుబ్బారావు పంతులుగారి అధ్యక్షతకింద 5-8-1928 తేదీని రాజమండ్రీ వైద్యసంఘ ప్రథమవార్షిక సమావేశ సందర్భంలో చదివిన రచన.]

శరీరమనేది బహువిచిత్రమైన యంత్రవిశేషం కాబట్టి దాని యథాస్థితిలో మార్పు కలుగుతూంటుంది. బాల్యం కౌమారం మొదలైనవి పెద్దపెద్దమార్పులు. అవి ఫలానా క్షణం నించి ప్రారంభమనీ నిర్ణయించలేం, అవి బాధాపెట్టవు. కాని, బాధతో కూడుకుని వచ్చే మార్పులు కొన్ని కొన్ని ఉన్నాయి. అవి త్వరలో సర్దుకుంటే వాటిని 'రుగ్మత' అనీ, 'సుస్తీ' అనీ, 'అస్వస్థత' అని వాడతారు, త్వరలో సర్దుకోక ముకాం వేస్తే 'కాయిలా' అని, 'దీర్ఘవ్యాధి' అని, 'సికస్తు పడడం' అని అంటారు. అసలే సర్దుకోక పోతే, శరీరాన్ని పంచభూతాల్లో దేనికో ఓదానికి దాఖలు చేసేస్తారు. అల్ప రోగాలకి అజీర్తిలాంటి కారణాలు గోచరిస్తూనే ఉంటాయి. దీర్ఘరోగాలకి కారణం: ఒక్కొక్క రోగి ధనార్జన వంటి అవసరవుపన్నలో పడిపోయి రోగాన్ని లక్ష్యం చెయ్యక ముదర పెట్టుకోడమే. ఆస్తివిషయంలోకి మల్లేనే వ్యాధుల విషయంలో కూడా స్వార్జిత పిత్రార్జితాలు ఉండగలవు. కారణం దొరకని చోటల్లా జనం జర్మ పొమ్మంటారు. "పూర్వజన్మకృతం పాపం వ్యాధిరూపేణ" అని తీర్పు చెప్పేస్తారు. అందుకనే సంభాషణల్లో:

— పాపం!

— ఏమిటీ!

— ఫలానవాడు

— ఊఁ

— పోయాడు.

— నారాయణ, నారాయణ! ఎప్పుడూ?

— వారం అయింది.

— ఏమిచ్చి!

— ఏం లేదూ. రెండులంకణాలు చేశాట్ట.

— నే చూసినప్పుడు పిడిగాయిల్లా ఉన్నాడస్మీ.

— ఉంటుం! ఎంతసేపూ! నూకలు సరిపోయాయి.

కర్మ తోసుకొచ్చేసింది.

అనే మాదిరిగా వింటాం. అదీ కాక ఒకొక్క జబ్బులో ఉన్నవాడికేసి చూసి కొందరు, 'గ్రహచారం' అంటూంటారు. ఇక, శరీరం యొక్క అవయవాలూ భాగాలూ పదార్థాలూ ఎన్ని ఉన్నాయో అన్నింటికీ అన్ని రకాల రోగాలూ ఉన్నాయి. అంచేత పై విడివిడి అవయవాల వ్యాధులే కాక, లోపలి గుండె, కాలేయంలాంటి వాట్ల వ్యాధులే కాక చర్మ, రక్త, మాంస, నర, అస్థి, శల్యాది వ్యాధులు ఉద్భవించాయి. వ్యాధి అదృశ్యం. వాలకం బట్టి, లక్షణాల బట్టి దాన్ని గుర్తించాలి. కొన్ని వ్యాధులు బలేటక్కరి రకం. రోగి గతించేవరకూ అవి పోలికకే అందకుండా నక్కుతాయి.

కొన్నింటి స్వభావం రోగి గతించిన స్వల్పకాలంలోనే తెలిసిపోతుంది. పైగా, ఇతర జంతువులలోకి మల్లేకాకుండా మనిషికి వాక్కు ఉండడం చేత మనిషి తన రోగం కొంతవరకు చెప్పగోగలడు. కొందరు తమ బాధ ఏముటో చెప్పేసెయ్యక, వతిసచొప్పున అబద్ధాలాడి, తమరోగం ఏముటో ఇతరుణ్ణే కనుక్కోమంటారు. కొందరు తమ రోగలక్షణాలు చెప్పగోక దానికి పడవలిసిన ఔషధ లక్షణాలు ఏకరువు పెడతారు. దాంతో ఔషధా లిచ్చేవాడికి మతి చెడుతుంది. అది సరి. దేవుడు మనిషికి మాత్రమే బుద్ధి అనేది ఇచ్చి, ఇతర జంతువులకి ఇయ్యని స్వరాజ్యం ఇచ్చాడు. అది మానవుడు పరమ స్వాతంత్ర్యం అనుకుని కారణాంతరాలచేత ప్రకృతి విరుద్ధాలు ఆచరించి కని విని ఎరగని వ్యాధులు తెచ్చుకుంటున్నాడు. అందుకనే, మనుష్యుల్లో ఉన్నన్ని రకాల రోగాలు ఇతర జంతువుల్లో లేవు. రోగాలు పుట్టిన కార్తెలోనే వైద్యులు వెలుస్తారు. వైద్యులు ఎల్లానూ ఉన్నారు గదా, వాళ్లుమనస్సులో ఏమన్నా ఇడవుతారేమో అనే బాధతో కొన్ని కొన్ని కొత్తరోగాలు పుడుతూంటాయి ఈటీవల చాలారోగాలూ వాటికి మందులూ కూడా 'లాటిన్' భాషతో జనించాయి వైద్యుల సంఖ్య విజృంభించేసరికి అభిప్రాయ భేదాలు కూడా పెరిగిపోయి వీళ్లల్లో మతాలు ఏర్పడ్డాయి. హిందూ ముసల్మాన్ కిరస్తానీ లాగే, ఆయుర్వేదం, యునానీ, హాలోపతీ మాత్రమేకాక, హోమియోపతీ, మోనోపతీ (అనగా. ఒకడే)

సీతాపతీ (అనగా, రామనామస్మరణ)లాంటి వివిధశాఖలుగా వైద్యం విడిపోయింది. ఇవీకాక, వట్టి మట్టితో కుదిర్చేవారు, నీళ్ళలో 'కూనీ' చేసి తేల్చేవారు, గాలితో మంత్రించేసే వారు, తేజంలో వెతికి చూసేవారు, 'వైర్' మీద విని 'వైర్‌లెస్' లో శెలవదీసేవారు కూడా ఉద్భవించారు ఇవేమీ అక్కర్లేదు. ఒక్క నిప్పుతో ఓ సర్వమూ చివరంటా కాని య్యచ్చుగదా అనినమ్మేవాళ్లు ఆదినించీ ఉన్నారు కాబట్టి, ఈకాలంలో మాత్రల డబ్బీ చేత్తోపుచ్చుగుని సంసారి పక్షంగా తిరిగిపోతూ చేతులు చూసేవారు, ఫోనుకి ఇంత అని అరుకులు సీసాల్లో పోసేవారు, సగ్గుబియ్యంలాంటి మాత్రలిచ్చేవారు, మట్టి పామించేవారు, తొట్టికొనిపించే వారు, జట్కాలూ బళ్లూ సైకిళ్ళూ దిగేవారు, చెవల్లోయం త్రాలవారు, కుంకంబొట్లువారు, వనమూలికలవారు-ఇల్లాగ్గా రకరకాలవారు విజృంభించారు. వీరిలో ఎవరికేనా 'డాక్టర్' (బిరుదుకాదు) పిలుపు రావాలంటే ఏబాపతో ఓ బాపతువి కొన్ని ఇంగ్లీషుముక్కలు వచ్చితీరాలి.

అజ్ఞాని అయినవాడికి రోగంపేరు చెబితేనే బెదురు, ఇక రోగం వచ్చిందీ అంటే హడలే! పల్లెటూరిమనిషి భయం అదేపోయుందని ఊరుకుంటాడు, పిల్లేకా, తిరగతేకా, స్తోమతులేకాన! పట్నవాసంలో ఎవడికేనా సుస్తీగాఉంటే, పక్కింటివారు 'మాస్తావేమిటయ్యా, డాక్టర్ని పెట్టకుం

డానూ! తరవాత ఏంజేసుకుంటావు డబ్బంతాను! ప్రాణం దగ్గిరటయ్యా తటపటాయింపూ!' అని కూకలేసి అతడిచేత డాక్టర్ని పెట్టింపించి ఆరోగాన్ని కొంచెం ప్రాముఖ్యంలోకి తెస్తారు. మళ్ళీ తమయింటో గనక రోగాలొస్తే, "రోగం అంటే అర్ధచేత్తో తీసిపారయ్యగలడా ఏమిటి డాక్టరుమాత్రం! ప్రాణం ఉన్నంతసేపే డాక్టరుగాని, అతడేమన్నా ప్రాణం చేస్తాడా? అల్లా చెయ్యగలిగినా ఎంతసేపని చెయ్యగలడూ! ఎల్లానో, ఓర్చుగోవాలి" అని తనవాళ్ళని కసురుకుంటాడు. బస్తీలో చాలా సలహాలు పక్కవాళ్ళకీని, డబ్బు ఖర్చు ఎగకండోసేవీనూ! అదీకాక, ఆరోగ్యంగా ఉన్నంత కాలం వైద్యుడు జ్ఞాపకమే రాడు. కాస్త హెచ్చుతగ్గు వచ్చేసరికి, ఏమండోయ్!' అంటూ వెతుక్కుంటూ, అడ్డమైనవాళ్ళ సలహాలూ వింటూ, రోగి బయల్దేరతాడు ప్రాణం తీపి. ఆ తియ్యదనం మనస్సులో పెట్టుగుని ఎంత చేదైనా మింగబుద్ధి వేస్తుంది. 'చావం గాలము చేరువౌ లెగియున్ జాలింపగా లేక, తన్నే వైద్యుండు చికిత్సబోవగలండో యేమందు రక్షించునో' అని ప్రతీమానవుడూ అహోరిస్తాడు. ఒక్కొక్కరోగి ఉద్దేశం: తను వైద్యుణ్ణి పెట్టిన పావుగంట దాటకుండా దాఖలా కనపడాలని వాడు రోజుకి ముగ్గుర్ని కదలేస్తాడు, ముగ్గురూ ఏకకాలంలోనే అక్కడ హాజరై వెంటనే మానేస్తారు. వాడు తొందరరోగి. ఒక్కొక్కరోగి వీల్లేకొచ్చి ఇద్దరి ముగ్గురి మందులు, ఓడిసంగతి ఓడిదగ్గిర చెప్పక, తాగుతూ బాధ పడతాడు. వాడు మొహమాటపురోగి.

ఒక్కొక్క రోగివైద్యుణ్ణిపెట్టి మందుపట్టిగెళ్ళి చెప్పినట్టు పుచ్చుకోక కుదర్లేదంటాడు, పుచ్చుకుని కుదిరినా వదిలేసినా వైద్యుడికి దొరకడు, వచ్చి కుదిరిందనేనా చెప్పడు. వాడుకృతఘ్నురోగి. ఒకొక్కడు తెగ అపథ్యం చేస్తూ రోగం అల్లానే ఉందంటాడు. వాడు కక్కూర్తిరోగి. ఒకొక్కడు స్వల్పంతో పోయేదైనా సరే డబ్బు చిమ్మేసిఉన్న మందులూ లేని మందులూ కూడా కొంటాడు. ఎంచేతంటే, తనికి ఎంత చిలుంవొదిత్తే అంత గొప్పమందని వాడి ఊహ. వాడు దర్జారోగి. ఒకరోగిని ఇంట్లోజనం ఇల్లాబాధ పెట్టడం నాకు తెలుసు—తమరింట్లోనే ఒక వాటాలో కాపరంఉన్న వైద్యుడి మందు పుచ్చుకోకపోతే ఆయన తన మనస్సులో బాధ పడతాడేమో గనక, ఆయనిచ్చిన మందు నీళ్ళే తాగాలి-అంటాడు రోగి తండ్రి. రోగి తాలూకు అమ్మమ్మ దగ్గిర పాత కుప్పెలు ఉన్నాయిట, అవి డొచ్చి ఆ కుప్పెలు అరగదీసి పుచ్చుకోక పోతే నీళ్లు ఒకులుకో వలిసిందే, అంది. ఆవిడకీనూ రోగికి చాకిరీ చేస్తున్న ఆవిడకీనూ పచ్చగడ్డేస్తే భగ్గు మంటుందిట, అందుకని, ఆ అమ్మమ్మ పీనుగు మందు సుతరామూ వెయ్యను రోగి దక్కినా సరే దక్కక పోయినా సరే అని-ఆవిడ కూచుంది. ఆసుపత్రికి తీసికెళ్ళం డని రోగి పెత్తండ్రి సలహా. ఆ ఆసుపత్రిలోనే వెనక రోగితల్లి చచ్చి పోయింది, రోగి కూడా అక్కడే చచ్చిపోవచ్చు! అక్కడికి మాత్రం వద్దు-అని రోగినాయనమ్మ ఏడుస్తూ చెప్పింది.

'ఏమీ వద్దు బాబోయ్! మీ కొట్లాటలోంచి నాకు రోగం కుదిరి పోయింది, ఇక మీరు దెబ్బలాడు కోకండర్రోయ్'- అని రోగి రాగాలు! ఇటువంటి రోగి ఆపేక్షలరోగి! ఎవడూ లేనప్పుడు నిక్షేపంలా ఊరుకుని వినేవాళ్లూవిని ఊరుకోమనే వాళ్ళూ ఉండడంతోటే మూలుగు సాగించే రోగి ఒకడూ. వాడు సకాల రోగి ఇంతమంది వైద్యులున్నా నా ముసలమ్మ పోవడమే పడటంలేదు అని బెంగతో తీసుకునేవాడు ఉంటూంటాడు వాడు ముసలమ్మ రోగి.

వైద్యుల్లో లెక్కలేనన్ని జాతులు. ఏ శాఖలో ఏవిష యంలో ప్రత్యేకప్రజ్ఞ గలవాళ్ళో ఆ పేరట వైద్యులు పిలవ బడతారు. కంటి, పంటి, కాలి, చెవి - మొదలైన వైద్యు లున్నారు. వైద్యులంతా కలిసి శరీరాన్ని ముక్కముక్కలు చేసేసి ప్రత్యేక సామ్రాజ్యాలు ఏర్పరుచుకున్నారు. శరీరా నికి అతీతులు భూతవైద్యులూ మతవైద్యులూ ఆత్మవైద్యు లూను. వీళ్ళల్లో ఒక తెగ కేవలం అభూతవైద్యులు. వైద్యంలో ఇచ్చేది చేసినచాకిరీకీ, కొనవలసిన మందులికీ గనక ఖర్చు చచ్చినా తప్పదు కొందరితో మాట్లాడినందుకు సొమ్ముకట్టాలి, కొందరు ఇంటికి వస్తేనే ఇయ్యాలి. అది వాళ్ల కాలంయొక్క ఖరీదు. ప్రతీ వైద్యుడూ కూడా, ఇతరులంతా తెల్ల మొహం వేసి ఇకలాభంలేదని వొదిలిపెట్టేసిన కేసులు, తను స్వశక్తివల్ల ఏవేవి నెగ్గించగలిగాడో అవి నొక్కినొక్కి వక్కాణిస్తాడు. ''ఫలానాఫలానావారు 'హోప్ లెస్' అనేసి

పొమ్మన్న తరవాత అప్పుడు ఫలానారోగి నన్ను వెతుక్కుంటూవచ్చాడు. ఒక్క మోతాదుతో రంగున కుదిరింది ఇప్పుడు, శాండోలా ఉన్నారు''- అని! అంతే గాని తను పైకి ఎంత మందిని అతిథుల్నిగా పాప వలిసొచ్చిందో మాట్లాడడు. ప్రతీ వైద్యుడూ, దైవసాక్షిగా మాట్లాడితే, ఏ ప్రారంభంలోనో తెలియకో, తెలిసినతరవాత నిర్లక్ష్యం వల్లో ఎక్కువమంది రోగుల్ని కుమారుస్థానస ఏకకాలమందే అచ్చుగోడంలో ఉండే చిక్కుల్లో, అధము కొన్ని జీవాల నేనా సకాలంకంటె ముందరాళే బలిలాయించిఉంటాడు. సలహా అడగడానికి వెడితే, ఏకవచనప్రయోగం చేస, కరవొచ్చి, మీదపడి కొట్టొచ్చి, అదే రోగం ఖుదర్చడం అంటే అనుకునే వైద్యుడొకడు! రోగస్వభావం పసిపట్టకుండానే, దరహాంమీద మందిచ్చే వాళ్లు చాలామంది.

వైద్యుడు—ఏఖుండి, రండి, కూచోండి, ఏమిటిసంగతి!

రోగి—నాకు జ్వరమండి.

వై—అదుగో కనపడుతూం టేనే!

రో—కాళ్లు లాగుతాయండి!

వై—అదుగో, పొడుగైనాయి.

రో—విరోచనం లేదండి.

వై—ఇల్లాంటి పరిస్థితుల్లో అదెల్లాఉంటుందీ!

రో—ఎమోనండి. ఎల్లాఉంటుందో!

వై—ఉణ్ణోండి, మందిస్తాను పట్టిగెళ్ళండి.

ఇలాగే, 'ఏమండీ. వెనకటిమందు గుణం ఇవ్వలేదు. మందు పిరాయిస్తే' అని రోగి వైద్యుడితో చెబితే, పుస్తకం చూపించి అందులో అల్లాఉంది అని చెప్పడమేగాని, శాస్త్రం తెలిసినా దాన్ని ఆచార అనుభవాలతో మిళాయించి, దేశకాలస్థితులు విచారించి, పాత్రనిగమనించి మందివ్వని వైద్యులూ ఉండగలరు. ఉన్నరోగం మరీ జోరవడానికి ఇచ్చేవాళ్ళు ఉంటారు—అంటారుగాని అది అజ్ఞానంవల్ల జరిగేదేగాని బుద్ధిపూర్వకంగా కలిపించేది కాదని మానవులు ఒప్పుకోవాలి. స్వర్ణభస్మం తయారుచేస్తానని అన్నీకొనిపించి, ఏదో బూడిద ఇచ్చేవాడూ, రోగి పురుషుడైనప్పటికంటె స్త్రీఅయినప్పుడు రీతి మార్చే వైద్యుడూ దొరకకపోరు. 'వైద్యుడొచ్చిన మాత్రానవణుకు పుట్టె, సుంచి విప్పిన మాత్రాన చలువగమ్మె, మందులిచ్చిన మాత్రాన మాటలణగె, ఓరి నీచేతి మాత్ర వైకుంఠయాత్ర' అని సంబోధించవలిసొచ్చే రకం ఒకటు! "అయ్యో. మాముసలమ్మకి ఎక్కిళ్లు ఎక్కువైనాయి, మీమందు వేసింతరవాత!" అని ఒకడెళ్ళి ఒక వైద్యుడితో చెప్పగా, అతడు, "ఇంకేం. భేష్. అందుకే నేను మందిస్తా. అల్లాఎక్కువవుతాయి తెలండి. అది బోలిదు గ్రంథం. ఇక అవి తగ్గడానికిప్పుడిస్తాను. దీంతో ఒక్క ఎక్కిలీ రాదు ఒక వేళ వొచ్చినా, ముసలమ్మగదా, మీరు ఉదయం దాకా చూడండి, ఈమందే వేస్తూఉండండి, మళ్ళీ మళ్ళీ రాకండి" అన్నాడు. ఒక ఊళ్ళో ఒక అబ్బాయిపోగా

నలుగురూ పోగై విచారంతో ఉండగా, అక్కడికి ఒకరకం వైద్యుడొచ్చి శవంకేసి చూసి, 'ఏమిటి ఈ అబ్బాయి అభిప్రాయం?' అన్నాడు అంటే 'ఫలానా' అని అక్కడివాళ్లు చెప్తే, 'ఎన్నాళ్లు బాధ పడ్డాడు ఈఅబ్బాయి?' అని ఆయన అడిగాడు. 'పదిహేను రోజులు' అని ఒకరు చెప్పగా, 'అయ్యో, నామందు వేసివుంటే ఎంత త్వరలో పనిచేసి ఉండేదండీ!' అని విచారించాడు. ఏ వైద్యుడూకూడా మరోడికి వైద్యుడే కాని, తనకి కాడు, తన ఇంట్లోకూడా కాడు. తనకైతే నిసిగత్తి విషంవుచ్చుకోవచ్చు, తనింట్లో అయితే నమ్మకమూ ఉండదు, గుట్టూ తెలిసిపోతుంది. ఇంజెక్షన్ వైద్యులు చాలామంది. ఒకాయన డిస్పెన్సరీకి మూడుఇంజెక్షన్లు పుచ్చుకున్నాడు, తగ్గలేదు. అవి మానేశాడు. ఏమయ్యా మానేశావని ఎవరో అడగగా, ఇంకావుచ్చుకుని ఒళ్ళంతా పాడిపించుకుంటే విరోచనాలు జాస్తీ అయిపోతే, అసహ్యం కదాను!' అన్నాడు. ఇక రైల్లో వైద్యుడు: "మాది సకలరోగ నివారిణి కాదు. ప్రత్యేక నెప్పుల హారిణి. డబ్బి రూపాయి బేడ, పోస్టుఖర్చు మీది. కాని మాకుంపెని ప్రచారంకోసం. ప్రస్తుతం ఉచితంగా ఇస్తున్నాం. ఇప్పుడు నాదగ్గర ఐదే ఉన్నాయి. కావలసినవాళ్లంటే, అడగండి ఇస్తాను-మా ఏజంట్లఖర్చులనిమిత్తం డబ్బీ ఒకటికి ఒక అణాఇవ్వండి" అంటాడు. ఇల్లా నా చిన్నతనాన్నించీ అంటున్నాడు! అతడు చెప్పే అనుపానాలే అసలుమందులని,

డబ్బీలోదుమ్ము అణాకుడా చెయ్యదనీ కొందరంటారు కొత్త రకం క్రిమికీటాదుల్ని కనిపెట్టే వైద్యులుకొందరు పల్లెటూళ్ళలో ఆసుపత్రులు పెట్టింతరవాత అక్కడకూడా విచిత్రమైన జబ్బులు ఎక్కువైనాయి. కుదిరితే తనమహాత్మనీ లేకపోతే దేవుడి శాపమో రోగిపాపమో అనీ విడమర్చి చెప్పేవాళ్ళు కొందరు. తనమందువల్ల ముక్తీ మోక్షమూ ఉంటాయనేనా జనం గుర్తించకపోవడంగురించి బాధపడేవాడూ కనపడతాడు.

ఎన్ని కూడని కూళ్లుతిని ఎ త శృతి మీరిన తరవాత్రైనాసరే ఒకడు వెళ్ళగా, వాడు చెప్పుగునీది సంతోషంగా వింటూ 'బేష్. ఏమీ భర్వాలేదు. నేను మందిస్తాను' అంటూ తక్షణం మందిచ్చేవాడు ఒక్కొక్కడి దృష్టిలో మంచివైద్యుడు. అటువంటి సందర్భంలో తనకి రోగం కుదరక పోయినా, రోగే సమర్థించుకుంటాడు: 'అంతకంటె వైద్యుణ్ణి ఏంచెయ్యమన్నారు? చావ మన్నారా ఏమిటి? చాయశక్తులా శ్రమ పడ్డాడు?—అని! ఆ రోగి ఖర్చుపడినా వాళ్ళవాళ్ళైనా డాక్టర్ని మనస్సులో తిట్టుగోరు. కొందరు వైద్యులు వడికేచోట వదుక్కుంటూ బీదలకి ధర్మంగా మందిస్తారు. కొందరు కష్టకాలం గమనించి ఇంతాఅని నిర్ణయించుగోరు. కుదిరినవాళ్ళు తోచి యివ్వడమే. సాధారణంగా కుదిరిన వాళ్ళకి ఏమీ తోచదు-ఇవ్వడాన్నిగురించి. ఇప్పుడుకూడా వయస్సూ లక్షణాలూవినేసి ప్రశస్తమైన మందులు సూచన చెయ్యగల దిట్టలు ఉన్నారు. 'ఈవ్యాధి నాకు బోధపడటం

లేదు' అని నిష్కర్షగా చెప్పగలవాడు మంచివైద్యుడే. దేశంలో పండిన పంట ఆకలైనప్పుడు ఒక్కముద్ద తక్కువగా తింటూ ప్రతీ పీటైనప్పుడూ డొక్క మాడుస్తూంటే శరీరానికి రోగం ఉండదని అంటారు. ఒకవేళ రోగం వచ్చినా, ఊరుకో, ప్రకృతే శరీర తత్వాన్ని సరిదిద్దుతుంది, అంటారు. కాని, అట్లా చెయ్యడానికి కొంత త్యాగమూ కొంత దీక్షా కావాలి. అది సాగితే తేలికేగాని, సాగదు. నేను మాత్రం తక్కువ తిన్నానా అనేవాడే గాని, తక్కువతిని లేచేవా డెవడూ! నాలుగు బొబ్బట్లు ఎక్కువలాగి మరీ వద్దాం అని డాక్టర్లతో కలిసో, రొంటిని మాత్రలు పెట్టుకునో భోజనానికి వెళ్లేవాళ్ళున్నారు. జబ్బు చెయ్యనీ, తరవాత నూసుగుందాం అనేకంటె జబ్బు చెయ్యకుండా చూసుకోడం మంచిదని అనుభవజ్ఞుల సలహా. ఆరోగ్యశాఖవాళ్ళు వైద్యశాఖవాళ్ళకి ఉద్వాసన చెబుతూండాలి. వైద్యశాఖ వాడు తన వైద్యంఅక్ఖర్లేకుండా పోతోందే అని విచారించకూడదు. తన వైద్యం కాదు ఎవరి వైద్యమూకుడా తన చుట్టుపక్కల వాళ్ళకి అనవసరం అయ్యేటట్టు చెయ్యగలవాడు ఘన వైద్యుడు. సెలవు.

# కుబేరరావు తనలో

ఉన్నసంగతి పాఠకుల కర్థమౌతుందా యేమిటి గాని,
నేను చాలా అందగాణ్ణి. నిష్పక్షపాతంగా చూసినకొద్దీ నా
అందంలాంటిది కనపడటమే లేదు. నేను చిన్న మన్మధుణ్ణి,
నేను అద్దం చూసుకున్నప్పుడల్లా నిజంగా అలాతోస్తుంది,
మా ఆవిడకి కోపంరానప్పుడూ అంతే. నేను చదువూ
సాగించాను, ఉద్యోగమూ చేశాను. పెద్దపరిశులు అయి
నట్టు నాదగ్గిర గట్టి పట్టాలున్నాయి. వాటి లెఖ్ఖేమిటి
గాని, వాటి నన్నింటినీ మించిన గడుసుదనం ఉంది నాద
గ్గిర. ఏ ఎండకి ఆ గొడుగు పట్టటం. అటునుంచి నరుక్కు
రావడం, అవసరం వస్తే ఏ జంతువుకాళ్లు ఎల్లాంటివైనా
సరే పట్టుకోడం, బాబ్బాబు అనడం, పట్టుకున్న విషయం
ఓ పట్టాన వొదిలిపెట్టకపోవడం, బాధ్యతప్రతీదీ ఎవడి
నెత్తిమీదరుద్దడమా అని చూస్తూండడం, అనర్గళంగా అబ
ద్ధాలు ఆడడం నాకు తెలుసు. నెగ్గడంగాని, నెగ్గినట్టు కనప
డడంగాని ప్రధానం అని విశ్వసించేవాళ్ళకి ఇవి విధాయక
మైన ఉపాయాలని నేను శాస్త్రప్రమాణం చూపించి సిద్ధాం
తం చెయ్యగల్ను. శివుడులాగ విషంమట్టుకు కంఠంలోనే
దాచి, అతడిలాగ కాకుండా అవసరమైన మోతాదులో
అది ప్రయోగిస్తూ, పైకి, పిన్నాపెద్దా వేళాపాళా పట్టింపు
లేకుండా హిహిహి అని నవ్వుతూండడం, ఒకవేళ ఎవడేనా
దురుసుమనిషి నాచేష్టలు బయట పెట్టేటప్పుడు
ఇంకాకొన్నిపీసాల నవ్వు అరువు తెచ్చుకునికూడా అట్ట

హాసం చెయ్యడం నాకుచేతఅవ్వక అందుకని, ఇతరులు గ్రహించ గలిగినదాన్ని బట్టి, నాది మిక్కిలి శాంతస్వభావం. ప్రతిఒకవిషయంలోనూ నేనే నెగ్గేస్తూండడంవల్ల నామీద అనుమానమూ ఈర్ష్యా పెచ్చురేగి పోగాయనడానికి సూచన్లు చాలా ఉన్నాయి ఒక్కొక్కడువచ్చి నన్ను తిడ తాడనుకోండి నేను సమాధానం చెప్పను వాడు మాట్లాడే టప్పుడు వాడివాగుడు తాలూకు తుప్పర, నామీదపడుతుం దనుకోండి, నేను శాంతాకారంలా కనిపించే నాచేతిరుమా లితో తుడిచేసుకుని ఉండగల్ను, అదికాదు, ఛీఛీ బుద్ధి లేదుట్రా అని నన్ను ఛెడామడా తిట్టేసిన ఒకడున్నాడను కోండి, వాడితో నాకేదేనా పనుంటే, తక్షణం నేను వాడి దగ్గిరకెళ్ళి చదువుకున్న సమర్థుణ్ణిగనక, లోగడ మాయిద్దరికీ ఏమీకూడా జరిగిఉండలేదా అన్నట్టు నటించి, నవ్వుమొహం పెట్టి, వాణ్ణి కౌస్సాగిడి, వాణ్ణి టోపీవేసెయ్యగల్ను. మాగురువుగారివాక్యం నాకెప్పుడూ జ్ఞాపకం ఉంటుంది: లాభం మనవాళ్ళో ఉల్లాగాపడేటప్పుడు, స్వంతానికి ఖర్చు తగ్గేటప్పుడు, ఇంకోడి శ్రమవల్ల మనికి పేరుప్రతిష్ఠలు దఖలు పడేటప్పుడు, తేరసొమ్ము ఏదేనా మనకంట పడ్డప్పుడు, మన కంటె అల్పుడు మన సమక్షంలోనే మనకంటె అధికసౌఖ్యం అనుభవిస్తూండడం కూడదని మనికి తోచినప్పుడు, కాళ్ళు అరిగేటట్టు తిరిగినా, కానికూళ్ళు తిన్నా, రకరకాలగడ్డి కరి చినా, అనర్థాల్ని ఆశ్రయించినా, అబద్ధాలు ఆడినా, అభూత

కల్పనలుచేసినా, కక్కూర్తి ఏంపడినా తప్పులేదు, సరికదా ఒప్పే!—అనేవారు. అట్లా చెయ్యడం చేతగాని వాళ్ళకిబతుకు తెరువు తెలియదని వారి నమ్మకం. నేనూ గురువునేగనక నానమ్మకమూ అంతే. అంతేకాదు, అట్లా చెయ్యడం శ్రేయస్కరమని నా వాదన. మళ్ళీఇంకా గింజుకుంటే, అట్లా చెయ్యడం ఒక్కటే కలియుగ ధీరోదాత్త లక్షణం అని నాశాసనం, నిశ్చితం, విశ్వాసం, మతం, సిద్ధాంతం! ఇది నమ్మనివాళ్ళు ఏం ఓఘాయిత్యం చేసినాసరే, విధేయుణ్ణి, నాఅభ్యంతరం లేదు స్నానంచేసేస్తాను, అవసరాన్ని బట్టి కక్షిణీకూడా పడతాను.

'శరీరమాద్యం' వరకూ నేను కాళిదాసుతో ఏకీభవిస్తాను. తరవాత మాటల్లో అతడు తేలిపోయాడు. మానసిక వ్యాపారాలు నేను చాలా విని చూసీ చదివీ ఉన్నా, నాకు భౌతికమే పరమావధి నా డబ్బుగురించి నేపడేజాగర్త మిక్కిలి ఎక్కువ. ఆ లక్షణం ఎంత మంచిది చెప్పండి ఆర్జించలేని అప్రయోజకులు అహోరించడం ఎందుకు చెప్పండి చిన్నప్పణ్ణించి చూస్తాను-నేను ఇతరులకి ఇవ్వాతేలే బాకీలూ నా బాధ్యతలూ మాత్రం నాకు జ్ఞాపకం ఉండవు. మళ్ళీ, నాకు రావలసిన బాకీలూ నా హక్కులూమాత్రం ఒక్కటీ మరుపు రావు, అదేం చిత్రమో! ఈసంగతి ఆలోచించినప్పుడల్లా నాకు సోద్యం అవుతుంది. వచ్చిపడే సొమ్ము చాలా జాగర్తగా మావాళ్ళకి ఇచ్చేస్తాను. వెచ్చాలవాళ్లూ బాడికల వాళ్ళూ వసూలుకొస్తే, వాళ్ళని తిప్పితిప్పి మరీయిస్తాను.

అప్పుడుగాని డబ్బుయొక్క విలువ వాళ్ళకి తెలియదని నా భయం. ఒక్కొక్కప్పుడు పెద్ద నోట్లున్నాయిగాని, చిల్లరి లేదంటాను ఒకవేళ, నాకంటె మొండిఘటం అవతల పోగై అయ్యా! నే చిల్లరి తెచ్చాను, తెండినోటు,' అంటాడు. అప్పుడు నోటు తెమ్మని నేను మావాళ్ళని అడుగుతాను. వెంటనే మావాళ్ళు నే నిదివరకే చెప్పి పెట్టిన ప్రకారం "పెట్టెతాళం చెవి పొద్దుణ్ణించీ కనపట్టంలేదు" అని నసుగుతూ సమాధానం చెబుతారు దాంతోటి వాడు పోతాడు. వాడు పోనేటప్పుడు గాని ఏమన్నా పొగరు కనపరిచాడా, వాణ్ణి మార్చేసి ఆ వాడికి మరోడి దగ్గిర పెడతాను. అలాగ ఇంటోంచి బయటికి వెళ్ళే ప్రతీకానీ దమ్మిడీ రోలీ దగ్గిర్నుంచి నేను వచ్చినంత శ్రద్ధ తీసుకుంటాను. ఘనానా కొట్ల మీందికీ మాపులమీదకీ నేను వెళ్ళనే వెళ్ళను. నేను రావడం వాలకం ఎల్లా పసికడతారో కట్టి, సరుకులన్నీ దాచేసుగుని, నేను ఏది అడిగితే అదల్లా లేదంటారు చచ్చినాళ్ళు! పైగా అట్లాంటి చోట్ల నాప్రజ్ఞ లోగసాన్నై నేను బోల్తా కొట్టచ్చు.. ఇంటి దగ్గిరికి అమ్మతెచ్చే వాళ్లు విశేషం చనువుకుని నా అంత పరిక్ష వ్యాసై ఉండరు గనక, వాళ్ళని లాలించడం, పొగడ్డం, పడగొట్టడం, నాకు తెగసరదా. బేరాలు చెయ్యడం నా అభిమాన విషయం. నేనే ఒప్పుగుంటాను, తెగేసి, నాకేమన్నా భయమా! ఆసందర్భం గురించే రాలుగాయి కుంకలంతా కలిసి కమిటీలుగా ఏర్పడి, "కుబేర రావు" అనే బిరుదు చెయించి నా కిచ్చాం అని తెలియపరిచారు-దాన్తో

నేను ఏడుస్తూ కూచుంటాననే ధైర్యంకొద్దీ! వాళ్ళ దురాలోచన నాకు సిగ్గు ఏడిసిందని ఇంత పొరపాటుపడ్డ ఘటాలు నన్ను నెగ్గుతారా? మానవ లక్షణం 'బుద్ధి' అని కొందరూ, 'నవ్వు' అని కొందరూ అంటారు, నవ్వు కాదు 'సిగ్గు' అంటాడు డార్విన్. డార్విన్‌కి సిగ్గేమన్నా ఉందా? తన తరవాత కొంతకాలానికి సిగ్గుతో నిమిత్తం లేని నేనూ నాజాతీ పుట్టవచ్చని కించిత్తూ ముజావు లేకుండా తన వాక్యానికి సర్వకాలవ్యాప్తి ఉండేటట్టు సూత్రించేశాం అని అతడనుకోడం ఎంత శోచనీయం! పైగా, బిరుసు యొక్క బలువు ఇచ్చే వాడి సామర్థ్యాన్ని బట్టి ఉంటుందిగాని, పుచ్చుగునేవాడి ప్రజ్ఞ బట్టి సాధారణంగా ఉండదు. కాని, నాకు బేరం తెలిసినట్టు ఇంకోడికి తెలియదని నేను చాలా కాలం క్రితమే గుర్తించాను కనిపెట్టాను తమరే కనిపెట్టాం అంటూ ఇతరులు నీలగక్కర్లేదు. చతుష్షష్టి-కాని పంచషష్టికళల్లోనూ బేరం చెయ్యడం ఒకటి గనక, నేను చిన్ననాట్నుంచీ, "బేరోపాసన" చేసి బేర విద్య సేకరించాను. ఓం ప్రథమం, బేరానికి దిగడానికి ముందు ఇంటికి సరుకు తెచ్చిన వ్యక్తి స్త్రీయా పురుషుడా గమనిస్తాను.

అన్నట్టు స్త్రీ అంటే జ్ఞాపకం వస్తోంది. ఇంతమట్టుకి వచ్చిం తరవాత మీతో చెప్పకుండా ఆగలేను కొన్నాళ్ళ కిందట ఈ ఊళ్ళోనే నేను అధ్యాపకత్వం బ్రహ్మాండంగా నడిపించాను. అప్పట్లో నేనూ ఒక బోధార్థి జాయింటుగా ఓ యిం

టోఉన్నాం. నేను అతివినయంగా చిలక్కిమల్లే కాదు, శుకుడులా ఉండేవాణ్ణి. ఓ రాత్రి అమాంతంగా నలుగురు పెద్దలు నా వాటాలోకి నా దగ్గిరికి వచ్చారు మాంఛి పోతుల్లా ఉండి తీరా నన్ను పైకి వేలు చెప్పమనడానికేమో అనుకున్నాను. అందులో ఓ జంతువు నన్ను పక్కకి పిచ్చి నా డొక్కలో రూళ్ళకర్ర పుచ్చుకుని పొడిచాడు. వాడు ఆగేట్టుకనపడలేదు. తక్కిన వాళ్ళు చెయి చేసుకునేట్టున్నారు. తక్షణం తప్పదని చెప్పేసి వాడి కాళ్ళకి అడ్డంపడి కట్లపాములాగ చుట్టేసుకున్నాను. ఆ శింగాడు నన్ను పొడూగునా ఈడిచి తన్నితన్ని వొదిలేశాడు. వాడి పాపం వాణ్ణేకొడుతుందని ఊరుకున్నాను. మర్నాడు ఇక్కణ్ణించి నన్ను బదలాయించేశారు. నేను దిగ్విజయంగా ఇక్కణ్ణించి లేచిపోయాను. ఆ పక్కవాటాలో ఉండే బోధార్ధి భార్యకేసి నేను చూడ్డం మొదలెట్టి వికారపు చేష్టలు చేసి, అల్లరి పెట్టడానికి యత్నించడం వల్ల అతడెళ్ళి నా ప్రధానితో ఫిర్యాదు చేసుకున ఎడవగా, వాడు రోజుతిరక్కుండా బిల్లిగ్రాముల మీద హుకుం తెప్పించుకుని నన్ను విరగడ చేసుకున్నాడని నామీద అపవాదులు—నే వెళ్ళిపోయిం తరవాత—పడ్డట్టు విన్నాను. అపవాదులు మహామహా కొమ్ములు తిరిగిన వాళ్ళకే తప్పలేదు. ఘనానా మనిషి ఎవడూ అపవాదులు నమ్మడు. మీరూ నమ్మకండి. నామీద అటువంటి తుత్రం పడుతూండడంలో ఆశ్చర్యం లేదు. ఏమంటారా, మళ్ళీ అంటున్నాను ఏమీ!

మరోహాలా అనుకోకండి, నా రూపం అల్లాంటిది. పైగా, ఆ బోధార్థి కేవలం సందేహం మందేహుడు మన్లో మన మాట, సందేహం అంటే స్ఫురణ కొస్తోంది. మాయింట్లో వాళ్ళ విషయం (అనగా, నాభార్యవిషయం) నాకు సందేహం లేదు. అయినా కొత్తరికంలో ఎందుకేనా మంచిదని చెప్పేసి, వాళ్ళు పెత్తనాని కెళ్ళినా, పేరంటానికెళ్ళినా నేను కూడా ఎదోపని కల్పించుగుని వెనకాలే హాజరై, అనుమాన లేశం కూడా జనించకుండా కట్టుదిట్టం చేసుగునేవాణ్ణి. వాళ్ళు కాలవకేనా చెరువుకేనా నీళ్ళకి వెళ్ళవలిసొస్తే, నేనుకూడా ఓ చెంబు చేత్తోపుచ్చుగుని ముందే నడిచి వీధి అరుగులమీదా అక్కడా షైటాయిస్తూండే దిప్పకాయిరకాల్ని ఇంటోకి పొమ్మనిన్నీ మా వాళ్ళకి ఘోషా అనిన్నీ చెప్పేవాణ్ణి చెప్పినా, ఈకాలంలో గడేకారి సజ్జకాహా!-ఎదిరించే వారే కాని, నా ఆజ్ఞ మన్నించేవారు కారు. మా వాళ్ళని నేను ఇంట్లో వదిలేసి నా ఉద్యోగప్పనిమీద రోజూ వెళ్ళవలిసొచ్చేటప్పుడు నేను ఎన్నడూ పెద్దతాళం వెయ్యలేను. మిల్లర్ తాళం మాత్రం తగిల్చి పోయేవాణ్ణి. ఓ తాళంచెవి నేను పట్టిగెల్లి రెండోది మావాళ్ళకే ఇచ్చేసి పోయేవాణ్ణి. ఆరీతిగా ఉండాలిగాని, నే చెప్పిన పైబోధార్థికిమల్లే శుష్క సందేహాలు పెట్టుగుని కుసిల్లిపోడం వ్యర్థం.

ఎతావతా, బేరాల్లో పడుచా ముసిలా పిల్లాడా పెద్దాడా అనేవయినం చూడందీ వ్యవహారించను. మిఠాయి,

కరకజ్జం, పూతరేకులు, జీడిలు లగాయితు దుంపలు, ఆకులు, కాయలు, కూరలు, చీరలు-వీధమ్మట ఏదట వెళ్ళనీండి నేను పిలవ్వాలిసిందే. కుర్ర అయినా ముసిలి అయినా వేళాకోళంగా మాట్లాడిస్తాను. నడివయస్సులో మనిషైతే కావిడిబద్దగాని తట్టగాని తిరగెయ్యొచ్చునా నకజాగర్తగా ఉంటాను. అవతలఅమ్మేవాడు చెప్పేధరలో సాధారణంగా నాలుగోవంతుకీ, పారపాట్న ఒకప్పుడు మూడోవంతుకీ వస్తువు ఇస్తావా అని అడుగుతాను. అవతలమనిషి నసిగితే, "ఏమిటోయ్, బజార్లో ఇంకా తక్కువకి ఇస్తున్నారట, పైగా నాకు బోలెడు సరుకు కావాలి" అంటూ ప్రారంభించి, వాడు అమ్మతెచ్చిన సరుకుకి నాలుగురెట్లు నాకు తక్షణమే కావాలి అల్లాఇస్తావా లేదా అని పడగొట్టేస్తాను. కాని, నా బేరానికి, ఒక్కొక్కడు, ఖిన్నుడని మీదపడి, 'చాల్లేవయ్యా. కొన్నావ్, తేరసొమ్ము ఏస్కోగల వేటయ్యా! అల్లాయితే యీధులు తిరుగు, ఓడేనా దొంగసొమ్ము అమ్మతెత్తాడు" అంటూ ఆగ్రహించేవాడు ఉండచ్చు. వాణ్ణి, 'సరే సరే. వడిఘ్గా మాట్లాడకు. వెళ్ళు. మేం కొనం' అనిపంపించేస్తాను.

నావల్ల ఏదేనా పని కావలిసొచ్చి నన్నెవడేనా ప్రార్థించాడా వాడి ఉంతు కనుక్కున్నా నన్నమాటే ఆ పనివల్లే నాకుకుడా ఏ లేశమో ఏ ఘట్టంలోనో లాభంఉండకపోదు గనక, ఆపని నావల్ల కాదని చచ్చినా చెప్పను. అవని నాచేతుల్లోదైతే బేరం స్థిరపడేవరకూ తేల్చను, నాకు తలకి మిం

చినతనైనా కాకింబనవల్ల సాధారాంతరాలు తో చచ్చు
గనక అవతలవాణ్ణి రేవనీ మాపనీ సాగలు చెప్పి తిప్పకమా
నను. అల్లా వాణ్ణి తిప్పేటప్పుడు నాకు కడా బాధకలిగినా,
రాబోయేలాభం తెల్సుకుంటూ ఆ బాధనుడే ఓరిమి నేను
అర్జించాను. ప్రకసారి ఒకడొచ్చి ఏదో నాతో పనుందని
నన్నాశ్రయించాడు. ఆవకేమిలో అడక్కుండానే వాణ్ణి
మర్నాడు కనపడమన్నాను. నేనెక్కడికెడుతూంటానో
ఇంట్లో చెబుతూండను గనక, నేలేనప్పుడు వాడు మర్నాడు
వచ్చివెళ్లినట్టు మావాళ్లు చెప్పగా, వినేశాను. మూడోనాడు
పొద్దున్నే వాడు మళ్ళీ తయారయ్యాడు. ఆవేళ ఇంట్లో తద్దినం
అని చెప్పి వాణ్ణి సాగనంపాను. నాలుగోనాడు వచ్చిపడ్డాడు.
నలకి శాస్త్రోక్తంగా గంధ ప్రయోగించి కూచున్నాను.
వాడు నన్ను చూసి, 'తలనెప్పిగావుంది, రేపొస్తాలెండి' అంటూ
వెళ్లిపోయాడు. ఐదోనాడు పొరుగూరు కోర్టులో వాయిదా
ఉందన్నాను. ఆరోనాడు వాడు వచ్చేసరికి నాకు నడుం బెణికిం
దన్నాను. అన్నా నన్ను చూసేంగని, ఆసమయంలో నే మూకు
ద్రాడు నాకోటు తీసి దానిమీద సిరాబలక పోస్తూండగా నేను
కళ్ళప్పగించి చూస్తూ ఊరుకోవలిసొచ్చిందేకాని వాణ్ణిగిమ్మ
తిరగెయ్యడానికి వీల్లేకపోయింది. వాడు వెళ్లిపోయిన వెంటనే
నేనులేచి మా వాడి చెవులు చింతపండు నలిపినట్టు నలిపే
శాను. ఏడోనాడు ఇంటో ప్రసవసమయం అన్నాను. ఎని
మిదోనాడు ముసురు. ముసురు మూడురోజులు. తొమ్మిదీ పదీ
అయినాయి. పదకొండోనాడు వాడు రాగానే అనుకోస బం

ధువులు ఓబస్సుమీద వచ్చిపడడంవల్ల వాళ్ళగురించిన అరణ్యా
మెంట్లు చెయ్యాలన్నాను. వాడు వెళ్ళిపోయి పన్నెండోనాడు
మళ్ళీ వచ్చాడు మళ్ళీ ప్రసవసమయం అన్నాను ఇదివరకే
అన్నారే పురుడు రాలేదా అన్నాడు. లేదండి, దొంగనో
ప్పులు వస్తూంటాయి, మేం కళ్లు వింగదొక్కుకుంటూ ఉం
టాం అని పంపించేశాను. పదమూడోనాడు ఊరగాయి
పెట్టాలన్నాను. ఇప్పుడేం ఊరగాయండోయ్. అన్నాడు
వాడు. మొదటపెట్టింది మైలడిపోయింది, పునాసకాపు
మామిడికాయలు మళ్ళీ తెమ్మన్నాను, అని చెప్పి సర్దుకు
న్నాను పధ్నాలుగోనాడు కుర్రాడి సీటుకోసం వెళ్ళా
లన్నాను. ఇంకా సెలవలేగావును అన్నాడు వాడు. ఇప్పణ్ణించీ
ఆశ్రయిస్తేగాని ఏదో ఓటి దొరకదని చెప్పి వాణ్ణి పంపించే
శాను. నాకుకొంచెం భయం పట్టుకుంది. వాడు అన్నీ నమ్ము
తున్నాడు. వాడికి చీమంతైనా కోపంవచ్చినట్టు కనిపించదు.
ఏమిటైఉంటుందా వీడికి నేను చెయ్యవలిసిన పనీ అని ఆలో
చించాను. నాకేమీ పాలుపోలేదు. పదిహేనోనాడు ఆమ
డంపుచ్చుకున్నా నన్నాను. అవునండి, కుట్రకొట్టెయ్యవలి
సిందే అంటూ వాడు వెళ్ళిపోయాడు. పదహారోనాడు మాకు
ర్రాడికి పెళ్ళికూతులకి పెళ్ళివారొస్తారన్నాను. శుభం
భూయాత్, అంటూ వాడు ఆనందంతో లేచి పోయాడు.
పదిహేడోనాడు మాకు మైలకబురు తెలిసిందని అంతా
స్నానాలు చెయ్యాలనీ అన్నాను. తనూ స్నానానికే వెడు

తున్నానంటూ వాడు తుర్రుమన్నాడు. పద్దెనిమిదోనాడు రేపన్ సరుకలికి వెళ్ళాలన్నాను. పందొమ్మిదోనాడు పాత సెల్లిగ్రాం ఓటిపైకితీసిఉంచి వాడికి చూపించి అర్జెంటుగా రమ్మని నా భావమరిది కోరుతున్నాడనీ, నేను వెడితే వెళ్ళచ్చనీ చెప్పేసి వాణ్ణివదుల్చుకున్నాను అయినాసరే. వాడు ఇరవైయోనాడు వచ్చికూచున్నాడు. మా ముసలమ్మ వ్యాధి మూలాన్ని ఆ క్రితం రాత్రి నాకు నిద్దర లేదన్నాను. మా యింట్లో ముసలమ్మలేనిసంగతి వాడు వాకబుచేసుకుని యున్నాడు సిద్ధం అవుతాడేమో అనుకున్నాను. ఆ మాత్రం కుడానా! వాడు ఉత్తధవ్వాకరం: కనుక్కోడంలేదు వాడి మొదనూలేదు. ఖంగావచ్చేశాడు. ఇరవై ఒకటోనాడు నాకు మౌనవ్రతం అని రాసి చూపించాను. వాడు వెంటనే వెళ్లాడు గాని, వీడికింత బుద్ధిలేదే, విసుగులేదే, వీడు మూర్ఖుడా, లేక వీడునటిస్తున్నాడా అని నాకు దిగులు ప్రవేశించింది. ఇరవై రెండోనాడు పొద్దున్నే బొటనవేలుమీద తేలునొవ్వపొడిచిందని చూపించి మూలగడం మొదలెట్టాను. వాడు తేల్ని చంపేశారాండీ అని అడగచ్చా, తేలుచచ్చిందాండీ అని సన్నాడిగాడు. ఆ బోడిగాడి ఎత్తిపొడుపు నన్నుకుట్టగానే తేలే చస్తుందని! పైగా, వెళ్లిమందు తెస్తానని పట్టట్టాడు. మందూవద్దు మాకూవద్దు, మంత్రం వెయించాను పోవోయ్ అని చెప్పి కుంటుతూ వాణ్ణి రోడ్డెక్కించాను ఇరవై మూడోనాడు ఇట్లో భారసాల అన్నాను. వాడు ఏదో దళారీరకం అని నాకు తట్టింది. వీణ్ణి వొదిలించేసుకుంటే నే నాకు లాభమేమో అని

పించింది. ఇరవై నాలుగోనాడు వాడు రాగానే, 'నేను ఇల్లు మారాలని ప్రయత్నం చేస్తున్నాననన్నాను. తనుకూడా ఆవిషయంలో సాయంచేస్తానని సూచిస్తున్నాడు. నాకు అస్త్ర సన్యాసం చెయ్యవలసిన అవసరం వచ్చినట్టు కనిపించింది. అక్కడితో నేను ఎక్కడలేని నిబ్బరమూ తెచ్చుగుని, ఈ వ్యాపారంలో నాకు ఏమిస్తావ్ అని అడిగేశాను. ఏ వ్యాపారంలో, అన్నాడు వాడు. నీకు నావల్ల కావలిసిన వ్యాపారంలోనే, అన్నాను. నాకు మీవల్ల కావలిసినపని ఏమీ ఎంతమాత్రమూ లేదన్నాడు వాడు. నాకోపం కప్పెట్టుగుని, అల్లాఅయితేమరి ఇన్నాళ్ళనించి నన్నెందుకు పట్టుగున్నావు కని దేవతలాగ, అనినవ్వుతూ అన్నాను. నీసంగతి గ్రహించడానికే, అంటూ వాడు ఘూ అని ఉమ్మేసి ఉడాయించాడు, ఆ ఉమ్మి అట్టే నామీద పడలేదనుకోండి! ఉన్నసంగతి చెబుతున్నా! కొందరి పాడు ఆశ్రయింపులు ఇల్లా ఉంటాయి. వాడు కేవలం దురుద్దేశంతో వచ్చి తొందరగా తోక ముడిచేశాడుగాని, లేకపోతే వాడి దగ్గిర ఎంతో కొంత ఊడేసి ఉండకపోదునా!!

# బాలబోధ

అధ్యక్షా! సభ్యులారా!

రాజమండ్రీ మునిసిపల్ ఉపాధ్యాయుల యూనియన్ యొక్క ప్రథమ వార్షికోత్సవ సందర్భంలో నన్ను ప్రసంగించ వలసినదిగా కోరిన ఈ కార్యనిర్వాహకులకి నమస్కారం. ఉసూరుమంటూ ఉండే ఉపాధ్యాయపదవికి ఉత్సాహం పొయ్యడానికి ఉపాధ్యాయేతరుల్ని పిలిస్తే నాకు ఈ చిక్కు తప్పిపోయేది. అధ్యాపకత్వంలో ఆరితేరినవారు మీరు, కనక మీరు సలహా చెప్పడానికి నాకు తాహతు లేదు. విద్యాప్రదానంలో నిశితత్వం ఎక్కువ చెయ్యడాన్ని గురించి మాట్లాడదాం అంటే ప్రభుత్వంవారు, ప్రారంభ విద్యగురించి ప్రకటించిన చేసంపుటలో బోలెడు సంగతులతో యావత్తూ విస్తరించి రాసి ఉంది, అది మీరు చూసేఉంటారు. బోధనక్రియలో అభివృద్ధి సూచించడానికీ, సూచనలు ఆచరణలో పెట్టించడానికీ మీకు మీ నిర్బంధ మాసిక సమావేశాలున్నాయి, తణిఖీదార్లు ఉండనే ఉన్నారు. వేతనాల్లో హెచ్చింపులుగురించి ఏంజెయ్యాలో మరొకరొచ్చి మీతో చెప్పవలసిన అవసరంలేదు, మీరు చెప్పకున్నా వినేవారికే వినిపించదు. అందుకని ప్రసంగవిషయం నాకుతోచక నన్ను వదలిపెట్టవలసిందని నన్ను కోరినవారిని నేను కోరుకున్నాను. వారు కాదూకూడదూ అన్నారు. ఉపాధ్యాయులమాట అంతాకొట్టేసేవారేకదా, నేనుకూడా ఎల్లాకొట్టెయ్యడం అని నేను ఈ పనికి ఒప్పుకున్నాను గాని, ఒక నూతన సందేశం మీకివ్వడానికి నాదగ్గిర లేనూలేదు, బోధనోపాసన చేసి

నేను కనుక్కోగలిగిన నవ్యవిషయాలు లేవు కాని, ఒక్క సంగతి గమనించాలి ఏదైనా ఒకపనిగురించి, ఆపని చెయ్యని వాళ్లు, ఆదర్శప్రాయంగా మాట్లాడతారు, ఆపని చేస్తూన్న వాళ్లు ప్రత్యక్షప్రాయంగా మాట్లాడతారు. అందుకని, ఉంటూన్న పరిస్థితులే రెండుమూడు దృక్పథాల్నించి చూసి కొంత ప్రసంగిస్తాను. అయితే, ప్రపంచంలో ఇతరులు ఒప్పులే చూస్తూంటారు, ఉపాధ్యాయులు తప్పులే పట్టుకుంటూ ఉంటారు. కాబట్టి, ఇంతమంది ఉపాధ్యాయుల ఎదట ఏదో తోచింది అనే సెయ్యడం నాకు మనస్కరించక, స్పష్టతకోసం సంగతులు లిఖితం చేశాను. ఈ రెండుమూడు సంగతులూ విన్న తరవాత ఉపాధ్యాయపదవిలో ఉన్నవాళ్ళకి నామూలాన్ని దుఖ్ఖం ఎక్కువ కాకుండా ఉంటే, నాకదే చాలు.

క్రియాసిద్ధికి అయిదు షరతులుంటాయి అని పెద్దలు చెబుతారు—అధిష్ఠానం, కర్త, సాధనం, చేష్టాశక్తి, అదృష్టం. బోధనకికూడా అంతే. మేష్టరీలో విశేషం ఏమిటంటే మేష్టరీకి ఎదురుగుండా కుర్రాడు – నెత్తిమీద అధికారులు – ఎడాపెడా తణిఖీదార్లు – వెనకాల తల్లిదండ్రులూ – చుట్టూ కడుంవాళ్ళూ ఉంటారు. గ్రాంటు ఇచ్చేది ప్రభుత్వం. నిశానీతనం పోయి యావజ్జనమూ అక్షరకుక్షులగానే నిమిత్తమున్నూ, విద్యావిస్తరణమూ విద్యాభివృద్ధీ జరిగే నిమిత్తమున్నూ డబ్బు చిమ్మేస్తున్నాం గనక, సొమ్ము వ్యర్థం అయిపోకుండా చూడవలసిన బాధ్యత మొదట మేష్టరుమీదే ఉందన్నారు ప్రభుత్వంవారు. గట్టి విద్య చెప్పినవాళ్ళకి

నిష్పక్షపాతంగా గ్రాంటుదొరుకుతుందన్నారు. కారణాంతరాలచేత మేం ఇస్తాం అన్నా ఒకవేళ ఇవ్వకపోవచ్చు మీరంతా కలిసి ఏమీ అనుకోవద్దన్నారు. వారిదృష్టిలో మాంచి ఎన్నతగ్గస్కూలు అంటే, ఆయేటి కాయేడు పైక్లాసులు పెడుతూండేదీ, ఒకటవస్టాండర్డుసంఖ్యలో నాలుగోవంతు సంఖ్య 4 వ స్టాండర్డులోకలదీ, తణిఖీదారువల్ల గ్రాంటుకోతకి సిఫారసు చెయ్యబడనిదీ అసలర్థం – గ్రాంటు ఎక్కువ ఇస్తే ఇవ్వవచ్చు సాధారణంగా అసలేనా ఇవ్వవచ్చును అన్నారు. కాని గ్రాంటు కోతకి చాలా అవకాశాలు చూపించారు. క్రమనిర్వహణంలోగాని, శిక్షణలోగాని, బోధనలోగాని, స్థలసదుపాయంలోగాని, సామగ్రిసౌకర్యంలోగాని, లోటులున్నా సంవత్సరం ముగియకుండా పిల్లలు మానినా, ఎవడేనా ఒకేక్లాసులో ముకాం వేసినా, స్కూలు మీటింగుల సంఖ్య తగ్గినా, స్కూలు పెందరాళే కట్టేసినా, కుర్రాళ్ళకి టీకాలు లేకపోయినా, రాజకీయసభలకి స్కూలుభవనం ఇచ్చినా ప్రభుత్వాంగీకారంలేని పుస్తకాలుపెట్టినా, అనుజ్ఞ లేందే పఠనగ్రంథాలు రెండోయేడు పెట్టడం మానినా, దగాలెఖ్ఖలురాసినా, లేని మేష్టర్లు ఉన్నారని బుకాయించినా ఇవ్వని జీతాలు మేష్టర్లకి యిస్తూన్నట్టు చెప్పినా, లేని పిల్లలు వస్తూన్నట్టు కనపరిచినా, మరి ఏ యితరదగా అవకతవక పనీ నియమవిరుద్ధమూ జరిపినా, ఆడపిల్లల బళ్ళో ఆడమేష్టర్లు అర్హులు ఉంటూండగా, ఉన్నారని తెలిసీ కూడా మొగమేష్టర్లని నియమించినా, గ్రాంటు సగానికి

సగం కొయ్యబడడం రూఢి అన్నారు. ఈ పట్టీని బట్టి మేష్టరు చెయ్యకూడని పన్లు ఏమేమిటో బోధపడుతుంది. అపరాధాల్ని శిక్షించే సూత్రాలు ప్రతీపనిగురించీ ఉంటాయి. వాటిని గూర్చి నేరస్థులు గుండెకొట్టుకోవాలిగాని తనధర్మం తను ఆచరించేవాడు భయపడకూడదు

ఇక ప్రారంభవిద్య చెప్పడానికీ అధ్యాపకుడు (అనగా మేష్టరు) కావల్సినవారికి ఉండవలసిన లక్షణాలూ, ప్రజ్ఞలూ చాలా చెప్పారు. ప్రతీప్రారంభవిద్య చెప్పేవారికీ-అధమం రవ స్టాండర్డు ప్యాసయిన పట్టా. తగినంత ఆయిన కాగితమూ కాక, కొంచెం దేశాభిమానమూ, కొంచెం జాతి నిర్మాణాసక్తి, కొంచెం విశాలత్వంతో ముఖాముఖీగా పోరడానికి యోధత్వమూ, కొంచెం సూక్ష్మబుద్ధీ, ఒక్క రవ్వ సమయస్ఫూర్తీ, శాస్త్ర చాకచక్యమూ, ఒక కొంత వాదనప్రజ్ఞా, వీలైనంత హృదయమైన శాల్యమూ, మహాగాధ్యత తనమీద పెట్టి తనకి మహాతరుణం ఇచ్చారన్న ఇంగిత జ్ఞానమూ, సౌశీల్యమూ, జాతినేవాభిలాషా, శాంతమూ, నిజాయితీగా లెక్కలూ సంగతులూ లిఖించడమూ, 'ప్రాపగండా' శక్తీ, పుట్టిన బడీ తనకి తెలియనివి తెలుసుగొచ్చి కర్రాడికి వాటిల్లో ప్రవేశం కలిగించాలనే తపనా, కోప చంపుగని నయాన్ని తండ్రుల తో వాదించి వారికి నచ్చచెప్పేప్రజ్ఞా, సాధారణంగా . సామగ్రి లేనప్పుడు దయగలవారిని కనిపెట్టి వారు తెచ్చగోకుండా వారిని యాచించే ఒడుపూ, నానాలవిషయాల్లో ముందంజ వేసే సాహసమూ, నిర్బంధ విద్యాప్రదేశాల్లో జనాభా

లెక్ఖలు తియ్యడం నేర్పూ, వాళ్లి ఒక వేళ ఆ అడిగిన వయి నాలు చెప్పక తరుముకొస్తే పడిపోకుండా ధైర్యంతో ఇంటికి పరిగెట్టగల పక్క బలమూ, పారపుగంటలోగల ప్రతినిమిషం లోనూగల ప్రతిసెకనూకూడా బోధన నిమిత్తమే ఉపయోగ పరచడానికి వీలయేటట్టు పాఠ్యవిషయాలగురించి ముందుతి యారీ, చుట్టుప్రక్క ప్రాంతాలజనంతో మిక్కిలి పరిచయంగా ఉండి స్వలాభంకోసం ఆపరిచయాన్ని ఉపయోగించుకోకుండా ఉండే ముఖభావమూ, సెలవలు అనేవి ప్రాపగండా పని చెయ్యడం నిమిత్తమే అని జ్ఞాపకంఉంచుకోగల వినయమూ, మంచి సామర్థ్యమూ, చక్కనివర్చస్సూ, గొప్పవ్యక్తిత్వమూ,-తిన బడికి వాంఛనీయం అయిన ప్రతివిషయం గురించీ స్పష్టాభి ప్రాయాలూ, తనని బోలెడునుంది అనికరిస్తారుగనక తప్పుడు మాటా తప్పుడు చేష్టా లేకుండా ఉండే గడుసుదనమూ, పెద్దలైన నిరక్షరకుక్షుల్ని కూడా అక్షరాస్యుల్ని చేసేస్తే అక్కడికి గ్రామ పునర్నిర్మాణం పూర్తి అయిపోయి ఆపుణ్యం కూడాతనకే దక్కుతుంది గనక ఆపనికూడా రాత్రిబళ్ళు పెట్టిచెయ్యాలనే హృదయవైశాల్యమూ, ఖర్చులేకుండానా యం ఎవరెవరుచేస్తారో గురించిన వాకబూ, వ్యాయామ జ్ఞానమూ, పాఠశాలాధికారులు దారిద్ర్యంలోనూఉన్నప్పుడు పరకరాలూ సామగ్రి లేకుంటూ కూర్చోకుండా ఎవో కబుర్లు చెప్పి మరోచోటనుంచి కావలిస్తే ఇంకోరికికుడా అ వేబములిచ్చే హెకమతూ, రోజుఒక్కంటికి నియమితం అయిన అయిదు గం టలుమాత్రమే తినపనిఅని ఊరుకోక ఇతరగంటల్లోకూడాదమ్మిడీఖర్చులేకుండా నాటకాలూ, మూగఆటలూ, జాతీయగీతాలూ

కోలాటాలూ, విహారాలూ, పౌమపూ సంఘీభావమూ ఉంటాయి గనక పరపతి సంఘవ్యవహారాలూ పనియొక్క హోదా సౌభ్రాతృత్వమూ కార్యాచరణలో నిశితత్వమూ సాహసక్రియలకి తరుణమూ ఉంటాయిగనక కొంచెం స్కౌటు సంప్రదాయమూ. ఆరోగ్య శుచిత్వాలకీ రోగులసేవకీ అంతర్జాతీయస్నేహానికీ దోహదం గనక రెడ్ క్రాస్ సంఘ నిర్మాణమూ, మొదలైనవిచేస్తే చాలుపోనీ ఏదో సరిపోతుంది – అని సెలవిచ్చారు. పఠనగ్రంథం అనేది నౌఖరుగా ఉండాలి గాని యజమానిగా కాదు గనక దాన్లోకంటె ఎక్కువగానే మేష్టరు చెప్పాలన్నారు. పఠన విషయాలప్రణాళిక ఒక సూచనే గాని అంతకంటె లేదు, దానికంటె ఎక్కువదే ఎవడి మట్టుకు వాడు తయారు చేసుకుని చెప్పాలన్నారు. భాష గురించిన ప్రణాళికలో, 1వ స్టాండర్డు 300 మాటలు, 2వ స్టాండర్డు ఇంకా 400 మాటలు, 3వ స్టాండర్డు ఇంకా 500 మాటలూ వ్యాకరణమూ, 4వ స్టాండర్డు ఇంకా 700 మాటలూ, 5వ స్టాండర్డు ఇంకా 800 మాటలూ, పరిచ్ఛేదాలతో సహా వ్యాసరచనా, దోషనిర్ణయమూ, 6, 7, 8వ స్టాండర్డులలో సంపూర్ణ వ్యాకరణమూ వాఙ్మయమూ! అల్లానే గణిత ప్రణాళికలో 1వ స్టాండర్డు పదులకూడిక, తీసివేతలూ, 2వ స్టాండర్డు వందలలోకూడిక తీసివేతలూ, 2, 5, 10 ఎక్కాలూ, అంకభిన్నాలూ, 3వ స్టాండర్డులో పదివేల మీద లెఖ్ఖలూ ఇంకా ఎక్కాలూ...భిన్నాలూ మానాలూ ఇల్లాగ్గా 8వ స్టాండర్డులో ఘనాలూ, రేఖాపటాలూ! కం

పౌండువడ్డీలెఖ్ఖలూ!! అన్నీ చెప్పినట్టే గానంతుకా మేష్టరు చెప్పెయ్యాలి చెబుతున్నారు గానివల్లే కుర్రాళ్ళకి జ్వరం రావచ్చునని కొందరంటారు. పట్టీలో ఉండే చేతిపన్లు కాన్నె రెండింటిలోనూ వృత్తి ప్రవేశిక విద్యలు రెంటిలోనూ మేష్టరికి అభిమానంగా తెలిసినవి ఉండాలి, లేకపోతే అతను అర్థాల దగ్గర ఉండటంగా తెలుసుకునివచ్చి వ్యవహరించాలి. పైనం గతులన్నీ గ్రంథస్థం అయి ఉన్నవే. ఈ ఆదర్శస్థితిగూస్తే, ప్రాంథవిద్య చెప్పవలసిన గురువు పెద్ద సైజులో గురుడంత వాడై ఊరుకోక, బుధుడి చురుకూ శుక్రుడి నీతి చాణక్య తిమ్మరుసుల తంత్రప్రజ్ఞామాత్రం కలిగిఉండి నూట్లున్న గంటలలోనూ స్కూలుండని గంటలలోనూ మాత్రం, రాత్రీ పగలూ మాత్రం బడిఉన్న రోజుల్లోనూ మాత్రం కృషి చేస్తే, తండ్రులు పిల్లల్నిపంపిస్తే సరేసరి లేకపోతే ఎల్లానో అల్లా వాళ్ళని కొంచెం హాజరయేటట్టు చేసుకుని, రోజూ కూడా వచ్చేటట్టూనున్నూ, సకాలంకి వచ్చి రోజంతా బళ్లో ఉండేటట్టూనున్నూ చూసుకుని, పరీక్ష చేసిసి. వాడు ఫేలు కాకుండా చూస్తే, దేశం కనురెప్పపాటులో అతిరాష్ట్రాల్లో కడి పోతుందని తేల్తుంది

పోని అల్లాంటివాళ్ళు ఎక్కడున్నారో వెతికి తెచ్చి పై పనికి వాళ్ళని అధికారులు నియమిస్తే తీరపోనా, నరోపనికి దేనికీ పనికిరాకపోవడంవల్ల, బోధనపనికి చేరుకోదల్చిన వాళ్ళనికూడా నియమించి, వాళ్ళే అఖండులుగామారి పైపని నిర్వహించి చూపెట్టాలంటారు. కాని, ఎంతప్రైసంగు ఇచ్చినా

సకే బోధ నాశక్తి లేనివాడికి బోధవగాను. ఇక ఇతర శక్తులు కొత్తవిషయాలలో దఖలుపడదా? గురా! ప్రాపగండాశక్తి! మేము కోరి ఎందుకొచ్చింది గా అని కాకుండా ఒక్కొక్క చిన్న విషయ ...ముగురుని ఆబలేకుండా, స్వతంత్రం ప్రత్యేకం ఎక్కువగా. [illegible] ...గిట ఓర్పుతో తండ్రులతో వాదించాలిట! ఈ [illegible] ...పూలు పనిచేస్తాయా? తండ్రులకి అంత బాధ్యతడ [illegible] ...ఘుంవగ్పరిచారు ఈవ్యాళ్ళ, వెనక, అందులో [illegible] ...లేమూ ఎనమిందుగురు తండ్రులే కాదు పనివాడు తెలి... సగించిన అధిష్ఠానం దొరకడానికి ఇంటింటికీ ఎప్పుడైతే బయల్దేరాడో ఆపనిలో విలువలేదని అవతలవాడు వెంటనే అనుకుంటాడు. ఆపనికి ఇక గౌరవంవేమిటి? నిర్బంధవిధానం ఉన్నచోట్ల పిల్లల్ని పంపకపోతే, తండ్రులకి పెట్టిన శిక్షలు అసామాన్యంగా ఉన్నాయి. ఒక్కొక్క తండ్రి, నాపిల్లవాడు మీబడికి రాకపోతేనే లాభం అంటే నాతో నాపని చూసుకుంటాడు అని వాదించడంలో న్యాయం లేదనీ మనం చెప్పలేం, ఇక మతాంతం చెయ్యడం గురించి బండాభాయిలు ఉంటారు వాళ్ళు చెడ్డవాళ్ళు అనుకోకూడదు. [illegible] ...చికూడా శూన్యం మా [illegible] ...ర్చని చెయ్యడం? ఒకే పరీక్ష పెట్టి నప్పుడు అనేకులంతా దాటలేరు. కొందరు ఆసక్తి లేనివాళ్ళు ఒకేక్లాసుని ఆశ్రయించుకుని ఉండి పోతారు. మూడో యేడు చూసి వాణ్ణి మానిపించడం కూడా దేశానికి నష్టం కాదేమో వాణ్ణి ప్యాసవకొట్టడం కంటే! చెప్పే ప్రారంభ

నిత్య ఒకటేఅయినా జీతాలు సంస్థల రకాల్ని బట్టినూర్చుగా ఉండడం అన్యాయం. కక్కుర్తికి తక్కువపుచ్చుకుని ఎక్కువకి సంతకంచేసేవాళ్ళు ఈవిషయంలో దోషులు, ఇచ్చేజీతం మొదట్లోసరిపోదేలాగ కనిపించి, మేష్టరుసంసారం పెరిగిన కొద్ది దగాచేస్తుంది. అందుకని కొన్ని దేశాల్లో సన్యసించితే గాని మేష్టరీ ఇవ్వరు, ఇచ్చినా తరవాత సన్యసించేవరకుకి ఇస్తారు కొన్ని దేశాల్లో కొన్ని శాఖల్లో ఒక్కొక్కడి సంతానాభివృద్ధినిబట్టి అనులోమ నిష్పత్తిలో వేతనాభివృద్ధి ఉంది. ఇతరమైన రాబడి ఉండడంవల్ల జీతంరాళ్ళు వేడినీళ్ళకి చన్నీళ్ళుగానూ పప్పుమీద వులగంగానూ ఉన్నవాళ్ళకి బాధ లేదుగాని, ఇదే జీవనోపాధిగా పెట్టుకుని లాభంకోసం ఆశించి వ్యవహరించే వాళ్ళు ఈవృత్తి పొరపాటుగా పుచ్చుకున్న వాళ్ళు అని చెప్పాలి.

ప్రభుత్వంవాళ్ళు సూచించినంత ఆదర్శప్రాయంగానూ కాదు బోధనఅనేది ఒకవర్తకవ్యాపారంఅని ఇందులోజొరబడి గోలెత్తేవాళ్ళు సూచించుతూండేటంత ప్రత్యేకప్రాయంగానూకాదు. మధ్యరంగంలో సగటుమేష్టరు జీవితం నడుస్తూంటుంది. భౌతిక వస్తుదారిద్ర్యం క్లిష్టపరిస్థితులూ ఉన్నాసరే: అనగా పాఠశాలపెత్తనం చేసేవారు సొమ్మువదలనిబాపతైనాసరే, తండ్రులు పరమ మూర్ఖులై తమపిల్లలపశుత్వం వదగొట్టించడానికి బడికి పంపడం నష్టం అనుకునేబాపతైనాసరే —మేష్టరుయొక్క ఆవేశం, స్వార్థత్యాగం కొరవడకూడదని శాసించాడు. అనగా పెత్తందార్లనీ తండ్రుల్నీ కుదించి

ష్టర్ని దండించడంవల్ల అనత్కు రాస్యత మాయదు. అధిష్ఠాన
ాలేక, పరికరాలూ లేక కర్త అనేవాడు ఏ చేష్టా చెయ్య
కు, అదృష్టమూ కలిసిరాదు. పిల్లలు హాజరు కాగలపూచీ,
హాజరు కాకుండా ఉండగల పూచీ మేష్టరుమీద పెట్ట
లో ధర్మంలేదు.

ఈ వేళ కాకపోతే రేపు, ఒకరు కాకపోతే మరొకరు ఉపా
ధ్యాయుల. మొరలు విని బోధనకి అత్యంతంగా సానుకూలపరిస్థి
లు ఏర్పాటుచేశారని అనుకుందాం. అప్పుడుకూడ మేష్టరు
ప్రభుత్వపుచట్టంలోనూ, సూత్రాల్లోనూ, ప్రణాళికలోనూ లేని
న్నికొన్ని ప్రాథమిక ధర్మాలు అవలంబించగలిగితేనే మేష్టరీ
స్యాలి. భౌతికలాభంకోసం పాకులాడేవాడు ఇందులో
డకూడదు సరిగదా భౌతికలాభాల్ని తృణీకరించాలి. అనగా
డు మనసా సన్యసించాలి. అతడు బడి నిమిత్తం జీవించాలి.
డు జవసత్వాలుగలిగి శక్తివంతమైన మనస్సుగలిగిఉండాలి
ని యంత్రప్రాయమైనిల్చిపోయిన మనసుగలిగిఉండకూడదు,
వల్లవచ్చిన ప్రమాదాన్ని శిష్యుడు చూపించినా దిద్దుకోవాలి.
... టు కరుకుతనంగలిగి ఉన్నవాడు కాని మేష్టరీ
... తన్ని ఒక్కణ్ణిబట్టి విద్యార్థులు స్కూలు
... ంచేటట్టు చెయ్యగలవాడు మేష్టరీచెయ్యాలి
లో ప్రతిదినమూ తానొకవిద్యార్థియై యున్నంతచు
గా ఆసక్తితో నవ్యవృత్తాంతగ్రహణము చెయ్యగలవాడు
ష్టరీలో ఉండాలి. విద్యార్థియొక్క అభివృద్ధికోరి పనిచేయ
లో మొదట వాడి మత నైతిక నియమాలగురించీ, తరువాత

వాడి సత్ప్రవర్తనగురించీ, తరువాత వాడి మేధాసామర్థ్యం యొక్క ఉద్ధరణగురించీ ప్రయత్నించేవాడు ఉత్తమ అధ్యాపకుడు. పైలక్షణాలుగల అధ్యాపకుడు ఆర్నాల్డ్ అనే ఇంగ్లీషు మేష్టరు. అతని బోధకి పునాది మతం అనకూడదుట, ఆ[illegible] బోధనని మతపరం చేశాడనాలట!

మేష్టర్లు రాజకీయాల్లో జోక్యం కలుగజేసుకోకూడదు: పైవారు శాసించనక్కర్లేదు. రాజకీయపు పిల్లిమంత్రాలు వెయ్యడం మొదలెట్టిన మేష్టరు బోధనకి పనికిరాడు. బోధనకి కావలసిన స్థిరత్వం నిశ్చలత్వం నిదానం అతనికి ఉండవ్. స్థి[illegible] జ్ఞానం బోధచేసేవాడికి చంచలపరిస్థితులలో పక్షావలంబనం ఆ కర్షణీయంగా కనపడకూడదు. అతడు పక్షపాతం ద్వేషించాలి. సరే రాజకీయంకూడదన్నారుగాని మేష్టరుకి, మతంకూడదన్లేదే! భాషాజ్ఞానం కూడక్కర్లేదు. శాస్త్రాలు, కళలు ఇవేమీ వద్దని ఎవరూ పట్టుపట్టలేదే! చాలామంది ఎందుకోకృషి చెయ్యరు మతం అంటే చెబుతాను, ఇస్లామూ క్రీస్తుమతమే నయం వాటిలో కొంతేనా నియమానుసరణం ఉంది. హిందూమతం అని కొందరు వ్యక్తులు రాసుకుంటారు. అదేమిటో దాని విధులూ బాధ్యతలూ ఆచరణా ఏమిటో తెలియకుండాను అటువంటివారు మేష్టరీలో ఉండి మేష్టరీ చేస్తున్నాం అనుకోడం సాహసం. అదంతేఏమిటో అదెక్కడ దొరుకుతుందో ఎరుగని ఏ మేష్టరుదగ్గిరైనా గురికే చదివిన కుర్రాడికిఅదిఎట్లా తె[illegible] స్తుంది? దృఢమైన మతజ్ఞానం లేనప్పుడు దైవభక్తి పా[illegible] మేష్టరికి ఎక్కణ్ణించివస్తాయి? తన విలువ కట్టేవాడు దేవ[illegible]

తప్ప మరోడు ఉండజాలడు అని నమ్మకంలేనివాడు సొంతంగా మేష్టరీ ఎల్లాచేస్తాడు? ఇనస్పెక్టరు ఒకనాడొచ్చి మేష్టర్ని ఏం తణిఖీ చెయ్యగలడు? ఆవేళ వేషం భాషా బాగుంటే బాగున్నట్టూను లేకపోతే మాసినట్టూనా? పాఠం బాగులేదని రిమార్కు చేసిన తణిఖీదార్ని ఆ పాఠం చెప్పిచూపించమంటే, ఆపని తనదికాదంటాడు, అధికారరీత్యా కపడ్దార్ అని కూడ అనగలడు. అదికాక భాషలో మేష్టరు ఎంత ఆప్యాయంగా కృషి చెయ్యాలి! తెలుగులిపి ప్రపంచలిపులన్నింటిలోనూ ఎంత ప్రశస్తమైనది? ముత్యాలకోవలాగ దస్తూరీ ఉండాలంటారే, ముళ్ళకంపలాగ దస్తూరీతో కుర్రాణ్ణి తయారుచేసినవాణ్ణి ఏమనాలి? స్కూలు ఫైనలుక్లాసులోకి వచ్చింతరువాత కుర్రాణ్ణి అల్లాంటివాణ్ణి పట్టుగుని దారిని పడెయ్యడం ఎంతఅసంభవం! గుణింతాల్లో విశేషాలు ఎన్నిచూడాలి! 'హ' అనే అక్షరంతో వచ్చే సంయుక్తాక్షరాలు పలకడం ఎంత నేర్చి నేర్పాలి? ఏ భాషలోకంటె ఎక్కువగాఉండే తెలుగులోని సంధి సూత్రాలమాటేమిటి? చ జ శ అనే అక్షరాలకి మాత్రమే ఉండి కడం హల్లులకి తాలవ్యాలు లేకపోడం అనేది గమనించి ఆవిధమైన సంస్కారం చేసుగోడం ఎప్పుడు? ఇవి ఇట్లాఉంచి, తెలుగుమహాకావ్యాల్లోని ముఖ్యఘట్టాలు (అధమం) చదివి ఆనందించడం ఎప్పుడు? నేను పైనసూచించినవన్నీ డబ్బుతో నిమిత్తంలేనివేకద? నాట్యం, ఉపన్యాసం, ఈరెండేకాక అభిలాషల్ని బట్టి లలితకళలలో ఏ ఒకటేనా పట్టుగుని ప్రతిమేష్టరూ ఎందుకు ఉపాసన చెయ్యరాదు? అది జీవితదృక్ప

ధాన్ని ఎంతవరకు ర్చగలదు? నాకర్థంకి ఎంతవీలు? మళ్ళీ
సూత్రాలు సంగతులే, ఆ బోధనా పద్ధతులే ఆ జీతాల హెచ్చింపు
మాట్లాడుకునేబదులు, ఉపాధ్యాయులు ఇటువంటి మానసిక భ
వృద్ధికీ ఆత్మాభివృద్ధికీ తోడ్పడే దారులు ఎందుకు తొక్కకూ
డదు! ఇవి పిల్లలకి అత్యంతంగా లాభదాయకం అనేమాట
అటుంచి మేష్టరికి కూడా ధైర్యం, వ్యక్తిత్వం, అర్హత
ఉత్సాహం ఇస్తాయిగదా! తీరిక చిక్కినప్పుడు కవనమో
చిత్రకళో, శిల్పమో అభ్యసించి సాగిస్తే వ్యాసంగం వి
లం అయితీరుతుందని అందరూ నమ్ముతారు కదా! స్వధర్మ
అయిన బోధనకి నియమితకాలం ప్రతిరోజూ గడిపి మిగిలిన ఇతర
సమయాలలో ఇవి అవలంబించకూడదు అని శాసనం లేదే

కాబట్టి, బోధనలో ఉండే పరమార్థమూ, బోధన
యొక్క ఆదర్శమూ, బోధనలో ప్రత్యక్షంగా కనిపి
చిక్కులూ, బోధనయొక్క పరమావధీ, బోధనలో ప్ర
తారకంగా ఉండే తరుణాలూ సంగ్రహంగా సూచించాం.
వర్ణితమైన కొందరు గురుదేవుల పద్ధతులలో నాకు న
చిన సూత్రాలు అవలంబించి ఈ వృత్తిలోనే నేనూ ఉన్నా
ఇందులో ఏ లేశమైనా అవలంబనీయమే అని మీకు తోస్తే
నాకు కావలసిందే. అట్లా తోచకపోయినా, నాకు తెలి
వరకు యథార్థం చెప్పాను. మరి సెలవ్.

[25-1

సంపూర్ణం